సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా కూనంనేని
దేశంలోనే సంపన్న సీఎం చంద్రబాబు
5.5 కోట్ల వీసాల నిశిత పరిశీలన: ట్రంప్
నివాస రుజువుగా ఆధార్ చెల్లుతది: సుప్రీం
మళ్లీ భారత్‌లోకి టిక్‌టాక్?
... లోపలిపేజీల్లో

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం మన పత్రిక

NAMASTE TELANGANA


శనివారం SATURDAY 23.8.2025 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+4 Pages: 12+4

సంపుటి (Volume): 15 ‖ సంచిక (Issue): 79 ‖ వెల (Price) రూ.6.50

శనివారం, సూర్యోదయం: 6-01, సూర్యాస్తమయం: 6-36. శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం వర్ష రుతువు శ్రావణ మాసం తిథి: అమావాస్య పగలు 11-37 వరకు. నక్షత్రం: మఖ రాత్రి 12-55 వరకు. వర్జ్యం: పగలు 12-34 నుంచి పగలు 2-13 వరకు. రాహుకాలం: ఉదయం 9-10 నుంచి ఉదయం 10-44 వరకు. దుర్ముహూర్తం: ఉదయం 6-01 నుంచి ఉదయం 7-43 వరకు. అమృతకాలం: రాత్రి 10-26 నుంచి రాత్రి 12-05 వరకు.

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline


Views of Telangana State for NWDA 6th Consultation Meeting
(Venue:BOCE Hall, Jalasoudha Building Hyd. Date:22.08.2025 @11:00AM)

Item No: 6.1: Confirmation of 5th Consultation MoM Dt 10.11.2023.

1) The Minutes of the 5th Consultation meeting is confirmed.

Item No. 6.3: Phase-I Proposal of Godavari-Cauvery Link (4189 MCM/ 148TMC) & Bedti Varada Link (524 MCM/ 18.5TMC).

1) The State has in-principle accepted for this proposal. The following concerns have been regularly raised and brought to NWDA notice which remain unaddressed & are reiterated:

a) Benefits - Telangana has sought 50% (74 TMC) of the proposed 148 TMC water diversion but is allocated 45 TMC. It is reiterated for 50% benefit to the state in view of the large areas of the state (Drought prone & Backward areas) yet to be provided with assured irrigation.

b) Source – Telangana accepts for Inchampally Project to be the source for the GC Link proposal subject to the following:

i. Expedite the approvals of clearances of all pending projects of the state based on assured waters for utilization of 968 TMC.

ii. Chhattisgarh acceptance for utilisation of 148TMC assured water from its unutilised share.

iii. The requirements of 152.17TMC (GLIS-38.16TMC, Sammakka Sagar - 46.96TMC, Integrated Seethamma Sagar & SRLSP - 67.05TMC) to be 1st charge on priority.

ఇచ్చంపల్లి ప్రాజెక్టుకు రేవంత్ సర్కారు అంగీకారం



మేడిగడ్డకు మరణశాసనం

బాబు కోసం బనకచర్ల.. మోదీ కోసం ఇచ్చంపల్లి!

తెలంగాణ నోట్లో మట్టికొడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

'ఒక్క పిల్లర్ కుంగిన మేడగడ్డ బరాజ్‌ను ప్రభుత్వం ఎందుకు మరమ్మతు చేయడం లేదు?' అని బీఆర్‌ఎస్, నమస్తే తెలంగాణ ఎప్పటినుంచో ప్రశ్నిస్తున్నయ్. దీని వెనుక కాళేశ్వరాన్ని నిర్వీర్యం చేసే పెనుకుట్ర దాగున్నదని మొత్తుకున్నయ్. ఆ అనుమానాలే నిజమైనయ్, మొదట మేడిగడ్డకు, తర్వాత మొత్తం కాళేశ్వరం ప్రాజెక్టుకు మరణశాసనం రాసేందుకు రంగం సిద్ధమైంది. బీజేపీ-తెలుగుదేశం-కాంగ్రెస్ మేడిగడ్డపై ముప్పేట దాడి చేయబోతున్నయ్. మేడిగడ్డను నిండు గోదారిలో నిలువునా ముంచేసే ఇచ్చంపల్లికి రేవంత్ నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కారు సూత్రప్రాయంగా ఆమోదం తెలిపింది. కింద బనకచర్ల పేరుతో ఏపీ పట్టుకుపోతే.. పైన కావేరి కథ చెప్పి కేంద్రం ఎత్తుకుపోతే.. గోదావరి నీళ్లు లేక గోస పడబోతున్నది తెలంగాణ. ఇదీ భవిష్యత్ చిత్రం.

ఏపీ కోసం బనకచర్ల! తమిళ నాడు కోసం ఇచ్చంపల్లి!
బాబు కోసం బనకచర్ల! మోదీ కోసం ఇచ్చంపల్లి!


ఇచ్చంపల్లిపై ఇంకో 'ఇచ్చంత్రం' ఏమిటంటే.. బీజేపీ అధికారంలో ఉన్న ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర కేంద్రం పెట్టిన ప్రతిపాదనపై అభ్యంతరం వ్యక్తంచేశాయి కానీ తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం మోదీ సర్కారు ప్రతిపాదనకు తలూపి వచ్చింది. 'బడే భాయ్' మాటను ఎదిరించలేక.. బేలగా, బేషరతుగా సమ్మతి తెలిపింది. గోదావరిలో మొత్తం 968 టీఎంసీల మన న్యాయమైన వాటాకుగాను ఇంకా 460 టీఎంసీలు తెలంగాణకు హక్కుగా దక్కాల్సి ఉన్నది. వాటినీ వదిలేసింది రేవంత్ ప్రభుత్వం. కనీసం మాటమాత్రంగానైనా ఆ వాటాను ప్రస్తావించలేదు. ముష్టి 74 టీఎంసీల కోసం కేంద్రాన్ని దేబిరిస్తున్నది!

ఇది కాంగ్రెస్ చేస్తున్న మరో చారిత్రక ద్రోహం
జల కాళేశ్వరానికి రాస్తున్న మరణశాసనం!

వ్యతిరేకించిన ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర బీజేపీ ప్రభుత్వాలు
ప్రాజెక్టు ప్రతిపాదనకు తలూపి వచ్చిన రాష్ట్ర ప్రభుత్వం
ఇచ్చంపల్లి పూర్తయితే మేడిగడ్డ బరాజ్ బొందిగె పిసికినట్టే!
కాళేశ్వరాన్ని ఖతంచేసే కుట్రలో బీజేపీ-టీడీపీ-కాంగ్రెస్
జలసౌధలో ముగిసిన ఎన్‌డబ్ల్యూడీఏ కన్సల్టేషన్ భేటీ



హైదరాబాద్, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ) : ఏకంగా తెలంగాణ గడ్డ మీదనే.. తెలంగాణకు ఆయువుపట్టులాంటి మేడిగడ్డ బరాజ్‌కు మరణశాసనం లిఖించేందుకు కాంగ్రెస్ సిద్ధమైంది. ఇచ్చంపల్లి బరాజ్ నిర్మాణానికి ఎన్‌డబ్ల్యూడీఏ చేసిన ప్రతిపాదనలకు పచ్చజెండా ఊపింది. రాష్ట్రాల కన్సల్టేషన్ మీటింగ్‌లో ఈ మేరకు ఆమోదం తెలిపింది. ఇప్పటివరకు ఇచ్చంపల్లి ప్రాజెక్టును వ్యతిరేకించిన ఏపీ కూడా అందుకు తాజాగా అంగీకారం తెలపడం కుట్రలను బయటపెడుతున్నది. 'గోదావరి జలాల్లో మా వాటా జలాల మళ్లింపునకు ఎట్టిపరిస్థితుల్లో ఒప్పుకోం. ట్రిబ్యునల్ కేటాయించిన మేరకు వాటా జలాల వినియోగానికి ప్రాజెక్టులను చేపడుతున్నాం' అంటూ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం తేల్చిచెప్పింది. వాటా జలాలకు ఎలాంటి నష్టం ఉండబోదని › 2వ పేజీలో




- మేడిగడ్డ FRL (100మీ) > ఇచ్చంపల్లి FRL (87మీ)
- ఇచ్చంపల్లి FRL (87మీ) > సమ్మక్క FRL (83మీ)
- ఇచ్చంపల్లి డ్యామ్ వలన మేడిగడ్డ + సమ్మక్క బరాజ్ రెండూ డౌన్‌స్ట్రీమ్ ముంపునకు గురవుతాయి
- మేడిగడ్డ ఫ్లోటింగ్ ఫౌండేషన్ డిజైన్ – పునాది ఎప్పుడూ నీటిలో ఉండటం వల్ల నిర్మాణం బలహీనపడే ప్రమాదం ఉన్నది.

ఫలితం: మేడిగడ్డ బరాజ్ శాశ్వతంగా ప్రమాదంలో పడుతుంది

'జలవివాద' కమిటీపై ఉత్తమ్ ఆగ్రహం

తనకు తెలియకుండా పేర్లు ప్రతిపాదించడంపై సీరియస్
ఎవరితో చర్చించి ఖరారు చేశారని మండిపాటు
తాత్కాలికంగా ఫైల్‌ను పక్కనబెట్టిన అధికారులు › 2



ఘోష్ రిపోర్టు బయటకెలా వచ్చింది?

పబ్లిక్ డొమైన్‌లో పెట్టి ఉంటే వెంటనే తొలగించండి
అసెంబ్లీలో పెట్టకముందే ఎలా బహిర్గతమైంది?

ఇది పిటిషనర్ల పరువు ప్రతిష్టలతో ముడిపడిన అంశం
ముఖ్యమంత్రి పీపీటీ ప్రజంటేషన్‌తో ఆందోళన సహజం
కాళేశ్వరం నివేదికపై విచారణలో హైకోర్టు వ్యాఖ్యలు
ప్రభుత్వానికి, పీసీ ఘోష్ కమిషన్‌కు నోటీసులు జారీ
మూడువారాల్లోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశం
తదుపరి విచారణ ఐదు వారాలకు వాయిదా

హైదరాబాద్, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టులోని మూడు బరాజ్‌లపై జస్టిస్ పీసీ ఘోష్ సమర్పించిన నివేదికను ప్రభుత్వం సంక్షిప్తంగా నోట్ తయారుచేసి బయటపెట్టడాన్ని హైకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. ఈ విషయంలో ముఖ్యమంత్రి, రాష్ట్ర ప్రభుత్వం అత్యుత్సాహం ప్రదర్శించారని అభిప్రాయపడింది. రిపోర్టును అసెంబ్లీలో ప్రవేశపెట్టి, చర్చించాకే తగిన నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నప్పుడు పవర్ పాయింట్ ప్రజంటేషన్ (పీపీటీ) చేయాల్సిన అవసరం ఏమున్నదని నిలదీసింది. స్వయంగా ముఖ్యమంత్రే పీపీటీని ప్రదర్శించడాన్ని తప్పుపట్టింది. ఈ సంక్షిప్త నివేదికను పబ్లిక్ డొమైన్స్ నుంచి వెంటనే తొలిగించాలని ఆదేశించింది. ఘోష్ కమిషన్ ఏర్పాటుచేస్తూ జారీచేసిన జీవోను రద్దు చేయాలని, విచారణ చట్ట నిబంధనలకు అనుగుణంగా జరగనందున కమిషన్ రిపోర్టుపై స్టే ఇవ్వాలని కోరుతూ మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్లపై శుక్రవారం వాదనలు కొనసాగాయి. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఏకే సింగ్, జస్టిస్ జీఎం మొహియుద్దీన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం వాదనలు విన్నది. 'కమిషన్ రిపోర్టును అసెంబ్లీలో ప్రవేశపెట్టి చర్చించాక ఏం చేయాలో నిర్ణయం తీసుకుంటారా? లేక చర్యలు తీసుకున్నాక అసెంబ్లీలో › 2వ పేజీలో

నివేదికలో కేసీఆర్, హరీశ్‌పై వ్యక్తిగత ఆరోపణలు లేవు

ప్రభుత్వపరమైన వైఫల్యాలే ఉన్నాయి.. హైకోర్టుకు తెలిపిన అడ్వకేట్ జనరల్ › 2

యూరియా లేదు.. ఆగ్రహం ఆగలేదు!!





ఇచ్చే ఒక్క బస్తా యూరియా కోసమైనా రోజులతరబడి బారులు తీరి, ఓపికగా ఎదురుచూసిన రైతుల్లో క్రమంగా సహనం చచ్చిపోతున్నది. ఆగ్రహం కట్టలు తెంచుకుంటున్నది. తెల్లవారుజామున వచ్చి టోకెన్లు తీసుకుంటే.. సాయంత్రం 4 గంటలైనా పంపిణీ మొదలవకపోవడంతో వనపర్తి జిల్లా ఆత్మకూరులో రైతులు మండిపడ్డారు. రేపు రమ్మంటూ అధికారులు చెప్పడంతో ఆగ్రహంతో ఇలా రాళ్లు విసిరారు. మరోవైపు యూరియా స్టాక్ లేదంటూ అయిజ సింగిల్ విండో కార్యాలయం వద్ద పెట్టిన బోర్డు! › 5

ఇప్పటికి రాలిన మట్టిపూలు 542 › 4

ఇద్దరు రైతుల బలవన్మరణం

అప్పులు, ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య
మహబూబాబాద్, మెదక్‌లో ఘటనలు

యూరియా కొరత వాస్తవమే

సీఎం రెండు సార్లు ఢిల్లీ వెళ్లినా ఫలితం లేదు
కేంద్రం వైఖరితో రైతులకు యూరియా కష్టాలు
రైతుల నిరసనతో మంత్రి పొన్నం ఒప్పుకోలు
ఆయన ముందే కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నినాదాలు
సమాధానం చెప్పకుండా వెళ్లిపోయిన పొన్నం

అక్కన్నపేట, ఆగస్టు 22: రాష్ట్రంలో యూరియా కొరత వాస్తవమేనని బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా అక్కన్నపేటలో 'పనుల జాతర' కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లిన ఆయన సొసైటీ వద్ద యూరియా కోసం క్యూకట్టిన రైతులతో మాట్లాడారు. మంత్రి రాగానే వందలాది మంది రైతులు ఆయన చుట్టూ గుమిగూడారు. యూరియా కొరతపై నిలదీశారు. 'కాంగ్రెస్ వచ్చింది... యూరియా కొరత మోపైయింది' అంటూ › 4వ పేజీలో



కేక్ తినిపించిన చేతుల్తోనే

గొంతుకోసి!

చోరీకి వచ్చి బాలికను చంపిన పక్కింటి టెన్త్ క్లాస్ విద్యార్థి
గొంతుపై 18 కత్తిపోట్లు › 12
వీడిన సహస్ర హత్య కేసు మిస్టరీ

పుట్టినరోజునే తలకొరివి
బాధాకరం

ఇటువంటి స్థితి ఎవరికీ రాకూడదు
ఆరు కుటుంబాల మనోవేదనకు ఎవరు బాధ్యత వహిస్తారు
రామంతాపూర్ విద్యుదాఘాతం ఘటనపై హైకోర్టు › 2



(1942-2025)

సీపీఐ అగ్రనేత సురవరం కన్నుమూత

అనారోగ్య కారణాలతో హైదరాబాద్‌లో తుదిశ్వాస
విద్యార్థి నేత నుంచి సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి వరకు కొనసాగిన ప్రస్థానం
తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో మద్దతు ఇచ్చిన నేత
నల్లగొండ నుంచి రెండుసార్లు ఎంపీగా ప్రాతినిధ్యం
సురవరం మృతిపై పలువురు ప్రముఖుల సంతాపం
తెలంగాణ మట్టిబిడ్డ సుధాకర్‌రెడ్డి: కేసీఆర్

హైదరాబాద్, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ): సీపీఐ అగ్రనేత, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి (83) కన్నుమూశారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు దవాఖానలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి తుదిశ్వాస విడిశారు. సీపీఐ రాష్ట్ర మహాసభలు మూడు రోజులుగా హైదరాబాద్ శివారులోని జరుగుతుండగా, శుక్రవారం నూతన కమిటీ ఎన్నికతో సభలు ముగిశాయి. ఇంతలోనే సురవరం మరణ వార్త తెలియడంతో సీపీఐ నాయకులు, కార్యకర్తలు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. సురవరం మరణం విషయం › 2వ పేజీలో



కేటీఆర్, కౌశిక్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు

కేటీఆర్ సమక్షంలో చేరికలు

హైదరాబాద్, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్, బీజేపీలకు చెందిన మాజీ సర్పంచులు, కీలక నేతలు పెద్ద సంఖ్యలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి నేతృత్వంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ముఖ్య అనుచరులు ఆ పార్టీని వీడి గులాబీ కండువా కప్పుకొన్నారు. కాంగ్రెస్ నుంచి పలువురు మాజీ సర్పంచులు, కీలక నేతలు బీఆర్‌ఎస్‌లో చేరగా వారికి కేటీఆర్ గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడంలో కాంగ్రెస్ విఫలం కావడం, ప్రజల్లో ఆ పార్టీపై పూర్తిస్థాయిలో వ్యతిరేకత రావడం వంటి కారణాలతో జమ్మికుంట మండలానికి చెందిన పలువురు మాజీ సర్పంచులు, కీలక నేతలు కాంగ్రెస్‌కు రాజీనామా చేసి బీఆర్‌ఎస్‌లో చేరారు. వారిలో తనుగుల మాజీ సర్పంచ్ రామస్వామి, శంభునిపల్లి మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్‌రెడ్డి, పాపక్కపల్లి మాజీ సర్పంచ్ మహేందర్, శాయంపేట మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి, నాగంపేట మాజీ సర్పంచ్ భద్రయ్య, రాచపల్లి సదానందం, జైత్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌ది రాక్షస పాలన

కాంగ్రెస్ మోసపూరిత పాలనతో ప్రజలు విసిగిపోయారని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి విమర్శించారు. రైతులు సహా అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. కేసీఆర్ పాలనలో తెలంగాణలో రామరాజ్యం నడిచిందని, ఇప్పుడు రాక్షస పాలన నడుస్తున్నదని మండిపడ్డారు. రాష్ట్ర ప్రజలంతా బీఆర్‌ఎస్ వైపే చూస్తున్నారని, ఇకనుంచి రాబోయే అన్ని ఎన్నికల్లో గులాబీ పార్టీ జయకేతనం ఎగురవేస్తుందని ధీమా వ్యక్తంచేశారు.



ఇటీవల సిరిసిల్లకు వచ్చిన సందర్భంగా కేటీఆర్‌కు రాఖీ కడుతున్న విద్యార్థిని శ్రీలక్ష్మి

పేద విద్యార్థినికి కేటీఆర్ చేయూత

- బీటెక్ కాలేజీ ఫీజు రూ.లక్షా 12 వేలు చెల్లించిన కేటీఆర్
- కృతజ్ఞతలు తెలిపిన విద్యార్థిని, కుటుంబసభ్యులు

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 22: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. సిరిసిల్ల పట్టణంలో ఇటీవల పర్యటించిన సందర్భంలో ఆయన 32వ వార్డులోని మాజీ కౌన్సిలర్ సయ్యద్ సీమాబేగం-అక్రం ఇంటికి వెళ్లారు. అక్కడికి వచ్చిన పసుల శ్రీలక్ష్మి అనే విద్యార్థిని ఆయనకు రాఖీ కట్టి కుటుంబ పరిస్థితులను వివరించి, ఉన్నత చదువులకు సహకరించాలని కోరింది. కేటీఆర్ స్పందించి ఆమె వివరాలను తీసుకున్నారు. హైదరాబాద్‌లోని శ్రీదేవి ఉమెన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం ఫీజు రూ.లక్షా 12 వేలు చెల్లించి సీటు ఇప్పించారు. ఈ సందర్భంగా విద్యార్థిని శ్రీలక్ష్మి కేటీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

గౌడ్‌లకు 25శాతం రిజర్వేషన్ ఇవ్వాల్సిందే

- కుల వృత్తులను ఏమాత్రం పట్టించుకోకుండా గాలికి వదిలేసిన సర్కార్
- హైదరాబాద్‌లో కల్లు దుకాణాల బంద్ వెనుక సర్కార్ కుట్ర
- గొల్లకుర్మలకు ఇస్తామన్న 3 లక్షలు ఎక్కడపోయినయ్!
- గీత కార్మికులపై అక్రమంగా పెట్టిన కేసులు ఎత్తివేయాలి
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్



హైదరాబాద్‌లోని గన్‌పార్క్ వద్ద నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్. చిత్రంలో కల్లుగీత సంఘాల నాయకులు

హైదరాబాద్/సుల్తాన్‌బజార్ ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో అలవిగాని హామీలు ఇచ్చి.. ఓట్లు వేయించుకొని అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయడం మరిచిపోయిందని మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. ఎన్నికలకు ముందు గౌడన్నలకు వైన్‌షాపుల్లో 25 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని చెప్పి.. మ్యానిఫెస్టోలో పెట్టి, తీరా నోటిఫికేషన్ నాటికి ఆ హామీని అమలు చేయలేదని మండిపడ్డారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుచేయాలని డిమాండ్ చేస్తూ.. శుక్రవారం హైదరాబాద్‌లోని గన్‌పార్క్ వద్ద గౌడ సంఘాల నేతలు చేపట్టిన నిరసన కార్యక్రమంలో శ్రీనివాస్‌గౌడ్ సాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇష్టారాజ్యంగా హామీలు ఇచ్చి.. దొడ్డిదారిన అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు, మహిళలకు, నిరుద్యోగులకు, విద్యార్థులకు, కులవృత్తుల వారికి ఇచ్చిన హామీలను గాలికి వదిలేసిందని మండిపడ్డారు. హైద్రాబాద్‌లో కల్లు దుకాణాల మూసివేత వెనుక కాంగ్రెస్ సర్కార్ కుట్ర దాగి ఉందని ఆరోపించారు. మద్యం మాఫియాకు తలొగ్గి.. కల్లుగీత కార్మికుల పొట్ట కొడుతున్నారని విమర్శించారు. గొల్లకుర్మలకు ఇస్తామని చెప్పిన రూ.3 లక్షలు ఎక్కడ అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే.. కుల వృత్తులను గాలికి వదిలేసిందని మండిపడ్డారు. తెలంగాణలో రెండేండ్లలో తాటి, ఈత చెట్లపై నుంచి ప్రమాదానికి గురై 1,145 మంది గీత కార్మికులు చనిపోయారని, తక్షణమే వారి కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. హైద్రాబాద్‌లో మూసివేసిన కల్లు దుకాణాలను వెంటనే తెరిపించాలని అన్నారు. జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న పేరు పెట్టాలని చెప్పారు. వైన్‌షాపులలో గౌడ్‌లకు కాంగ్రెస్ పార్టీ 25% ఇస్తామని ఇచ్చిన హామీని నిబెట్టుకోవాలన్నారు. గౌడ్‌లపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాలరాజుగౌడ్, గౌడ కల్లుగీత వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఐలి వెంకన్నగౌడ్, గౌడ ఐక్యసాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు అంబాల నారాయణగౌడ్, బీసీ సమైఖ్యత అధ్యక్షుడు ఎస్ దుర్గయ్య గౌడ్, జీబీఎన్ చీకటి ప్రభాకర్ గౌడ్, దామోదర్ గౌడ్, రాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ రాకెట్ కేసులో మత్తు వైద్యుడి అరెస్ట్

ఏ24 సంతోష్ నాయుడును ఏలూరులో పట్టుకున్న సీఐడీ

హైదరాబాద్, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ): మానవ అవయవాల అక్రమ రవాణా కేసులో మరో నిందితుడిని తెలంగాణ సీఐడీ పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో ఇప్పటికే 19 మంది నిందితులను అరెస్టు చేశామని, తాజాగా విశాఖపట్నంకు చెందిన 24వ నిందితుడు (ఏ24) డాక్టర్ దుట్టాల వెంకటరామ సంతోష్ నాయుడును శుక్రవారం ఏలూరులో అరెస్టు చేసి హైదరాబాద్ ఎల్బీనగర్‌లోని న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చామని డీజీ చారుసిన్హా ప్రకటించారు. అనస్థీషియన్‌గా పనిచేస్తున్న వెంకటరామ సంతోష్ నాయుడు ఈ కేసులోని ఇతర నిందితులైన రాజశేఖర్, అవినాశ్ తదితరులతో కలిసి హైదరాబాద్‌లో పలు హాస్పిటల్స్‌లో అక్రమ కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సల్లో పాలుపంచుకున్నట్టు సీఐడీ దర్యాప్తులో తేలిందని వెల్లడించారు. దాతలు, గ్రహీతలకు అనస్థీషియా ఇచ్చేందుకు ప్రధాన నిందితుడు పాములపాటి పవన్ సంతోష్‌ను హైదరాబాద్ రప్పించేవాడని, శస్త్రచికిత్సకు సంతోష్ రూ.2.5 లక్షలు తీసుకునేవాడని వివరించారు.

మోదీ పాలనలో తెలంగాణకు తీరని ద్రోహం

- విభజన చట్టంలోని హామీల అమలులో బీజేపీ సర్కార్ విఫలం
- రాష్ట్రానికి ఒక్క కొత్త ప్రాజెక్టు కూడా ఇవ్వకుండా మోసం
- కేంద్రంపై బీఆర్‌ఎస్ నేత పుట్టా విష్ణువర్ధన్‌రెడ్డి ఫైర్



తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ): ప్రధాని నరేంద్ర మోదీ పదకొండేండ్ల పాలనలో తెలంగాణకు తీరని ద్రోహం జరిగిందని బీఆర్‌ఎస్ నేత పుట్టా విష్ణువర్ధన్‌రెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. విభజన చట్టంలోని హామీల అమలులో కేంద్రం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. చట్టం ప్రకారం ఇవ్వాల్సిన నిధులు తప్ప, కొత్తగా ఒక్క ప్రాజెక్టు కూడా మంజూరు చేయలేదని విమర్శించారు. రైల్వేకోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు పరిశ్రమ ఇవ్వకుండా మొండిచెయ్యి చూపిందని ఆరోపించారు. లక్నో మెట్రోకు రూ.8,500 కోట్లు ఇచ్చిన కేంద్రం, హైదరాబాద్ మెట్రో విస్తరణకు పైసా ఇవ్వకుండా తీవ్ర అన్యాయం చేసిందని ధ్వజమెత్తారు. ఈ విషయంలో బీజేపీ ఎంపీలు బహిరంగ చర్చకు సిద్ధమా? అని సవాల్ విసిరారు.

అదానీ, అంబానీలకు దేశ సంపద ధారాదత్తం

గుజరాత్‌కు చెందిన మోదీ, అమిత్‌షా దేశ సంపదను అదానీ, అంబానీలకు ధారాదత్తం చేస్తున్నారని ఆరోపించారు. లక్షల కోట్ల కాంట్రాక్టులను వారి కంపెనీలకే కట్టబెడుతూ కార్పొరేట్ దోపిడీకి తెరలేపారని నిప్పులు చెరిగారు. రష్యా నుంచి క్రూడాయిల్ సరఫరా చేసుకుంటున్నామనే నెపంతో భారత్‌పై అమెరికా 50 శాతం టారిఫ్ విధించిందని పేర్కొన్నారు. రష్యాపై అమెరికా, ఈయూ నిషేధం విధించడంతో గత్యంతరంలేని పరిస్థితుల్లో భారత్‌కు క్రూడ్‌లో భారీ డిస్కౌంట్ ఇస్తున్నదని తెలిపారు. దీనిని సాకుగా చూపి ట్రంప్ ప్రభుత్వం భారత్‌పై కత్తిగట్టిందని ఆరోపించారు. ట్రంప్ టారిఫ్‌లతో దేశ ప్రజలపై రూ.5లక్షల కోట్ల భారం పడనున్నదని, ముఖ్యంగా టెక్స్‌టైల్, మ్యానుఫ్యాక్చరింగ్ రంగాలపై తీవ్ర ప్రభావం చూపనున్నదని ఆందోళన వ్యక్తంచేశారు. రష్యా నుంచి దిగుమతి అవుతున్న క్రూడాయిల్‌ను అధిక శాతం అంబానీ రిలయన్స్ కంపెనీ చౌకగా దిగుమతి చేసుకొని, యూరోపియన్ దేశాలకు ఎక్కువ ధరకు ఎగుమతి చేస్తున్నదని తెలిపారు. తద్వారా రూ.1.50 లక్షల కోట్లను దండుకున్నదని ఆరోపించారు. కార్పొరేట్లకు దోచిపెడుతున్న మోదీ ప్రభుత్వం మేకిన్ ఇండియా అంటూ ఊదరగొట్టడం తప్పా ఉద్ధరించింది ఏమీలేదని మండిపడ్డారు. బీజేపీ అసమర్థత పాలనతో డాలర్‌తో రూపాయి మారకపు విలువ పడిపోయే ప్రమాదం ఉన్నదని ఆందోళన వ్యక్తంచేశారు.

• ప్రభుత్వం న్యాయం చేయాల్సిందే



తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ అధ్వర్యంలో కొనసాగుతున్న భాగ్యనగర్ టీఎన్జీవోల ఆందోళన శుక్రవారంతో 38వ రోజుకు చేరుకుంది. గచ్చిబౌలిలోని భాగ్యనగర్ టీఎన్జీవో కార్యాలయం వద్ద పలువురు ఉద్యోగులు, పెన్షనర్లు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. తమకు ప్రభుత్వం న్యాయం చేయాలని, తమ భూములు తమకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. – శేరిలింగంపల్లి

పదవుల్లో సామాజిక న్యాయం ఏదీ?

- కాంగ్రెస్‌ను ఒకట్రెండు కులాలకే పరిమితం చేస్తారా?
- స్థానిక ఎన్నికలకు ముందే యాదవులకు పదవులివ్వండి
- బీఆర్‌ఎస్ హయాంలో యాదవులకు మస్తు అవకాశాలు
- కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎందుకీ దుస్థితి?
- పీఏసీకి లేఖ రాసిన కాంగ్రెస్ యాదవ నేతలు

హైదరాబాద్, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ) రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో మరోసారి పదవుల వ్యవహారం చిచ్చురేపుతున్నది. పార్టీ, ప్రభుత్వ పదవుల్లో సామాజిక న్యాయం పాటించడంలేదని, కాంగ్రెస్ పార్టీకి పునాదులే బీసీలని, అలాంటి బీసీలను విస్మరిస్తున్నారన్న అసంతృప్తి బీసీ నేతల్లో రాజుకుంటున్నది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టిన తర్వాత ఇప్పటివరకు ఇచ్చిన, ఇస్తున్న పదవుల్లో కొన్ని వర్గాలకే పెద్దపీట వేశారని, 'అసలు కాంగ్రెస్' వారికన్నా.. 'వలస కాంగ్రెస్'కే అందలం దక్కిందన్న అసంతృప్తి కార్యకర్తల్లో నెలకొన్నది. ఇదే విషయాన్ని పార్టీ కార్యకర్తలు, పలువురు సీనియర్ నేతలు తమ అసంతృప్తిని, ఆగ్రహాన్ని బహిరంగంగానే వెళ్లగక్కుతున్నారు. పలు సందర్భాల్లో పార్టీ అధిష్ఠానం దృష్టికి కూడా తీసుకెళ్లారు. తాజాగా శనివారం గాంధీ భవన్‌లో పార్టీ పొలిటికల్ అఫైర్స్ కమిటీ (పీఏసీ) సమావేశం నిర్వహించనున్న నేపథ్యంలో పార్టీలోని బీసీలు.. ముఖ్యంగా యాదవులు తమకు పదవుల్లో ప్రాధాన్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ లేఖాస్త్రాన్ని సంధించారు. శుక్రవారం నాడు పీఏసీ కమిటీ సభ్యులను వ్యక్తిగతంగా కలిసి వినతిపత్రం కూడా అందజేశారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, సీనియర్ నేతలు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, భట్టి విక్రమార్క, వీ హన్మంతరావు తదితరులకు పార్టీకి చెందిన యాదవ నేతలు లేఖ రాశారు. నామినేటెడ్ పదవుల్లో బీసీలకు, మరీ ముఖ్యంగా యాదవులకు సముచిత స్థానం కల్పించాలని, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు యాదవులు ఎంతో కష్టపడ్డారని, తొలి నుంచి పార్టీకి అండగా ఉన్న యాదవులకు మంత్రి పదవి సహా ముఖ్య పదవులేమీ ఇవ్వలేదని ఆ లేఖలో పేర్కొన్నారు. ఇప్పటివరకు యాదవ సామాజికవర్గం నుంచి ఇద్దరికి మాత్రమే ప్రభుత్వ పదవులు లభించాయని, కుర్మ సామాజికవర్గానికి చెందిన బీర్ల అయిలయ్యకు విప్ పదవి, ప్రొఫెసర్ యాదయ్యకు టీజీపీఎస్సీ సభ్యుడిగా మాత్రమే అవకాశం ఇచ్చారని, ఇది కేవలం కంటితుడుపు చర్య మాత్రమేనని, దీనివల్ల యాదవ జాతికి పెద్దగా ఉపయోగం ఉండదని పేర్కొన్నారు. పార్టీలో కూడా తమకు ప్రాధాన్యం లేకుండా పోయిందని, పీసీసీ ఉపాధ్యక్షుల్లో అన్ని కులాలకు ప్రాధాన్యం ఇచ్చారని, రెడ్డి సామాజిక వర్గం నుంచి ఐదుగురు, వెలమ కులం నుంచి ఇద్దరు, ముస్లింలు, మున్నూరు కాపుల నుంచి ముగ్గురేసి ఉన్నారని, కానీ, యాదవుల నుంచి ఒక్కరు కూడా లేరని, జనరల్ సెక్రటరీల్లో 12 మంది రెడ్డీలు, మున్నూరు కాపులు ఏడుగురు, గౌడ్‌లు ఎనిమిది ఉన్నారని, యాదవుల నుంచి ఒక్కరే ఉన్నట్టు పేర్కొన్నారు.

రెడ్డి కులానికి 51 కీలక పదవులు

ఇక ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మొదలు కీలక ప్రతినిధులుగా 51 మంది రెడ్డి సామాజిక వర్గానికి చెందినవారే ఉన్నారని యాదవ నేతలు పేర్కొన్నారు. వేం నరేందర్‌రెడ్డి, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, శివసేనారెడ్డి, గుత్తా అమిత్‌రెడ్డి, కోదండరెడ్డి.. ఇలా అనేకమందిని సలహాదారులుగా, కార్పొరేషన్ల చైర్మన్లుగా నియమించారని, ఇది సామాజిక సమతుకం అవుతుందా? అని ప్రశ్నించారు. నిన్న మొన్న పార్టీలో చేరిన సీతాదయాకర్‌రెడ్డికి కూడా పదవులు ఇచ్చారని, 'అసలు కాంగ్రెస్'లో ఉన్న బీసీలను మాత్రం పదవులకు దూరంగా పెట్టారని పేర్కొన్నారు. ఇక రెడ్డి కులం తర్వాత ప్రభుత్వ, పార్టీ పదవుల్లో అత్యధిక లబ్ధి పొందింది కమ్మ కులం వారని, మొత్తంగా ప్రభుత్వంలోని కీలకమైన 12 పదవులు కమ్మవాళ్లకే ఇచ్చారని, రాష్ట్రంలో కమ్మ, వెలమ కులాల జనాభా ఎంత? వారికి వస్తున్న పదవులెన్ని? అన్న దానిపై పార్టీ అధిష్ఠానం అంచనా వేసుకోవాలని సూచిస్తున్నారు. కమ్మ సామాజికవర్గం నుంచి తుమ్మల నాగేశ్వరరావుకు మంత్రి పదవి, రేణుకాచౌదరికి రాజ్యసభ పదవి, పార్టీ మారి వచ్చిన అరికపూడి గాంధీకి పీఏసీ చైర్మన్ పదవి, గుర్రం మల్సూర్‌కు సీపీఆర్వో పదవి ఇచ్చారని, మన్నె సతీశ్, రాయల నాగేశ్వరరావు, మొవ్వ విజయబాబు వంటివారికి కార్పొరేషన్ల చైర్మన్ పదవులు ఇచ్చారని పేర్కొన్నారు.

బీఆర్‌ఎస్ హయాంలో పెద్దపీట

బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు యాదవులకు అన్ని స్థాయిల్లోనూ అవకాశాలు వచ్చాయని, మంత్రి పదవి మొదలు కార్పొరేషన్ పదవుల వరకు అనేకం వచ్చాయని, యాదవుల సంక్షేమానికి కూడా రూ.ఏడు వేల కోట్లు కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కేటాయించారని, తద్వారా యాదవ జాతికి అనేక ప్రయోజనాలు సమకూరాయని లేఖలో వివరించారు.

నిర్ణయం తీసుకోవాల్సిందే

శనివారం గాంధీభవన్‌లో జరిగే పీఏసీ సమావేశంలో పార్టీ, ప్రభుత్వ పదవులపై నిర్ణయం తీసుకుంటారని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చ ఉంటుందని యాదవ ప్రతినిధులు చెప్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ముందే యాదవులకు పదవులు ఇవ్వాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా కనీసం 6-8 జిల్లా పరిషత్ చైర్మన్ పదవులు తమకు ఇచ్చేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

మనువాద బీజేపీకి మద్దతు ఉపసంహరించుకోవాలి

మందకృష్ణకు వంగపల్లి సూచన



మాట్లాడుతున్న వంగపల్లి శ్రీనివాస్

ముషీరాబాద్, ఆగస్టు 22: మనువాద బీజేపీకి మద్దతు ఉపసంహరించుకోవాలని ఎంఆర్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ డిమాండ్ చేశారు. దళిత, బహుజనుల సైద్ధాంతిక పరమైన శత్రువు బీజేపీ అని తమిళ సినీ నటుడు విజయ్ పేర్కొన్న విషయాన్ని మందకృష్ణ గమనించాలని సూచించారు. శుక్రవారం విద్యానగర్‌లోని ఎంఆర్పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ దళిత, బహుజనల విరోధి అయిన బీజేపీతో అంటకాగడం ఆయన దిగజారుడు తనానికి నిదర్శనమని తెలిపారు. తెలంగాణలో బీజేపీకి పట్టం కట్టాలని మందకృష్ణ, మరికొందరు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఎప్పటికైనా మనువాద బీజేపీని దళిత, బహుజనులు నమ్మరని పేర్కొన్నారు. పారిశుద్ధ్య కార్మికుల సమస్యల పరిష్కారం కోసం త్వరలో తెలంగాణ వ్యాప్తంగా సైకిల్ యాత్ర చేపట్టనున్నట్టు వెల్లడించారు.

• చిన్నకోడూరుకు రైల్వేస్టేషన్ మంజూరు



కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వేలైన్‌లో భాగంగా సిద్దిపేట నియోజకవర్గం చిన్నకోడూరులో రైల్వేస్టేషన్ ఏర్పాటు కోరుతూ.. పార్లమెంట్‌లో బీఆర్‌ఎస్ ఫ్లోర్‌లీడర్ కేఆర్ సురేశ్‌రెడ్డి, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ వద్దిరాజు రవిచంద్ర, ఎంపీ, నమస్తే తెలంగాణ సీఎండీ దీవకొండ దామోదర్‌రావు జూన్‌లో కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్‌కు వినతిపత్రం అందజేశారు. దీనికి స్పందించిన కేంద్ర మంత్రి చిన్నకోడూరులో రైల్వేస్టేషన్‌తోపాటు హాల్టింగ్ పాయింట్ మంజూరు చేస్తూ గురువారం బీఆర్‌ఎస్ ఎంపీలకు ఉత్తరం రాశారు. రైల్వేస్టేషన్ మంజూరుపై చిన్నకోడూరు ప్రజలు సంతోషం వ్యక్తంచేస్తున్నారు.

జడ్జీలపై విమర్శలు పరిపాటి అయ్యింది

- ఈ ధోరణి న్యాయమూర్తుల రక్షణను దెబ్బ తీస్తుంది
- గోపనపల్లి కేసులో జస్టిస్ మౌసమీ భట్టాచార్య వ్యాఖ్యలు
- సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో జడ్జికి క్షమాపణ చెప్పిన పిటిషనర్



హైదరాబాద్, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ): ఇటీవల న్యాయమూర్తులపై విమర్శలు చేయడం, దూషించడం పరిపాటిగా మారిందని, ఈ ధోరణి పెరిగిందని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మౌసమీ భట్టాచార్య పేర్కొన్నారు. అసంతృప్తికి గురైన అడ్వొకేట్లు, క్లయింట్లు జడ్జీలపై అభియోగాలు చేయడమే కాకుండా కేసు విచారణ నుంచి తప్పుకోవాలనే స్థాయికి దిగజారుతున్నారని తప్పుపట్టారు. ఈ చర్యలు స్వతంత్ర న్యాయమూర్తుల రక్షణను దెబ్బతీస్తాయని, అనిశ్చితికి దారితీస్తాయని వ్యాఖ్యానించారు. ఒత్తిళ్లు వస్తున్నప్పటికీ న్యాయాన్ని అందించడంలో కోర్టులు కట్టుబడి ఉంటాయని చెప్పారు. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గోపనపల్లిలోని భూవివాదంలో పెద్దిరాజు అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు నమోదైన కేసులో రేవంత్‌రెడ్డిపై నమోదైన కేసును గతంలో జస్టిస్ మౌసమీ భట్టాచార్య కొట్టివేశారు. ఎలాంటి ఆధారం లేకుండా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారని తేల్చారు. తాము సుప్రీంకోర్టును ఆశ్రయించామని, తీర్పు చెప్పవద్దంటూ పిటిషనర్ చేసిన అభ్యర్థనను తోసిపుచ్చారు. ఫిర్యాదుదారు పెద్దిరాజు ఈ పిటిషన్‌ను బదిలీచేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో వేసిన కేసులో న్యాయమూర్తి పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. దీనిని సుప్రీంకోర్టు తీవ్రంగా పరిగణించింది. పెద్దిరాజుతోపాటు అడ్వొకేట్లు రితేశ్‌పాటిల్, నితిన్ మహేశ్‌పై సుమోటో కోర్టు ధిక్కరణగా పరిగణించింది. హైకోర్టులో కేసు రీఓపెన్ చేసి న్యాయమూర్తికి క్షమాపణలు చెప్పాలని వారిని ఆదేశించింది. దీంతో శుక్రవారం ఆ ముగ్గురూ హైకోర్టుకు హాజరయ్యారు. క్షమాపణల అఫిడవిట్‌ను దాఖలు చేశారు. దీనిపై న్యాయమూర్తి స్పందిస్తూ.. తీర్పు చెప్పాక చెప్పవద్దని కోరడానికి వీల్లేదని స్పష్టంచేశారు. తీర్పును హేతుబద్ధంగా విమర్శించవచ్చునని, దురుద్దేశాలను ఆపాదించడానికి వీల్లేదంటూ పై విధంగా ఉత్తర్వులు జారీచేశారు. పిటిషనర్ల క్షమాపణలను న్యాయమూర్తి ఆమోదించారు. ఈ విషయాన్ని సుప్రీంకోర్టుకు తెలియజేయాలని పిటిషనర్లను ఆదేశించారు. సుప్రీంకోర్టు సీజేకు ధన్యవాదాలు తెలియజేశారు.

సీపీఐ రాష్ట్రకార్యదర్శిగా మరోసారి కూనంనేని



హైదరాబాద్, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ): భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) రాష్ట్ర కార్యదర్శిగా కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా, గాజులరామారంలో మూడురోజులపాటు జరిగిన సీపీఐ తెలంగాణ రాష్ట్ర నాలుగో మహాసభలు శుక్రవారం ముగిశాయి. చివరి రోజున నూతన రాష్ట్ర కౌన్సిల్, కార్యవర్గం, కార్యదర్శి వర్గం, కార్యదర్శిని ఎన్నుకున్నారు. రాష్ట్ర పార్టీ నూతన కౌన్సిల్‌ను 152 మంది సభ్యులతో ఎన్నుకొన్నారు. వీరిలో 101 మందితో రాష్ట్ర కార్యవర్గం, 30 మంది ఆహ్వానితులను, 11 మంది సెంట్రల్ కమిషన్‌ను ఎన్నుకొన్నారు. కార్యదర్శి వర్గం నూతన రాష్ట్ర కార్యదర్శిగా కూనంనేని సాంబశివరావును ఏకగ్రీవంగా ఎన్నుకుంది. కూనంనేని మూడేండ్లపాటు ఈ పదవిలో కొనసాగనున్నారు.

భూ సమస్యలపై ఉద్యమాలు చేపట్టాలి: చాడ వెంకట్‌రెడ్డి

రాష్టంలో ధరణి పోయి భూభారతి వచ్చినా క్షేత్రస్థాయిలో నెలకొన్న భూసమస్యలు పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. ఇప్పటికీ గ్రామ స్థాయిలో భూసమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించే దిశగా ఉద్యమాలు చేపట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సీపీఐ మహాసభలో మూడోరోజు చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన చరిత్ర కలిగిన ఎర్రజెండా వద్దకు వెళ్తేనే తమకు దొరుకుతుందనే నమ్మకం నేటికీ పేదల ప్రజలలో ఉండటం సీపీఐకి గర్వకారణమని అన్నారు. ఆ నమ్మకాన్ని కాపాడుకునే విధంగా భూపోరాటాల ఉద్యమ కార్యాచరణ చేపట్టాలని సూచించారు. శాసనసభ, శాసనమండలిలో బడుగు, బలహీన, కార్మిక వర్గాల సమస్యల పరిష్కారానికి మరింత కృషి చేయాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం చెప్పారు.

కాంట్రాక్టర్లకు పైసలిస్తరు..

రాష్ట్రవ్యాప్తంగా 16.75 లక్షల మంది విద్యార్థులకు 8,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు

ఫీజులు చెల్లించలేరా!

- **వెంటనే మొత్తం స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలివ్వాలి**
- **గురుకుల పిల్లలు చనిపోతున్నా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పట్టదా?**
- **సర్కార్‌పై బీఆర్‌ఎస్ పార్టీ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ధ్వజం**
- **ఫీజు బకాయిలను చెల్లించకుంటే ఉద్యమం ఉధృతం : ఆర్ కృష్ణయ్య**
- **బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో సంక్షేమ భవన్ ముట్టడి**



సంక్షేమ భవన్ ముట్టడిలో పాల్గొన్న ప్రవీణ్‌కుమార్, ఆర్ కృష్ణయ్య, వేముల రామకృష్ణ


హైదరాబాద్, ఆగస్టు22 (నమస్తే తెలంగాణ)/మెహిదీపట్నం: 'బడా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించేందుకు డబ్బులున్నయి కానీ, బడుగు బలహీనవర్గాల విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించేందుకు డబ్బుల్లేవా? ఇప్పటికైనా ఆర్థికశాఖ తన వైఖరిని మార్చుకోకుంటే తిరుగుబాటు తప్పదు. విద్యార్థుల ఫీజు పోరును ఉధృతం చేస్తాం' అని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, బీసీ నేత, ఎంపీ ఆర్ కృష్ణయ్య హెచ్చరించారు. బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం సంక్షేమ భవన్ ముట్టడి చేపట్టారు. భారీగా తరలివచ్చిన విద్యార్థులు ఈ సందర్భంగా ధర్నా నిర్వహించారు. విద్యార్థుల ధర్నాకు సంఘీభావంగా వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ వెంటనే ఫీజు బకాయిలను చెల్లించాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం దీర్ఘకాలంగా విద్యార్థుల స్కాలర్‌షిప్పులు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను చెల్లించడమే లేదని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా 16.75 లక్షల మంది విద్యార్థులకు రూ.8 వేల కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉన్నదని తెలిపారు. 10 నెలలుగా విద్యార్థులు రోడ్లపైకి వచ్చి ఉద్యమాలు చేస్తున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్టయినా లేదని మండిపడ్డారు. ఫీజు బకాయిలను చెల్లించకపోవడంతో విద్యార్థులపై కాలేజీ యాజమాన్యాలు ఒత్తిడి చేస్తున్నాయని, కోర్సులు పూర్తయినా సర్టిఫికెట్లను ఇవ్వడం లేదని తెలిపారు. ఫలితంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు ఉన్నత విద్యకు, ఉద్యోగావకాశాలను కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రభుత్వం నిర్లక్ష్యంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గురుకులాల్లో ఫుడ్‌పాయిజన్ ఘటనలతో విద్యార్థులు మరణిస్తున్నా, అనారోగ్యాలతో అవస్థలు పడుతున్నా, సీఎం రేవంత్‌రెడ్డి ఏమాత్రం పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. కేసీఆర్ హయాంలో దేశానికే ఆదర్శంగా నిలిచిన గురుకులాలు, కాంగ్రెస్ పాలనలో సంక్షోభంలో కూరుకుపోతున్నాయని తెలిపారు. ఫీజు, స్కాలర్‌షిప్‌ల బకాయిలను వెంటనే చెల్లించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆర్ కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంఘం నేతలు గుజ్జ కృష్ణ, నీలం వెంకటేశ్, నందగోపాల్, ప్రీతం, సుధాకర్, చంద్రశేఖర్, రాజేందర్, లింగయ్య, రాఘవేందర్, మణికంఠ, నర్సింహ గౌడ్, ఉమేశ్, రాకేశ్, అరవింద్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ బిల్లు.. ఒక్క రూపాయే!

- **లక్ష రూపాయల బిల్లుకు కేవలం రూ.1మాత్రమే జమచేసిన సర్కారు**
- **బిల్లులు రాక గగ్గోలు పెడుతున్న పుట్టపాక 'ఇందిరమ్మ' లబ్ధిదారులు**



పుట్టపాకలో బేస్‌మెంట్ స్థాయిలో పనులు పూర్తయిన ఇందిరమ్మ ఇల్లు



ఖాతాలో రూపాయి జమ అయినట్టు చూపుతున్న స్టేట్‌మెంట్

సంస్థాన్ నారాయణపురం, ఆగస్టు 22: ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా నిర్మాణ పనులు ప్రారంభించి నెలలు గడుస్తున్నా బిల్లులు రాకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. యాదాద్రిభువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం పుట్టపాకలో రూ. లక్ష బిల్లుకు ఒక్క రూపాయి మాత్రమే ఖాతాలో జమకావడంతో లబ్ధిదారులు గగ్గోలు పెడుతున్నారు. వివరాల్లోకి వెళితే.. మండల వ్యాప్తంగా 470 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కావడంతో నిర్మాణ పనులు ప్రారంభించుకోవాలని అధికారులు లబ్ధిదారులకు సూచించారు. దీంతో రేకులషెడ్డు, గుడిసెలు, పెంకుటిండ్లు కూల్చి ఇండ్ల నిర్మాణ పనులు చేపట్టారు. కొందరు బేస్మెంట్, రూఫ్ లెవల్ వరకు నిర్మించుకోగా పంచాయతీ కార్యదర్శి ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేశారు. నెలలు గడుస్తున్నా బిల్లులు రాకపోవడంపై ఉన్నతాధికారులకు చెబితే టెక్నికల్ సమస్యతో బిల్లులు పడలేదని, రేపు మాపంటూ కాలం వెళ్లదీస్తున్నారని పలువురు లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

లక్షకు ఒక్క రూపాయే వేశారు..

పాత ఇల్లు కూలగొట్టి, కిరాయి ఇంట్లో ఉంటూ ఇల్లు కడుతున్నాం. బేస్మెంట్ లెవల్ వరకు నిర్మాణ పనులు చేపట్టి నెల రోజులు గడుస్తున్నది. పంచాయతీ కార్యదర్శి ఫొటో కూడా తీసిండు. ఇంతవరకు బిల్లుల డబ్బులు పడలేదు. మిత్తీకి తెచ్చి ఇంటి నిర్మాణ పనులు చేపట్టా. బిల్లు కోసం అధికారుల చుట్టూ రోజూ తిరుగుతున్నా. లక్ష రూపాయలకు ఒక్క రూపాయే అకౌంట్లో పడింది. అధికారులకు చెబితే టెక్నికల్ సమస్యతో బిల్లు పడలేదని చెబుతున్నారు.

- చిట్టిప్రోలు రమేశ్, పుట్టపాక

టెక్నికల్ సమస్యతో బిల్లులు పడలేదు

లబ్ధిదారుల్లో కొందరికి బిల్లులు పడని మాట వాస్తవమే. బ్యాంకు ఖాతా సరిగా లేకపోవడం, ఆధార్ కార్డుల్లో వివరాలు తప్పుగా ఉన్నందున బిల్లులు పడటం లేదు. బిల్లులు రావడంలేదని లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరంలేదు. ప్రతి ఒక్కరికీ బిల్లులు పడతాయి. మండలవ్యాప్తంగా 470 ఇండ్లు మంజూరయ్యాయి. చాలా ఇండ్లు నిర్మాణ దశలో ఉన్నాయి. టెక్నికల్ సమస్య వల్లే లక్షకు బదులు ఒక్క రూపాయి అకౌంట్లో పడింది.

- ప్రమోద్ కుమార్, ఎంపీడీవో

తెలంగాణ ప్రజల సొమ్ముతో బీహార్ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రచారం!



బీహార్‌లోని ఓ పత్రికలో వచ్చిన తెలంగాణ సర్కార్ ప్రకటనలు

బీహార్‌లో ప్రచారానికి తెలంగాణ నిధులు

- **అక్కడి పలు పత్రికల్లో కోట్లాది రూపాయలతో ప్రకటనలు**
- **త్వరలో ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రప్రభుత్వం గొప్పలు**
- **కాంగ్రెస్ తీరుపై సర్వత్రా విమర్శలు**

హైదరాబాద్, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ): : తెలంగాణ సొమ్మును పక్క రాష్ట్రాల్లో పార్టీ ప్రచారానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఉపయోగించుకుంటున్నది. బీహార్‌లో త్వరలో ఎన్నికల నేపథ్యంలో తమ పార్టీని గెలిపించుకునేందుకు తెలంగాణ ప్రజల సొమ్మును అప్పనంగా ఖర్చుపెడుతున్నది. తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఎంతో చేస్తున్నదని గొప్పలు చెప్పుకుంటున్నది. పథకాలు, జీతాలకు రూపాయి పుట్టడం లేదని చెబుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, బీహార్‌లో ఇలా పత్రికలకు భారీ ప్రకటనలు చేస్తూ కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తుండటంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.



మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం అనేపురంస్టేజీ తండా గ్రామపంచాయతీ కార్యాలయానికి అద్దె చెల్లించకపోవడంతో తాళం వేస్తున్న యజమాని

అద్దె చెల్లించలేదని జీపీ కార్యాలయానికి తాళం

మరిపెడ, ఆగస్టు 22: మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం అనేపురం స్టేజీ తండా గ్రామపంచాయతీ కార్యాలయానికి అద్దె చెల్లించలేదని ఇంటి యజమాని గుగులోత్ జ్యోతి శుక్రవారం తాళం వేశారు. గ్రామపంచాయతీ సెక్రటరీ రామోజీ త్వరలో అద్దె చెల్లిస్తామని నచ్చజెప్పడంతో తాళంతీశారు. ఈ సందర్భంగా ఇంటి యజమాని మాట్లాడుతూ గత 10 నెలల నుంచి నెలకు రూ.1500 అద్దె చెల్లించకపోవడంతో జీపీ కార్యాలయానికి తాళం వేసినట్టు తెలిపారు.

మరిన్ని వార్తలు ntnews.com లో డగలరు

'ఆరోగ్యశ్రీ'కి డబ్బుల్లేవ్!

- **రూ.1,400 కోట్ల బకాయిల చెల్లింపుల్లో సర్కార్ తీవ్ర జాప్యం**
- **'కాంగ్రెస్ సర్కార్ బ్రాండ్ స్కీమ్' అంటూ సీఎం రేవంత్‌రెడ్డి ఆర్భాటం**
- **8నెలలుగా పెండింగ్‌లో బకాయిలు**
- **31 నుంచి సేవల నిలిపివేస్తున్నట్టు టీఏఎన్‌హెచ్ అసోసియేషన్ ప్రకటన**

హైదరాబాద్, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ): 'ప్రజల సేవలో ప్రజా ప్రభుత్వం.. ఆరోగ్యశ్రీ కాంగ్రెస్ బ్రాండ్. మసకబారిన ఈ పథకానికి పూర్వవైభవం తెచ్చాం. బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఆరోగ్య శ్రీ పరిధిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాం. జబ్బుపడిన గరీబోళ్లకు ఇది మేమిచ్చిన భరోసా' అని ఇటీవల పంద్రాగస్టు వేడుకల సందర్భంగా గోల్కొండ కోట సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలివి. ఆరోగ్యశ్రీ పథకం అమలు విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి మాటలకు, చేతలకు పొంతన లేదనే విషయం దీంతో తేటతెల్లమైంది. 'ఇది మా కాంగ్రెస్ బ్రాండ్ స్కీం' అంటూ ప్రగల్భాలు పలికిన రేవంత్‌రెడ్డి.. నిధుల విడుదలలో తీవ్ర నిర్లక్ష్యం చూపుతున్నారు. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ దవాఖానలకు ఏకంగా 8 నెలలుగా బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో ఆయా దవాఖానల యాజమాన్యాలు అసలు ఆరోగ్య శ్రీ సేవలు నిలుపుదల చేయాలని నిర్ణయించారు. దీంతో కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యం రాష్ట్ర ప్రజారోగ్యాన్ని ప్రశ్నార్థకంగా మార్చింది. గత ఎనిమిది నెలలుగా రూ.1,400 కోట్ల బకాయిలను ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు చెల్లించాల్సి ఉన్నది. ప్రభుత్వం నుంచి ఆరోగ్యశ్రీ, ఉద్యోగుల ఆరోగ్య పథకం(ఈహెచ్‌ఎస్), జర్నలిస్టుల ఆరోగ్య పథకం (జేహెచ్‌ఎస్) కింద అందిస్తున్న సేవలకు గాను చెల్లింపులు జరగకపోవడంతో దవాఖానల నిర్వహణ భారంగా మారిందని నెట్‌వర్క్ దవాఖానల యాజమాన్యాలు వాపోతున్నాయి. ఆరోగ్య శ్రీ పథకంలో 300 వరకు నెట్‌వర్క్ దవాఖానలు రాష్ట్రంలో ఉన్నాయి. బకాయిల చెల్లింపులో సర్కారు జాప్యం కారణంగా అనేక దవాఖానలు వరుసగా నెట్‌వర్క్ నుంచి తప్పుకుంటున్నాయి. ఆరోగ్యశ్రీకి సంబంధించి రూ.1,100 కోట్ల బకాయిలు చెల్లించాలనే డిమాండ్‌తో గత జనవరిలో వైద్యసేవలను ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ నిలిపివేసింది. ఆ సమయంలో రెండు నెలల్లో పెండింగ్ బకాయిలను చెల్లిస్తామని ఆరోగ్యశాఖ మంత్రి, హెల్త్ సెక్రటరీ, ఆరోగ్యశ్రీ సీఈవో హామీ ఇచ్చినట్టు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ప్రభుత్వం హామీతో నెట్‌వర్క్ దవాఖానల్లో తిరిగి సేవలను కొనసాగించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎనిమిది నెలలు గడిచినా ప్రభుత్వంలో ఎలాంటి చలనం లేకపోవడంతో తాజాగా ఈ నెల 31 అర్ధరాత్రి నుంచి ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేస్తున్నట్టు అసోసియేషన్ ప్రకటించింది. బకాయిల చెల్లింపులతోపాటు తమ కీలక డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని అసోసియేషన్ కోరుతున్నది.

చిన్న దవాఖానలు మూసేలా పరిస్థితి

ఆరోగ్య శ్రీ బకాయిల పెండింగ్ కారణంగా చిన్న దవాఖానలను మూసేసే పరిస్థితి దాపురించింది. కొన్నింటిని వేరే కార్పొరేట్ దవాఖానలకు అమ్ముకోవాల్సి వస్తున్నది. ఇప్పటికైనా సర్కార్ స్పందించి ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ దవాఖానలకు బకాయిలను వెంటనే చెల్లించాలి. పేమెంట్ ఎప్పటికప్పుడు చెల్లించి, ఒప్పందం పునరుద్ధరించాలి. రెండు నెలల్లో బకాయి బిల్లులు చెల్లిస్తామని గత జనవరిలో ప్రభుత్వం హామీ ఇచ్చింది. కానీ ఇప్పటివరకు పెండింగ్ బకాయిలను చెల్లించనేలేదు. ఆరోగ్యశ్రీ కమిటీలో ప్రభుత్వాధికారులే కాకుండా, ప్రైవేటు దవాఖానల యాజమాన్యాలనూ భాగస్వామ్యం చేయాలి. నేతల మాటలకు, చేతలకు పొంతన ఉండటమే లేదు.

-వద్దిరాజు రాకేశ్, తెలంగాణ ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ (టీఏఎన్‌హెచ్‌ఏ) రాష్ట్ర అధ్యక్షుడు

గ్రీన్‌చానల్ ఫండ్స్ రిలీజ్ హామీ ఏమైంది?

గ్రీన్ చానల్ ద్వారా ఆరోగ్యశ్రీ నిధులను నెట్‌వర్క్ దవాఖానలకు విడుదల చేస్తామని గతంలో హామీ ఇచ్చిన ప్రభుత్వం ఇప్పటికీ ఆ హామీని అమలు చేయలేకపోయింది. ప్రతి నెలా రూ.200 కోట్లు చెల్లిస్తామన్న ఆ హామీని విస్మరించింది. ఆరోగ్య శ్రీ బకాయిల చెల్లింపులో ప్రభుత్వం ఉదాసీనతతో ప్రతి ఆరు నెలలకు ఒకసారి నెట్‌వర్క్ దవాఖానల యాజమాన్యాలు సమ్మె చేయాల్సిన పరిస్థితి నెలకొంటున్నది. రాష్ట్ర వ్యాప్తంగా ఆరోగ్య శ్రీ సేవలు నిలిచిపోతే పేదలకు తీవ్రనష్టం జరగనున్నది.

పెండింగ్ బిల్లులు మహాప్రభో!


- **రేవంత్‌రెడ్డి సర్కార్‌ను వేడుకుంటున్న మాజీ సర్పంచులు, కార్యదర్శులు**
- **సర్పంచుల బకాయిలు 700 కోట్లు**
- **కార్యదర్శుల బకాయిలు 383 కోట్లు**
- **ఎన్నికలకు ముందే ఇవ్వాలని డిమాండ్**

హైదరాబాద్, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ): గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు కోసం వెచ్చించిన పెండింగ్ బిల్లులు చెల్లించాలని మాజీ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్రంలోని 12,769 గ్రామాలకు చెందిన మాజీ సర్పంచులకు రూ.600 కోట్ల నుంచి రూ.700 కోట్ల వరకు బిల్లులు రావాల్సి ఉన్నది. ముఖ్యంగా స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఎస్‌ఎఫ్‌సీ), కేంద్ర ప్రభుత్వ నిధులు (సీఎఫ్‌సీ), నియోజకవర్గ అభివృద్ధి నిధులు (సీడీఎఫ్), ప్రత్యేక అభివృద్ధి నిధులు (ఎస్‌డీఎఫ్), వెనుకబడిన ప్రాంత అభివృద్ధి నిధులు (బీఆర్‌జీఎఫ్), జీఎస్టీ, వోచర్లు, ఇతర మార్గాల ద్వారా సర్పంచులకు, కార్యదర్శులకు పెండింగ్ బిల్లులు రావాల్సి ఉన్నది. సర్పంచుల పదవీకాలం ముగిసిన తర్వాత 2024 ఫిబ్రవరి ఒకటి నుంచి ప్రత్యేక అధికారుల పాలన మొదలైంది. గత 19 నెలలుగా వివిధ కార్యక్రమాల కోసం తాము జేబులో నుంచి పెట్టిన ఖర్చుల బిల్లులు కూడా మంజూరు చేయాలని పంచాయతీ కార్యదర్శులు డిమాండ్ చేస్తున్నారు. ఒక్కో గ్రామ కార్యదర్శి సుమారు రూ.2 లక్షల నుంచి 5 లక్షల వరకు వెచ్చించారు. సగటున ఒక్కో కార్యదర్శి రూ.3 లక్షలు వెచ్చించినట్టు అంచనా వేసినా 12,769 గ్రామాలకు ఇలా మొత్తం రూ.383 కోట్లు కార్యదర్శులకు రావాల్సి ఉన్నది. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ముందే పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని మాజీ సర్పంచులు, కార్యదర్శులు డిమాండ్ చేస్తున్నారు.

నిలిచిన ఆర్థిక సంఘం నిధులు

గత ఏడాది ఫిబ్రవరి ఒకటి నుంచి గ్రామాల్లో పాలకవర్గాలు లేని కారణంగా 2024-25లో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1,514 కోట్లు నిలిచిపోయాయి. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఎలాంటి నిధులు విడుదల చేయడం లేదు. ఫలితంగా తాగునీటి బోర్లు నిర్వహణ, వీధి దీపాలు, పారిశుద్ధ్య పనులు, బ్లీచింగ్ పౌడర్ కొనుగోలు, చెత్తను సేకరించే ట్రాక్టర్లలో డీజిల్, పారిశుద్ధ్య కార్మికులకు అవసరమైన పరికరాల కొనుగోలు వంటి అంశాల కోసం కార్యదర్శులు సొంత జేబుల్లో నుంచి డబ్బులు వెచ్చించారు. పెద్ద గ్రామ పంచాయతీలకు ఇంటిపన్నులు, వ్యాపార పన్నులు, తైబజార్, భవన నిర్మాణ ఫీజులు, వ్యాపార, వాణిజ్య లైసెన్సు ఫీజుల ద్వారా కొంత మేరకు నిధులు సమకూరుతాయి. కానీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే నిధులు తప్ప ఆర్థికంగా ఆదాయం వచ్చే ఇతర మార్గాలు ఉండవు. ఈ నేపథ్యంలో గ్రామాల కార్యదర్శులు పంచాయతీల నిర్వహణకు జేబుల్లో నుంచి డబ్బులు పెట్టాల్సిన పరిస్థితి, కొన్ని చోట్ల అప్పులతో పనులు చక్కబెట్టాల్సి వచ్చింది. చిన్న గ్రామాల కార్యదర్శులు ఒక్కో గ్రామంలో గడిచిన 19 నెలల్లో కనీసం రూ.2 లక్షల వరకు వెచ్చించినట్టు తెలుస్తున్నది. అలాగే పెద్ద గ్రామాల పంచాయతీ కార్యదర్శులు రూ.5 నుంచి 7 లక్షలు వరకు ఖర్చు చేసినట్టు సమాచారం. ఇలా కార్యదర్శులకు రేవంత్‌రెడ్డి సర్కారు రూ.383 కోట్లు బాకీ పడింది. స్థానిక ఎన్నికల ముందే ఈ బిల్లులను క్లియర్ చేయాలని కార్యదర్శులు కోరుతున్నారు. 2019-2024 వరకు సర్పంచులుగా పనిచేసిన వారి పెండింగ్ బిల్లులు రావాల్సి ఉన్నది. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల బిల్లులను ప్రభుత్వానికి సమర్పించగా నేటికీ రేవంత్‌రెడ్డి సర్కారు క్లియర్ చేయలేదు. సర్పంచులకు ఆ మొత్తం రూ.700 కోట్ల వరకు రావాల్సి ఉన్నది. ఈ నేపథ్యంలో తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. సర్పంచుల పెండింగ్ బిల్లుల వివరాలను తమకు అందించాలని పీఆర్ డైరెక్టర్‌ను కమిషన్ ఆదేశించింది. ఈ క్రమంలో ఉన్నతాధికారులు జిల్లా పంచాయతీరాజ్ అధికారులకు 15వ ఆర్థిక సంఘం నిధులు, ఎస్‌ఎఫ్‌సీ నిధులు, జనరల్ ఫండ్స్, గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు, ఎంపీ, ఎమ్మెల్యే ఫండ్స్ వంటి వివరాలు రెండు రోజుల్లో పంపించాలని ఆదేశించారు.


ఫ్రీజింగ్ ఎత్తివేయాలి



బ్లీచింగ్ పౌడర్ కొనుగోలు, శానిటేషన్ నిర్వహణకు కార్యదర్శులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గ్రామ పంచాయతీ ఖాతాల్లో నిల్వ ఉన్న నిధులు వాడుకొనేలా ఆర్థిక వెసులుబాటు కల్పించాలి. ఇప్పటివరకు ఉన్నఫ్రీజింగ్‌ను ప్రభుత్వం వెంటనే ఎత్తివేయాలి. 19 నెలల్లో ఉన్న కార్యదర్శుల బిల్లులను స్థానిక ఎన్నికలు నిర్వహించే లోపు ప్రభుత్వం క్లియర్‌చేయాలి

-పీ మధుసూదన్‌రెడ్డి, తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు

19 నెలలుగా అధికారుల చుట్టూ ప్రదక్షిణలు



గ్రామాల అభివృద్ధికి సొంతంగా వెచ్చించిన పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని 19 నెలల నుంచి ముఖ్యమంత్రితోపాటు మంత్రుల చుట్టూ అధికారులు చుట్టూ ప్రదక్షిణలు చేసి విసిగిపోయాం. తక్షణమే ఎస్‌ఎఫ్‌సీ, ఎంబీ రికార్డయిన బిల్లులను విడుదల చేయాలి. స్టేట్ డెవలప్‌మెంట్ ఫండ్స్, మన ఊరు- మన బడి పనుల బిల్లులను కూడా క్లియర్ చేయాలి.

- సుర్వి యాదయ్యగౌడ్, తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు

గ్రామీణ ఉపాధిలో వ్యవసాయ అనుబంధ రంగాల పాత్ర కీలకం

కేంద్రమంత్రి ఎస్పీ సింగ్ బఘేల్

హైదరాబాద్, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ): గ్రామీణ జీవనోపాధి బలోపేతంలో పశుసంపద, పౌల్ట్రీ, మత్స్య పరిశ్రమలు కీలకపాత్ర పోషిస్తాయని కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, పాడిపరిశ్రమలశాఖ సహాయ మంత్రి ప్రొఫెసర్ ఎస్పీ సింగ్ బఘేల్ పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన పౌష్టికాహారాన్ని అందిస్తూ ఆహారభద్రత కల్పించేందుకు ఈ రంగాలు ఎంతో దోహదం చేస్తున్నాయని తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లో కాంపౌండ్ లైవ్‌స్టాక్ ఫీడ్ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(సీఎల్‌ఎఫ్‌ఎంఏ-క్లాఫ్మా) 58వ వార్షిక సమావేశం, 66వ జాతీయ సింపోజియం జరిగింది. ఈ సందర్భంగా 'దేశ వ్యవసాయంలో పాడిపశువులు- భవిష్యత్ మార్గం' అనే అంశంపై నిపుణులు, శాస్త్రవేత్తలు హాజరై చర్చించారు. ఈ సందర్భంగా సావనీర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర పాడిపరిశ్రమ, మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ఎంపీ ఈటల రాజేందర్, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్(ఎన్‌ఎల్‌ఎం)జాయింట్ సెక్రటరీ ముత్తుకుమారస్వామి, క్లాఫ్మా ఆఫ్ ఇండియా చైర్మన్ దివ్యకుమార్ గులాటి తదితరులు పాల్గొన్నారు.

చేతగాని పాలకుల వల్లే యూరియా సంక్షోభం

- నాడు కేసీఆర్ దూరదృష్టితో అన్నదాతల కష్టాలు దూరం
- రైతులను గోస పెడుతున్న కాంగ్రెస్ పతనం ప్రారంభం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపాటు



హైదరాబాద్, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో చేతగాని పాలకుల వల్లే యూరియా సంక్షోభం తలెత్తిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రైతులను అరిగోస పెడుతున్న కాంగ్రెస్ పతనం ప్రారంభమైందని శుక్రవారం ఎక్స్ వేదికగా స్పష్టంచేశారు. పరిపాలన అంటే ఏమిటో తెలియని అసమర్థులు రాజ్యమేలడంతోనే అన్నదాతలకు ఈ కష్టాలు, కన్నీళ్లని ఆవేదన వ్యక్తంచేశారు. కేసీఆర్ నాయకత్వం, ముందుచూపు విధానాలు, పకడ్బందీ పాలన అంటే ఏమిటో తెలంగాణ సమాజానికి అర్థమైందని, చిల్లర రాజకీయాలు, బూతులు తప్ప చేతలు రాని ఢిల్లీ పార్టీల నాయకులకు, వందేండ్ల విజన్‌కు నిలువెత్తు రూపమైన కేసీఆర్‌కు ఉన్న తేడా ఇప్పుడు ప్రజలకు స్పష్టంగా తెలిసిపోయిందని కేటీఆర్ పేర్కొన్నారు.

నాడు పక్కా ప్రణాళికలు

పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో అప్పటి సీఎం కేసీఆర్ యూరియా తెప్పించేందుకు పక్కా ప్రణాళికలతో ముందుకెళ్లారని కేటీఆర్ గుర్తుచేశారు. సీజన్ ప్రారంభానికి ముందే ప్రత్యేక కసరత్తు చేసేవారని తెలిపారు. వ్యవసాయ అధికారులతో వరుస సమీక్షలు నిర్వహించేవారని వివరించారు. ఏటా సీజన్‌కు ముందే ఎరువులు, యూరియా అవసరాలను లెక్కలతో సహా కేంద్రం దృష్టికి తీసుకెళ్లేవారని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లోని నౌకాశ్రయాలకు అధికారులను పంపి, సరఫరాను పర్యవేక్షించేలా ఆదేశాలు జారీ చేసేవారని, యూరియా రవాణా కోసం దక్షిణ మధ్య రైల్వే అధికారులకు స్వయంగా ఫోన్ చేసి 25 స్పెషల్ గూడ్స్ ట్రైన్లను ఏర్పాటు చేయించేవారని, అవసరమైతే పొరుగు రాష్ట్రాల రవాణా శాఖ మంత్రులతో నేరుగా సంప్రదింపులు జరిపేవారని గుర్తుచేశారు. పంటల సీజన్‌లో ఏకంగా నాలుగు వేల లారీలను రంగంలోకి దించేలా సన్నాహాలు చేసేవారని పేర్కొన్నారు. సమయానికి ప్రతిరైతుకు అవసరం మేరకు యూరియాను అందుబాటులో ఉంచేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టేవారని తెలిపారు. గ్రామాల్లో అధికారుల పర్యవేక్షణలో పంపిణీ చేయించేవారని వెల్లడించారు. కేసీఆర్‌కు ఉన్న ముందుచూపు, దక్షత కాంగ్రెస్ సర్కారుకు లేకపోవడం వల్లే రైతులు అష్టకష్టాల పాలవుతున్నారని, తిండితిప్పలు మాని రాత్రింబవళ్లు ఎరువుల షాపులు, సింగిల్‌విండో ఆఫీసుల వద్ద పడిగాపులు కాస్తున్నారని కేటీఆర్ వాపోయారు.

క్యూలో చెప్పులు పెట్టించి బద్నాం చేస్తున్నారు

- యూరియా కేటాయింపు బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే
- సరఫరాకు కేంద్ర మంత్రి బండి సంజయ్ చొరవ చూపాలి
- బీజేపీ నేతలకు తుమ్మల సూచన
- యూరియా పంపిణీపై సమీక్ష
- మంత్రి తుమ్మల వ్యాఖ్యలపై రైతులు, నెటిజన్ల ఆగ్రహం



హైదరాబాద్, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ): కొందరు రాజకీయ స్వార్థపరులు యూరియా కోసం చెప్పుల లైన్లను పెట్టించి సోషల్ మీడియాలో ప్రభుత్వాన్ని బద్నాం చేస్తున్నారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆరోపించారు. యూరియా కేటాయింపు బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని తెలిపారు. ఈ విషయాన్ని మరిచిపోయిన ప్రతిపక్షాలు రాష్ట్ర ప్రభుత్వంపై బురద జల్లుతున్నాయని మండిపడ్డారు. శుక్రవారం సచివాలయంలో యూరియా నిల్వలు, సరఫరాపై వ్యవసాయశాఖ ఉన్నతాధికారులతో తుమ్మల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నౌకాయానానికి ఆటంకాలు ఎదురుకావడం, ఆర్ఎఫ్‌సీఎల్‌లో ఉత్పత్తిలో అంతరాయంతోనే యూరియా కొరత ఏర్పడ్డదని చెప్పారు. కేంద్రమంత్రి బండి సంజయ్ చొరవ చూపి ఆర్ఎఫ్‌సీఎల్ నుంచి తెలంగాణకు రావాల్సిన 63 వేల టన్నుల యూరియాను ఇప్పించాలని కోరారు. తక్కువ డిమాండ్ ఉన్న జిల్లాల నుంచి ఎక్కువ డిమాండ్ ఉన్న జిల్లాలకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. యూరియా కొనుగోలు కేంద్రాల వద్ద క్యూ లేకుండా చూడాలని, సమన్వయంతో వ్యవహరించి టోకెన్ పద్ధతిలో పంపిణీకి చర్యలు చేపట్టాలని నిర్దేశించారు. అవసరమైతే పాస్‌బుక్‌లను ఆధార్ కార్డుతో అనుసంధానించి.. యూరియా అందించే విధానాన్ని పరిశీలించాలని సూచించారు. సమావేశంలో వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, డైరెక్టర్ గోపి, కోఆపరేటివ్ కమిషనర్ సురేంద్రమోహన్, మార్క్‌ఫెడ్ ఎండీ శ్రీనివాస్‌రెడ్డి, పరిశ్రమలశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.

కొరత ఉందా.. లేదా మంత్రిగారూ?

యూరియా కోసం రైతులు అల్లాడుతుంటే మంత్రులు వరుసగా చేస్తున్న వ్యాఖ్యలు విమర్శలకు దారి తీస్తున్నాయి. శుక్రవారం మంత్రి తుమ్మల చేసిన వ్యాఖ్యలపైనా రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. సోషల్‌మీడియాలో నెటిజన్లు మండిపడ్డారు. చెప్పులను క్యూలో పెట్టి యూరియా కొరత ఉందంటూ దుష్ప్రచారం చేస్తున్నారని మంత్రి చెప్పడం విడ్డూరమని పేర్కొన్నారు. అదే మంత్రి మళ్లీ నౌకాయానానికి ఆటంకాలు ఏర్పడ్డాయని, అందుకే కొరత ఏర్పడ్డదని సాకులు వెతుక్కోవడం విచిత్రంగా ఉందని విమర్శలు గుప్పించారు. అసలు యూరియా కొరత ఉందో లేదో ప్రజలకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర రైతులకు ఎంత యూరియా అవసరముందో అవగాహన లేని కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత, సరిపడా సరఫరా చేయని కేంద్రం నిరాదరణ వెరసి.. తెలంగాణ అన్నదాతలు కష్టాలు ఎదుర్కొంటున్నారని రైతు సంఘాల నేతలు తెలిపారు. సరైన సమయంలో యూరియా తీసుకురావాలన్న ధ్యాసలేని కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వ్యవసాయమంత్రి తుమ్మల నాగేశ్వరరావు... ఇప్పుడు కవరింగ్ పాలిటిక్స్ చేయడమేంటని నిలదీస్తున్నారు. ఓ వైపు రైతులు పొలాల్లో వరి నాట్లు వేసుకుని సొసైటీల చుట్టూ తిరుగుతుంటే... ఇప్పుడు పాస్‌బుక్‌లు, ఆధార్ కార్డుల అనుసంధానం అంటూ మంత్రి ఏదో వినూత్నమైన పరిష్కార విధానం కనుగొన్నట్టు అధికారులకు ఆదేశాలు ఇవ్వడం కాంగ్రెస్ పాలకుల తెలివితేటలకు, పాలన తీరుకు నిదర్శనమని నెటిజన్లు సెటైర్లు వేస్తున్నారు.



మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో జిల్లా వ్యవసాయ అధికారి విజయనిర్మలకు టోకెన్ చూపిస్తూ ఎందుకు యూరియా ఇవ్వడం లేదని నిలదీస్తున్న సత్యవతిరాథోడ్

రైతులపై సీఎం రేవంత్‌రెడ్డికి సోయిలేదు

- మాజీ మంత్రి సత్యవతి రాథోడ్

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 22: తెలంగాణ రైతులపై సీఎం రేవంత్‌కు సోయిలేదని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ విమర్శించారు. శుక్రవారం మహబూబాబాద్ సొసైటీలో ఐదు రోజుల క్రితం టోకెన్లు ఇచ్చినా యూరియా ఇవ్వడంలేదని మానుకోట–తొర్రూరు ప్రధాన రహదారిపై రైతులు బైఠాయించారు. మాజీ మంత్రి సత్యవతి మద్దతు తెలిపి రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం, మంత్రులు, ఎమ్మెల్యే, ఎంపీలు రైతుల సమస్యలను పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. కేసీఆర్ పాలన రైతులకు స్వర్ణ యుగం కాగా.. రేవంత్ పాలనలో ఎక్కడ చూసినా సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారని తెలిపారు. కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్‌తో ఫోన్‌లో మాట్లాడి టోకెన్లు ఇచ్చిన రైతులకు వెంటనే యూరియా ఇవ్వాలని కోరారు. తండాకు చెందిన ఓ రైతు పురుగులమందు డబ్బాను తన సంచిలో నుంచి బయటకు తీస్తున్న క్రమంలో పక్కనే ఉన్న పోలీసులు గమనించి డబ్బాను లాక్కొని అతడిని పక్కకు పంపించివేశారు. వ్యవసాయ అధికారి విజయనిర్మల, తహసీల్దార్ రాజేశ్వర్ వచ్చి రైతులతో మాట్లాడి సొసైటీ వద్దకు తీసుకుపోయారు.



మెదక్ జిల్లా రామాయంపేటలోని రైతు సేవా కేంద్రం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి

ఎరువులు ఇవ్వలేని దుస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం

- బీఆర్ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి
- రామాయంపేటలో రైతులతో కలిసి ఆందోళన

మెదక్, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ) : రైతులకు ఎరువులు ఇవ్వని దుస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నదని, రైతులపై చిత్తశుద్ధిలేని కాంగ్రెస్ ప్రభుత్వానికి వారి ఉసురు తగులుతుందని బీఆర్ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మెదక్ జిల్లా రామాయంపేటలో రైతులు, బీఆర్ఎస్ నాయకులు కలసి గ్రోమోర్ రైతు సేవా కేంద్రం వద్ద నిరసన వ్యక్తంచేశారు. దీంతో పోలీసు పహారాలో రైతులకు కొద్దిపాటి యూరియాను అందజేశారు. అనంతరం రామాయంపేటలో బైక్ ర్యాలీ చేపట్టారు. రెండు రోజుల్లో రైతులకు యూరియా అందకుంటే జాతీయ రహదారిపై ధర్నా, రాస్తారోకో చేస్తామని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని పద్మాదేవేందర్‌రెడ్డి హెచ్చరించారు. యూరియా కోసం రైతులు పోలీసులు, వ్యవసాయాధికారుల కాళ్లు పట్టుకోవాల్సిన దుస్థితి ఉందని ఆవేదన వ్యక్తంచేశారు. కేసీఆర్ వ్యవసాయాన్ని పండుగ చేస్తే, రేవంత్ దండుగ చేశారని మండిపడ్డారు. మార్పు తీసుకొస్తామని అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఎరువుల కొరతతో అన్నం పెట్టే రైతులను రోడ్డుమీదికి తెచ్చిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. కేసీఆర్ హయాంలో గ్రామగ్రామాన ఎరువులు, విత్తనాలు అందించామని గుర్తుచేశారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



హసన్‌పర్తి, ఆగస్టు 22 : ఎరువుల సరఫరాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మండిపడ్డారు. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి పీఏసీఎస్ వద్ద శుక్రవారం ఉదయం 3 గంటల నుంచి రైతులు పడిగాపులు కాస్తూ విసిగెత్తి ఎర్రబెల్లికి ఫోన్‌చేసి వారి బాధలను వెల్లబుచ్చుకున్నారు. వెంటనే స్పందించిన దయాకర్‌రావు హసన్‌పర్తి పీఏసీఎస్ గోదాంకు వచ్చి సమస్యలు తెలుసుకున్నారు. జిల్లా వ్యవసాయ అధికారి (ఏడీఏ) ఆదిరెడ్డికి ఫోన్ చేసి వారం రోజుల నుంచి రైతులు తిండి, తిప్పలు మానేసి గోదాం చుట్టూ తిరిగినా యూరియా అందడం లేదని, తక్షణమే యూరియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులతో కలిసి పెద్దఎత్తున ధర్నాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వంలో రాజులా బతికిన రైతులు రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో రాత్రనక, పగలనక గోదాంల చుట్టూ తిరిగి విసిగి పోతున్నారని తెలిపారు.

యూరియాపై కాంగ్రెస్‌ది ద్వంద్వ విధానం

- ఎంపీలు కొరత ఉందంటే.. మంత్రులు లేదంటరు!
- ఎక్స్ వేదికగా ఎమ్మెల్సీ దాసోజ్ శ్రవణ్ ఆగ్రహం



హైదరాబాద్, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ) : 'తెలంగాణలో యూరియా కొరత ఉన్నదని కాంగ్రెస్ ఎంపీలు ప్రియాంకగాంధీతో కలిసి ఢిల్లీలో ధర్నా చేస్తరు.. కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ మంత్రికి వినతిపత్రాలు ఇస్తరు.. రాష్ట్రంలోని మంత్రులు మాత్రం కొరత లేదంటూ బుకాయిస్తరు.. ఇదేం ద్వంద్వ విధానం.' అంటూ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ శుక్రవారం ఎక్స్ వేదికగా కాంగ్రెస్ సర్కారు తీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. బీఆర్ఎస్సే ఎరువుల కొరత సృష్టిస్తున్నదని, ఆ పార్టీ కార్యకర్తలే చెప్పులు లైన్లో పెట్టి భయాందోళనకు గురిచేస్తున్నారని ఆరోపించిన వారే ఢిల్లీ వీధుల్లో ధర్నా ఎట్ల చేస్తరు? అని సూటిగా ప్రశ్నించారు. కాంగ్రెస్సోళ్లవి పొంతలేని మాటలు, అసలు చెబుతున్నదేంటి? చేస్తున్నదేంటి? అని నిలదీశారు. రైతాంగాన్ని ఉద్ధరిస్తామని గద్దెనెక్కి ఆచరణలో అన్యాయం చేయడం బాధాకరమని ఎమ్మెల్సీ దాసోజు పేర్కొన్నారు.



సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో యూరియా కొరతను నిరసిస్తూ రాస్తారోకో నిర్వహించి, వ్యవసాయశాఖ మంత్రి చిత్రపటాన్ని దహనం చేస్తున్న బీఆర్ఎస్ నేతలు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం సత్యనారాయణపురం సొసైటీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

యూరియా కొరత వాస్తవమే

మొదటిపేజీ తరువాయి...

అసహనం వ్యక్తంచేశారు. అనంతరం సొసైటీ వద్ద రైతులతో పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో యూరియా కొరత వాస్తమేనని చెప్పారు. ఈ సీజన్‌లో యూరియా కొరతపై సీఎం రేవంత్‌రెడ్డి రెండు సార్లు ఢిల్లీ వెళ్లి కేంద్రానికి కలిసినా ఫలితం లేదని తెలిపారు. అంతేకాకుండా యూరియా కొరతపై పార్లమెంట్ వద్ద కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకగాంధీ సహా రాష్ట్ర ఎంపీలు ఫ్లెక్సీలతో ధర్నా నిర్వహించారని చెప్పారు. అయినా రాష్ట్రానికి రావాల్సిన యూరియాపై రోజూ కేంద్రంతో లొల్లి పెడుతున్నామని, కానీ కేంద్రం స్పందించడం లేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఖరితోనే రైతులు యూరియా కోసం ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. కరెంటు, విత్తనాలకు సంబంధించిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదని, ఎరువుల బాధ్యత పూర్తిగా కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోనే ఉంటుందని పేర్కొన్నారు. కరీంనగర్ ఎంపీ, కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్‌ని కూడా యూరియా ఇప్పించాలని కోరినట్టు చెప్పారు. యూరియాపై రైతులకు ఇబ్బందులు కలుగుతున్నాయని, ఇది మంచిది కాదని పేర్కొన్నారు. కొరత ఉందనే కారణంతో రైతులు అవసరానికి మించి యూరియా తీసుకోవద్దని సూచించారు. ఈ సందర్భంగా గతంలో కూడా కేంద్రంలో బీజేపీ ప్రభుత్వమే ఉంది కదా.. అప్పుడు లేని కొరత ఇప్పుడు ఎందుకు వచ్చిందని పంతుల్‌తండాకు చెందిన జాటోతు గణేశ్ అనే యువకుడు మంత్రి పొన్నంను నిలదీశారు. 'అయితే నువ్వు వచ్చి మాట్లాడి ఇప్పిస్తువురా' అంటూ మంత్రి వెళ్లిపోయారు. వెళ్తూ వెళ్తూ... 'ఎవరో చూడయ వాడు, మీ ఊరోడా' అంటూ స్థానిక కాంగ్రెస్ నాయకులకు ఆదేశాలు ఇచ్చారు. మంత్రి బెదిరింపు ధోరణిపై రైతులు మండిపడ్డారు.



సిద్దిపేట జిల్లా అక్కన్నపేటలోని సొసైటీ వద్ద పడిగాపులు కాస్తున్న రైతులతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

కృత్రిమ కొరత సరికాదు: కిషన్‌రెడ్డి



హైదరాబాద్, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం యూరియా విషయంలో కృత్రిమ కొరతను ప్రోత్సహించడం సరికాదని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం బ్లాక్ మార్కెట్‌ను అరికట్టడానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రూ.266 ఉన్న సబ్సిడీ యూరియా బస్తాను రైతులు రూ.400కు కొనాల్సి వస్తున్నా.. రాష్ట్ర ప్రభుత్వం మౌనం వహించడమేంటని ప్రశ్నించారు. రాష్ట్రానికి కేంద్రం పంపుతున్న యూరియా బ్లాక్ మార్కెట్‌లోకి ఎలా వెళ్తోన్నదో చెప్పాలని నిలదీశారు. యూరియా విషయంలో కేంద్ర ప్రభుత్వాన్ని బద్నాం చేసే దురుద్దేశాన్ని కాంగ్రెస్ నేతలు మానుకోవాలని హెచ్చరించారు. రైతులకు సక్రమంగా యూరియా అందించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వమే వహించాలని సూచించారు.

అప్పులబాధతో ఇద్దరు రైతుల ఆత్మహత్య

- మహబూబాబాద్ జిల్లా ఇంటికన్నెలో పురుగులమందు తాగి బలవన్మరణం
- మెదక్ జిల్లా చేగుంట మండలం పోతాన్‌పల్లిలో చెట్టుకు ఉరేసుకుని ఒకరు



బొందయ్య, ఆంజనేయులు(ఫైల్)

కేసముద్రం/ చేగుంట,ఆగస్టు 22: మహబూబాబాద్, మెదక్ జిల్లాలో అప్పులబాధతో ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలంలోని ఇంటికన్నెకు చెందిన గందసిరి బొందయ్య(50)కు ఎకరంనర పొలం ఉంది. అందులో వరి, మక్క జొన్న పండించేవాడు. వ్యవసాయంలో నష్టాలు వచ్చి రూ. 5 లక్షల వరకు అప్పులయ్యాయి. దీంతో బొందయ్య మానసికంగా ఇబ్బంది పడుతున్నాడు. శుక్రవారం ఇంట్లో బొందయ్య గడ్డి మందు తాగగా.. స్థానికులు మహబూబాబాద్ ఏరియా దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై మురళీధర్‌రాజ్ తెలిపారు. మెదక్ జిల్లా చేగుంట మండలం పోతాన్‌పల్లికి చెందిన రైతు తిరుపతి ఆంజనేయులు(49)ఇంటి నిర్మాణంతోపాటు వ్యవసాయానికి రూ.7లక్షల వరకు అప్పు చేశాడు. ఇతడికి ఎకరం వ్యవసాయ భూమి ఉంది. అప్పులు ఎలా తీర్చాలో తెలియక తీవ్ర మనస్తాపానికి గురైన ఆంజనేయులు శుక్రవారం పొలం వద్దకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లి అక్కడ చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆంజనేయులు భార్య పదేండ్ల క్రితం మృతిచెందింది. మృతుడి కుమారుడు శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు.

ఏసీబీకి చిక్కిన సబ్ రిజిస్ట్రార్

ఆదిలాబాద్, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ): ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై ఏసీబీ అధికారులు నిర్వహించిన దాడుల్లో సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రెడ్డి రూ.5 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు. ఆదిలాబాద్ జిల్లా బేల మండలం సిరిసన్నకు చెందిన మున్సూర్‌ఖాన్ గిఫ్ట్ డీడ్ కోసం డాక్యుమెంట్ రైటర్ ద్వారా దరఖాస్తు చేసుకున్నాడు. గిఫ్ట్ డీడ్ చేసేందుకు సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాస్ రెడ్డి రూ.10 వేలు డిమాండ్ చేయగా రూ.5 వేలకు ఒప్పందం కుదిరింది. శుక్రవారం బాధితుడి నుంచి సబ్ రిజిస్ట్రార్ లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

'స్థానిక' ఎన్నికలపై ఎలా వెళ్దాం!

బీసీలకు 42శాతం రిజర్వేషన్‌పై ఏం చేద్దాం?

బీసీ బిల్లు పంపి 150 రోజులు దాటినందున జాతీయ అంశంగా రచ్చ చేయాలనే యోచన

- 25న క్యాబినెట్ భేటీలో వీటిపైనే ప్రధాన చర్చ
- కాళేశ్వరం నివేదికపై హైకోర్టు కేసు నేపథ్యంలో అసెంబ్లీలో చర్చించాలనే అంశంపై సమాలోచన
- స్థానిక ఎన్నికల నిర్వహణపై ఎన్నికల సంఘం అధికారులతో పంచాయతీ అధికారుల చర్చలు
- ఎన్నికలకు సిద్ధం కావాలని మౌఖిక ఆదేశాలు?

హైదరాబాద్, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ): ఈ నెల 25న నిర్వహించే రాష్ట్ర క్యాబినెట్ మీటింగ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రధానంగా చర్చించనున్నట్టు తెలిసింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో స్థానిక ఎన్నికలను ఎలా నిర్వహించాలి? ఏ విధంగా ముందుకు వెళ్లాలనే అంశాలపై విస్తృతంగా సమాలోచనలు చేయనున్నట్టు సమాచారం. ఇటీవలి క్యాబినెట్ సమావేశాల్లోనూ స్థానిక ఎన్నికలు, బీసీలకు 42% రిజర్వేషన్ల కల్పన వంటి అంశాలు కూడా చర్చకు వచ్చాయి. వచ్చే క్యాబినెట్ భేటీలోనూ ఇవే అంశాలు కీలక చర్చనీయాంశాలు కానున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించే బిల్లును ఈ ఏడాది మార్చి 17న రాష్ట్ర అసెంబ్లీలో ఆమోదించి పార్లమెంట్ ఆమోదం కోసం పంపిన విషయం తెలిసిందే. బీసీ బిల్లులు కేంద్రానికి పంపించి 150 రోజులు దాటినందున దానిని జాతీయ స్థాయి అంశంగా మార్చాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలిసింది. ఇటీవలే ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద కాంగ్రెస్ పార్టీ బీసీ బిల్లుపై ఆందోళన చేపట్టింది. కేంద్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదించాలని డిమాండ్ చేసింది. కేంద్రం, రాష్ట్రపతి ఈ బిల్లులను అడ్డుకుంటున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు.

కాళేశ్వరం నివేదికపైనా చర్చ

కాళేశ్వరం ప్రాజెక్ట్ నివేదికపై కూడా క్యాబినెట్ భేటీలో చర్చించే అవకాశం ఉన్నది. హైకోర్టు వివరణ కోరిన నేపథ్యంలో ఈ నివేదికను అసెంబ్లీలో చర్చించాలా? వద్దా? అనే విషయంపై క్యాబినెట్‌లో సమాలోచనలు జరుపనున్నట్టు తెలిసింది. జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ సమర్పించిన రిపోర్టుపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ రిపోర్టును అసెంబ్లీలో టేబుల్ చేసి, సమగ్రంగా చర్చించాలనే నిర్ణయానికి ప్రభుత్వం వచ్చినట్టు తెలిసింది.

కేంద్రంపై నెపం నెట్టేదామా?

బీసీ రిజర్వేషన్ బిల్లును మూడు నెలల క్రితమే కేంద్రానికి పంపించామని, ఇదే అంశంపై ఆర్డినెన్స్ కూడా తెచ్చి గవర్నర్‌కు పంపించామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్తున్నారు. బీసీ రిజర్వేషన్ అంశం ఇప్పుడు తమ పరిధిలో లేదని, కేంద్రం కోర్టులో ఉన్నదని అంటున్నారు. కేంద్రంలోని బీజేపీ సర్కారుపై నెపం నెట్టి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తామనే హామీ నుంచి తప్పించుకోవాలని కాంగ్రెస్ సర్కారు చూస్తున్నట్టు తెలుస్తున్నది. బీసీ రిజర్వేషన్ల పరంగా అన్ని చేశాం.. కానీ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమే అడ్డుకుంటున్నదని చెప్పి, బంతిని కేంద్రం కోర్టులోకి నెట్టి స్థానిక ఎన్నికలకు వెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తున్నట్టు సమాచారం. ఒకవేళ బీసీల నుంచి ఒత్తిడి వస్తే, పార్టీ పరంగా స్థానిక ఎన్నికల్లో 42% సీట్లు ఇస్తామని చెప్పేందుకు సిద్ధమవుతున్నట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో పంచాయతీ రాజ్ అధికారులు ఇప్పటికే ఎన్నికల సంఘం అధికారులకు ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని మౌఖికంగా ఆదేశించినట్టు సమాచారం. స్థానిక ఎన్నికల నిర్వహణపై ఎలక్షన్ కమిషన్ అధికారులతో పంచాయతీరాజ్ అధికారులు మంతనాలు జరుపుతున్నట్టు తెలిసింది. ఇప్పటికే బ్యాలెట్ బాక్సులను సిద్ధంచేసిన ఎన్నికల సంఘం అధికారులు, తాజాగా ఓటర్లు జాబితాను కూడా కొత్తగా రూపొందించినట్టు సమాచారం.



ఇందిరాపార్క్ వద్ద నిర్వహించిన ధర్నాలో నినదిస్తున్న రేషన్ డీలర్ల సంఘం నాయకులు

రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించాలి

- హామీలను అమలు చేయాలి
- సంఘం అధ్యక్షుడు రమేశ్‌బాబు
- ఇందిరాపార్క్ వద్ద రేషన్ డీలర్ల ధర్నా

కవాడిగూడ, ఆగస్టు 22: కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో ప్రకటించినట్టు కనీస గౌరవ వేతనం ఇవ్వాలని, కమీషన్ పెంచాలని రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రమేశ్‌బాబు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద రేషన్ డీలర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బత్తుల రమేశ్‌బాబు మాట్లాడుతూ.. ఏ నెల కమీషన్ ఆ నెలలోనే చెల్లించాలని, గౌరవ వేతనం ఐదు వేలు పెంచాలని, ఐదు నెలల బియ్యం కమీషన్ డబ్బులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. రేషన్ షాపులను మినీ సూపర్ మార్కెట్లుగా గుర్తించాలని కోరారు. బియ్యం దిగుమతి చార్జీలను, రేషన్ దుకాణాల అద్దెను ప్రభుత్వమే భరించాలని పేర్కొన్నారు. పదేండ్లుగా పేరుకుపోయిన పాత బకాయిలను వెంటనే చెల్లించాలని విజ్ఞప్తిచేశారు. రేషన్ డీలర్లలో ఉన్నత విద్యావంతులకు శాఖాపరమైన పదోన్నతులు కల్పించి, వారి సేవలను వినియోగించుకోవాలని సూచించారు. కరోనాతో మరణించిన రేషన్ డీలర్ల కుటుంబాలకు రూ. 20 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. రేషన్ డీలర్ చనిపోతే దహన సంస్కారాల కోసం రూ. 30 వేలు చెల్లించాలని కోరారు. హైదరాబాద్ నగరంలో రేషన్ భవన్ నిర్మాణానికి వెయ్యి గజాల స్థలాన్ని కేటాయించాలని కోరారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో సంఘం ప్రధాన కార్యదర్శి రెడ్డిమల్ల హనుమాండ్లు, వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మీనారాయణ, కోశాధికారి కిరణ్‌కుమార్‌రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి దరావత్ మోహన్‌నాయక్, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ అగ్రనేత సురవరం కన్నుమూత

▸ మొదటిపేజీ తరువాయి...

తెలియగానే బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ తన ప్రగాఢ సంతాపం ప్రకటించారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని కొండ్రావుపల్లి గ్రామంలో 1942 మార్చి 25న జన్మించిన సురవరం.. 1998, 2004లో రెండుసార్లు నల్లగొండ నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. సీపీఐ విద్యార్థి విభాగం ఏఐఎస్‌ఎఫ్ నుంచి మొదలైన ఆయన ప్రస్థానం సీపీఐ ప్రధాన కార్యదర్శి వరకు సాగింది. చండ్ర రాజేశ్వరరావు తర్వాత ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన రెండో తెలుగు వ్యక్తిగా సురవరం నిలిచారు. 2012 నుంచి 2019 వరకు సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. సురవరం సుధాకర్‌రెడ్డి తండ్రి వెంకట్రామిరెడ్డి స్వాతంత్ర్యసమరయోధుడు. ఆయన తెలంగాణ సాయుధ పోరాటంలోనూ పాల్గొన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి సురవరం సంపూర్ణ మద్దతు ప్రకటించారు. కర్నూలులోని ఉస్మానియా కళాశాల నుంచి బీఏ, ఓయూ నుంచి ఎల్‌ఎల్‌బీ పట్టా పొందారు. 1974లో విజయలక్ష్మితో సుధాకర్‌రెడ్డి వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు.

1998, 2004లో లోక్‌సభకు ఎన్నిక

1950 చివరలో కర్నూలులోని పాఠశాలలకు ప్రాథమిక సౌకర్యాలను డిమాండ్ చేస్తున్న వారితో చేరడంతో సురవరంరెడ్డి సామాజిక, రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనడం ప్రారంభమైంది. 1960లో ఆయన సీపీఐ విద్యార్థి విభాగం ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఏఐఎస్‌ఎఫ్) కర్నూలు శాఖలో నిర్వహించిన అనేక పదవుల్లో మొదటి పదవిని చేపట్టారు. తరువాత దశాబ్దంలో ఆయన ఆంధ్రప్రదేశ్, ఇతర రాష్ట్రాలలో రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొన్నారు. ఏఐఎస్‌ఎఫ్ స్థానిక, జిల్లా, రాష్ట్ర విభాగాలలో నాయకత్వ పాత్రలను చేపట్టారు. 1966లో సురవరం ఏఐఎస్‌ఎఫ్‌కు ప్రధాన కార్యదర్శి అయ్యారు. తన రాజకీయ స్థావరాన్ని హైదరాబాద్‌కు మార్చారు. 1970లో ఆయన సంస్థ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. సీపీఐ పార్టీలో మరింత క్రియాశీలక పాత్రపోషించారు. 1971లో ఆయన పార్టీ జాతీయ మండలికి ఎంపికయ్యారు. 1998లో నల్లగొండ నుంచి 12వ లోక్‌సభకు ఎన్నికయ్యి మొదటిసారిగా పార్లమెంట్‌లో అడుగుపెట్టారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో సీపీఐ పార్టీకి కార్యదర్శిగా పనిచేశారు. 1998-99లో మానవ వనరుల అభివృద్ధి కమిటీ, ఔషధ ధర నియంత్రణ ఉపకమిటీలో సభ్యులుగా ఉన్నారు. ఆర్థిక మంత్రిత్వ శాఖలో కూడా సుధాకర్‌రెడ్డి సలహాదారుడిగా పనిచేశారు. 2004లో 14వ లోక్ సభకు మరోసారి నల్లగొండ నుంచి ఎన్నికయ్యారు. సీపీఐ జాతీయ సమితికి కార్యదర్శిగా, వక్ఫ్‌పై సంయుక్త పార్లమెంటరీ కమిటీలో సభ్యులుగా ఉన్నారు. గ్రామీణాభివృద్ధి కమిటీ, హౌస్ కమిటీ, సలహా కార్యవర్గ సమితిలోనూ, సమాచార, ప్రసార మంత్రిత్వశాఖలోనూ సభ్యులుగా ఉన్నారు. కార్మికస్థాయి సంఘం చైర్మన్‌గా కూడా సురవరం సుధాకర్‌రెడ్డి బాధ్యతలు నిర్వర్తించారు. సురవరం ఎప్పుడూ కమ్యూనిస్టు పార్టీల విలీనం కోరుకునే వారు.

తెలంగాణ మట్టిబిడ్డ సురవరం: కేసీఆర్

సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి మరణం పట్ల బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు సంతాపం ప్రకటించారు. పీడితవర్గాల అభ్యున్నతి కోసం పనిచేసే కమ్యూనిస్టు పార్టీ నేతగా జీవితకాలం కృషిచేసిన తెలంగాణ మట్టిబిడ్డ సురవరం అని పేర్కొన్నారు. మార్క్సిస్టు ప్రజానేతగా గొప్ప పేరు సంపాదించుకున్నారని తెలిపారు. తెలంగాణ ఉద్యమ సమయంలో వారితో తనకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా కేసీఆర్ స్మరించుకున్నారు. శోకతప్తులైన సురవరం కుటుంబసభ్యులకు కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

గొప్ప నాయకుడు: బీఆర్‌ఎస్ నేతలు

సురవరం సుధాకర్‌రెడ్డి గొప్ప కమ్యూనిస్టు యోధుడని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమానికి కూడా మద్దతు ప్రకటించిన గొప్ప నాయకుడిని తెలంగాణ కోల్పోయిందని పేర్కొన్నారు. ఆయన కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. సురవరం సుధాకర్‌రెడ్డి మృతి ఎంతో బాధాకరమని, వారి ప్రజాజీవితం, ఉద్యమపంథా చిరస్మరణీయమని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. సురవరం సుధాకర్‌రెడ్డి మరణ వార్త తనను దిగ్భ్రాంతికి గురిచేసిందని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ తెలిపారు. సురవరంతో తనకు ఐదు దశాబ్దాల అనుబంధం ఉన్నదని పేర్కొన్నారు.

పలువురు ప్రముఖుల సంతాపం

సురవరం సుధాకర్‌రెడ్డి మరణం పట్ల సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి, పొన్నం, కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, ఎంపీ రఘువీర్‌రెడ్డి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ సంతాపం ప్రకటించారు. సురవరం కుటుంబసభ్యులకు సానుభూతి తెలియజేశారు.

ఘోష్ రిపోర్టు బయటకెట్లా వచ్చింది?

▸ మొదటిపేజీ తరువాయి...



ప్రవేశపెడతారా..' అని గురువారం ధర్మాసనం ప్రభుత్వాన్ని ప్రశ్నించిన సంగతి తెలిసిందే. శుక్రవారం విచారణ ప్రారంభం కాగానే అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి ఆ అంశంపై స్పందిస్తూ.. కమిషన్ రిపోర్టును ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెడతుందని, దానిపై చర్చించాకే తదుపరి చర్యలు ఉంటాయని, ఈలోగా కమిషన్ రిపోర్టు ఆధారంగా ఎలాంటి చర్యలు ఉండబోవని హామీ ఇచ్చారు. ఈ మేరకు ఒక నోట్‌ను ధర్మాసనానికి అందజేశారు.

ముందే ఎందుకు బయటపెట్టారు?

అనంతరం ధర్మాసనం స్పందిస్తూ.. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ప్రభుత్వానికి మాత్రమే ఇచ్చిన 650 పేజీల నివేదికను నీటిపారుదల/జీఏడీ ముఖ్యకార్యదర్శులు, న్యాయశాఖ కార్యదర్శితో కూడిన కమిటీతో 60 పేజీలకు సంక్షిప్తం చేయించడం, ఆ నివేదికను బహిర్గతం చేయడాన్ని హైకోర్టు పక్షపాత చర్యగా అభివర్ణించింది. సంక్షిప్త నివేదికలోని విషయాలు తమకు వ్యతిరేకంగా ఉన్నందున నష్టం జరుగుతుందని పిటిషనర్లు ఆందోళన వెలిబుచ్చడంలో అర్థం ఉన్నదని అభిప్రాయపడింది. ఆ నివేదిక ఆధారంగా చర్యలు ఉంటే పరువు, ప్రతిష్ట పోతుందనే ఆందోళన సబబేనని పేర్కొన్నది. నివేదికపై శాసనసభలో చర్చించేవరకు అందులోని విషయాలు వెల్లడికావడం ఎంతమాత్రం సమర్థనీయం కాదని స్పష్టంచేసింది. సమ్మరీ రిపోర్టును పబ్లిక్ డొమైన్‌లో నుంచి తొలగించాల్సిందేనని తేల్చిచెప్పింది. నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావిస్తే.. పబ్లిక్ డొమైన్‌లో అప్‌లోడ్ అయ్యే పరిస్థితులను ఎందుకు కల్పించిందని ప్రశ్నించింది. పిటిషనర్లను (కేసీఆర్, హరీశ్) కమిషన్ సాక్షులుగా సెక్షన్ 5(2) కింద విచారణకు పిలిచిందనే విషయాన్ని ప్రస్తావించింది. సమ్మరీ రిపోర్టులో ఆ ఇద్దరిపై అభియోగాలు ఉన్నాయనే వాదనలను ఉంటంకించింది. ఆరోపణలు చేసే అంశాలు కమిషన్ వద్ద ఉన్నప్పుడు, కమిషన్ ఆఫ్ ఎంక్వయిరీస్ యాక్ట్‌లోని సెక్షన్ 8-బీ, 8-సీ ప్రకారం తమకు నోటీసులు ఇచ్చి క్రాస్ ఎగ్జామిన్ చేసేందుకు అవకాశం ఇవ్వలేదంటూ పిటిషనర్లు ఆందోళన వ్యక్తం చేశారని పేర్కొన్నది. అయితే, కమిషన్ రిపోర్టును అసెంబ్లీలో ప్రవేశపెట్టి చర్చించాకే తదుపరి నిర్ణయాలు ఉంటాయని ప్రభుత్వం రాతపూర్వక హామీ ఇచ్చినందున పిటిషనర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చింది. ప్రభుత్వ హామీ నేపథ్యంలో నివేదికపై స్టే అవసరం లేదని ధర్మాసనం చెప్పింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి, జస్టిస్ ఘోష్ కమిషన్‌కు నోటీసులు జారీచేసింది. మూడు వారాల్లోగా కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను అక్టోబర్ 7కు వాయిదా వేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది.

రాజకీయ విద్వేషంతోనే పిటిషన్లు

మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు తరపున సీనియర్ న్యాయవాదులు ఆర్యమ సుందరం, దామా శేషాద్రినాయుడు వాదనలు వినిపించారు. కమిషన్ నివేదికపై ప్రభుత్వం యాక్షన్ టేకెన్ రిపోర్టు (ఏటీఆర్) తర్వాతే అసెంబ్లీలో ప్రవేశపెట్టాలని చెప్పారు. రాజ్యాంగం ప్రకారం అసెంబ్లీలోని అంశాలపై హైకోర్టు, సుప్రీంకోర్టు జోక్యం చేసుకునేందుకు వీల్లేదని తెలిపారు. కమిషన్ గోప్యంగా సమర్పించిన రిపోర్టులోని కీలక విషయాలన్నీ సంక్షిప్త నివేదిక పేరుతో స్వయంగా ముఖ్యమంత్రే ప్రజంటేషన్ ద్వారా బహిర్గతం చేశారని చెప్పారు. సాక్షులుగా విచారణకు హాజరైన పిటిషనర్లు ఇద్దరిపైనా కమిషన్ అభియోగాలు చేసినట్టు ఆ సంక్షిప్త రిపోర్టులో ఉందని అన్నారు. కమిషన్ రిపోర్టు ఇవ్వాలని పిటిషనర్లు కోరినప్పటికీ ఇవ్వలేదని, బ్రీఫ్ రిపోర్టు పబ్లిక్ డొమైన్‌లో, వెబ్‌సైట్స్‌లో ఉంటడంతో పిటిషనర్ల రాజకీయ జీవితంపై మచ్చ పడే ప్రమాదం ఉందని తెలిపారు. నివేదికను సంక్షిప్తం చేసి మీడియాకు అందేలా చేసిన ప్రభుత్వ ఉద్దేశం ఏమిటో గమనించాలని కోరారు. సీఎం పవర్ పాయింట్ ప్రజంటేషన్ వల్ల తీరని నష్టం చేకూరిందని తెలిపారు. ఇది కమిషన్ నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టకుండా పిటిషనర్లపై ప్రభుత్వం ఏకపక్షంగా దాడి చేయడమేనని అన్నారు. సాక్షులుగా హాజరైన పిటిషనర్లపై కమిషన్ ఆరోపణలు చేయడం సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు వ్యతిరేకమంటూ చట్ట నిబంధనలను ఉదహరించారు. విచారణ కమిషన్ చట్టం-1952లోని సెక్షన్ 8-బీ, 8-సీ కింద నోటీసులు ఇచ్చి ఆరోపణలు చేసిన ఇతర సాక్షులను క్రాస్ ఎగ్జామిన్ చేసేందుకు కమిషన్ అవకాశం ఇవ్వకపోవడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని చెప్పారు. ఎల్ కే అద్వానీ, కిరణ్‌బేడీ కేసులలో సాక్షులను ప్రశ్నించే అవకాశం ఇవ్వాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలకు వ్యతిరేకంగా కమిషన్ చర్యలు ఉన్నాయన్నారు. ప్రభుత్వం ఇప్పుడు చర్యలు తీసుకోకపోయినా అసెంబ్లీలో నివేదికను ప్రవేశపెట్టాక పిటిషనర్లు కోర్టు ద్వారా ఉపశమనం కావాలని కోరినప్పటికీ ప్రయోజనం ఉండదని అన్నారు. కాబట్టి తక్షణమే నివేదికపై స్టే ఇవ్వాలని కోరారు.


కమిషన్‌కు న్యాయవాది ఉన్నారా? లేదా?

జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ తరఫున వాదిస్తున్నట్టు గురువారం జరిగిన విచారణలో సీనియర్ న్యాయవాది ఎస్ నిరంజన్‌రెడ్డి చెప్పారు. ధర్మాసనం గురువారం జారీచేసిన ఉత్తర్వుల్లో కమిషన్ తరఫు సీనియర్ న్యాయవాది ఎస్ నిరంజన్‌రెడ్డి అని పేర్కొంది. శుక్రవారం కూడా నిరంజన్‌రెడ్డి ఆన్‌లైన్ లోనే హైకోర్టు విచారణకు హాజరయ్యారు. వాదనలు కూడా వినిపించారు. వాదనలు ఎవరి తరఫున చేస్తున్నారనే సందేహాన్ని పిటిషనర్ న్యాయవాది వ్యక్తం చేశారు. కేసు విచారణ ముగిశాక ధర్మాసనం ఉత్తర్వులను వెలువరించే దశలో అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి కల్పించుకుని, సీనియర్ న్యాయవాది నిరంజన్‌రెడ్డి విచారణ కమిషన్ తరపున వాదించడం లేదని చెప్పారు. రెండు పిటిషన్లలో (కేసీఆర్, హరీశ్‌రావు) ఒక పిటిషన్‌లో ప్రతివాదులైన ప్రభుత్వ అధికారుల తరపున ఆయన వాదించారని చెప్పడంతో ధర్మాసనం ఒకింత విస్మయానికి గురైంది. మూడో ప్రతివాది (విచారణ కమిషన్) తరపున వాదిస్తున్నట్టు స్వయంగా నిరంజన్‌రెడ్డే గురువారం జరిగిన విచారణ సమయంలో చెప్పారని రెండుసార్లు గుర్తుచేసింది. దీనిపై ఏజీ స్పందిస్తూ కాదు.. కాదు, ప్రభుత్వ అధికారుల తరపున వాదిస్తున్నారని చెప్పడం గమనార్హం. ఏజీ ఈ ప్రస్తావన చేసినప్పుడు ఆన్‌లైన్ విచారణకు హాజరైన నిరంజన్‌రెడ్డి అప్పటికే వెళ్లిపోయారు. ఈ పరిణామాల నేపథ్యంలో శుక్రవారం హైకోర్టు వెలువరించిన ఉత్తర్వుల్లో నిరంజన్‌రెడ్డి ప్రభుత్వ అధికారుల తరపున వాదించినట్టు రికార్డయింది. ఇంతకీ జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌కు న్యాయవాది ఉన్నారా.. లేరా..అని న్యాయ నిపుణులు చర్చించుకుంటున్నారు.

వారిపై వ్యక్తిగత ఆరోపణలు లేవు

ప్రభుత్వం తరపున ఏజీ సుదర్శన్‌రెడ్డి, ఎస్ నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. కమిషన్ నివేదికలో పిటిషనర్లు కేసీఆర్, హరీశ్‌రావుపై వ్యక్తిగతంగా అవినీతి ఆరోపణలు లేవని చెప్పారు. సీఎంగా, మంత్రిగా తీసుకున్న చర్యలపై విచారణ చేపట్టవచ్చునని, నివేదికలోని అంశాలు గోప్యంగానే ఉంటాయని చెప్పారు. పరిపాలనాపరమైన వైఫల్యాలపై ఫైండింగ్స్ ఉన్నాయన్నారు అసెంబ్లీలో రిపోర్టు నివేదించాక అదే సభలో సభ్యులైన పిటిషనర్లు ఇద్దరూ చర్చలో పాల్గొనేందుకు వీలుంటుందని చెప్పారు. పిటిషనర్లకు 8-బీ, 8-సీ నోటీసులు ఇవ్వనక్కర్లేదని అన్నారు. కమిషన్ విచారించిన 119 మంది సాక్షుల విచారణలో చిట్టచివరి వ్యక్తులు పిటిషనర్లేనని, ఎల్ కే అద్వాణీ, కిరణ్‌బేడీ కేసుల్లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు పిటిషనర్లకు వర్తించదని చెప్పారు. కోట్ల విజయభాస్కర్‌రెడ్డి కేసులో నోటీసుల జారీలో అన్ని అంశాలు పేర్కొనలేదని తెలిపారు. రిపోర్టుపై అసెంబ్లీలో చర్చించేవరకు పిటిషనర్లపై ఎలాంటి చర్యలు ఉండబోవని చెప్పారు. 60 పేజీల్లో బ్రీఫ్ రిపోర్టు మీడియాకు చేరిందని, ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్‌లో ఆ నివేదిక లేదని అన్నారు. పిటిషనర్లు కమిషన్ ఇచ్చిన నోటీసులను సవాల్ చేయలేదని అన్నారు. కమిషన్ నిజనిర్ధారణ మాత్రమే చేస్తుందని, కమిషన్ నివేదికపై ప్రభుత్వం తీసుకునే నిర్ణయాన్ని బట్టి తదుపరి పరిణామాలు ఉంటాయని అన్నారు. స్టే ఆదేశాలు అవసరం లేదని చెప్పారు.

లోకం పోకడ



మీరు స్కాలర్‌షిప్ బకాయిలు చెల్లించకపోవడంతో మా తంటాలేవో మేం పడుతున్నాం సార్.. తప్పా?!

వానా కాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	35.6°c	23.6°c
రంగారెడ్డి	33.2°c	20.5°c
ఖమ్మం	33.0°c	24.0°c
మెదక్	32.6°c	24.5°c
కరీంనగర్	32.0°c	26.0°c
వరంగల్	32.0°c	22.0°c
నిజామాబాద్	31.2°c	25.6°c
నల్లగొండ	30.5°c	23.2°c
హైదరాబాద్	30.0°c	22.0°c
మహబూబ్‌నగర్	29.0°c	22.0°c

కేక్ కట్ చేయాల్సిన రోజున తలకొరివి పెట్టడం బాధాకరం

ఇటువంటి దయనీయ స్థితి ఎవరికీ రాకూడదు

రామంతాపూర్ కరెంట్ షాక్ ఘటనపై హైకోర్టు

అనుమతి లేని కేబుళ్లను తొలగించాలని ఆదేశం



హైదరాబాద్, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ): 'తల్లిదండ్రుల మధ్య పుట్టిన రోజు వేడుకలను జరుపుకోవాల్సిన తొమ్మిదేండ్ల కొడుకు కన్న తండ్రి చితికి నిప్పు పెట్టే దయనీయ పరిస్థితి ఏర్పడింది. కేక్ కట్ చేయాల్సిన రోజున తలకొరివి పెట్టడం ఆ బాలుడి జీవితంలో ఎప్పటికీ మరవలేనిది. ఈ విషాదం ఆ బాలుడి జీవితంలో ఎప్పటికీ చెరిగిపోదు. ఇదేవిధంగా ఆరు కుటుంబాలు పడుతున్న మనోవేదనకు ఎవరు బాధ్యత వహిస్తారు? ప్రభుత్వ అధికారులు మాది కాదంటే మాది కాదంటూ తప్పించుకోవడానికి వీల్లేదు. ఎవరికి వారు కాడి వదిలేస్తానంటే కుదరదు. వాస్తవంగా ఆ దుర్ఘటనకు అందరూ బాధ్యులే. విద్యుదాఘాత ఘటనలో ఆరుగురు మరణించడం సమాజం సిగ్గుతో తలదించుకునేలా చేసింది. చట్టాన్ని అమలు చేయకుండా ప్రజల ప్రాణాలు ఎలా కాపాడగలం' అని రామంతాపూర్‌లో ఇటీవల జరిగిన విద్యుదాఘాత ఘటనపై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ భీమపాక తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్తు స్తంభాలకు వేలాడుతున్న కేబుళ్లను ప్రభుత్వ ఆదేశాలతో సిబ్బంది ఏకపక్షంగా తొలగించడాన్ని భారతి ఎయిర్‌టెల్ సంస్థ హైకోర్టులో సవాలు చేసింది. దీనిపై జస్టిస్ నగేశ్ భీమపాక శుక్రవారం విచారణ జరిపారు. రాష్ట్ర విద్యుత్తు శాఖకు చెందిన స్తంభాలకు ఉన్న అనుమతిలేని కేబుళ్లను తక్షణమే తొలగించాలని ప్రభుత్వానికి ఆదేశించారు.

కోతుల దాడిలో బాలికకు గాయాలు

సిరిసిల్ల జిల్లా బావుసాయిపేట పాఠశాలలో ఘటన

కోనరావుపేట, ఆగస్టు 22: రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఓ బాలికపై కోతులు దాడిచేశాయి. దీంతో బాలికకు స్వల్ప గాయాలయ్యాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం బావుసాయిపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు శుక్రవారం ఉదయం కోతులు గుంపుగా వచ్చాయి. వాటిని చూసి పిల్లలంతా పరుగులు తీశారు. ఈ సమయంలో ఐదో తరగతి చదువుతున్న షేక్ రేష్మపై కోతులు దాడి చేయగా, ఉపాధ్యాయులు వచ్చి వాటిని చెదరగొట్టారు. విద్యార్థిని కోనరావుపేట ప్రభుత్వ దవాఖానకు తీసుకువెళ్లి వైద్యం చేయించారు.

హాస్టల్‌లో ఉండటం ఇష్టం లేక..

బాలుడి ఆత్మహత్యాయత్నం

జగిత్యాల కలెక్టరేట్, ఆగస్టు 22: హాస్టల్‌లో ఉండడం ఇష్టం లేక ఓ బాలుడు ఆత్మహత్యకు యత్నించిన ఘటన జగిత్యాలలో జరిగింది. ఏపీకి చెందిన ఓ వ్యక్తి జగిత్యాల పట్టణంలో పనిచేస్తూ.. తన కొడుకును స్థానికంగా ఓ ప్రైవేటు స్కూల్ హాస్టల్‌లో చేర్పించాడు. శుక్రవారం హాస్టల్ నుంచి తప్పించుని బయటకు వచ్చిన బాలుడు.. బస్ డిపో వద్ద బస్సు కింద పడేందుకు యత్నించాడు. స్థానికులు, ట్రాఫిక్ పోలీసులు వారించి కాపాడారు. హోంగార్డు లక్ష్మీనారాయణ బాలుడిని ట్రాఫిక్ పీఎస్‌కు తీసుకెళ్లగా, హాస్టల్‌లో ఉండడం ఇష్టంలేదని తెలిపాడు.

24 తర్వాత మళ్లీ భారీ వర్షాలు

హైదరాబాద్, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో భారీ వర్షాలు తగ్గుముఖం పట్టినట్టు వాతావరణ శాఖ ప్రకటించింది. ఈ నెల 24న బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశాలున్నాయని, ఆ తర్వాత మళ్లీ వర్షాలు పుంజుకోవచ్చని అధికారులు వెల్లడించారు. శుక్రవారం రుతుపవన ద్రోణి తూర్పు, ఆగ్నేయ బంగాళాఖాతం వరకు కొనసాగిందని, దీని ప్రభావంతో రాష్ట్రంలో అక్కడక్కడ తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించారు. శుక్రవారం ములుగు, పెద్దపల్లి, కామారెడ్డి, జయశంకర్-భూపాలపల్లి, ఆదిలాబాద్, వనపర్తి, సంగారెడ్డి జిల్లాల్లో తేలికపాటి వర్షం కురిసినట్టు తెలిపారు. మొత్తంగా రాష్ట్రంలో ఈ నెల 19% అధిక వర్షపాతం నమోదైందని వెల్లడించారు.

'జలవివాద' కమిటీపై ఉత్తమ్ ఆగ్రహం

తనకు తెలియకుండా పేర్లు ప్రతిపాదించడంపై సీరియస్

తాత్కాలికంగా ఫైల్‌ను పక్కనబెట్టిన అధికారులు

హైదరాబాద్, ఆగస్టు22 (నమస్తే తెలంగాణ): ఏపీ ప్రభుత్వం చేపట్టిన బనకచర్ల ప్రాజెక్టుతోపాటు, జలవివాదాల పరిష్కారం కోసం రాష్ట్ర నీటిపారుదల శాఖ ప్రతిపాదించిన అధికారుల కమిటీపై ఆ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేసినట్టు విశ్వసనీయ సమాచారం. తనతో చర్చించకుండా అధికారుల పేర్లను ఎలా ప్రతిపాదిస్తారని నిలదీసినట్టు తెలిసింది. ఆ ప్రతిపాదనలను ఉత్తమ్ పక్కన పెట్టినట్టు ప్రభుత్వవర్గాలు వెల్లడించాయి. ఏపీ సర్కారు బనకచర్ల ప్రాజెక్టును చేపట్టిన నేపథ్యంలో.. ఇటీవల కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ నేతృత్వంలో ఢిల్లీ వేదికగా ఇరు రాష్ట్రాల సీఎంలు భేటీ అయ్యారు. జలవివాదాల పరిష్కారానికి కమిటీ వేయాలని ఇరు రాష్ట్రాలు అంగీకారానికి వచ్చారు.

వీరే ప్రతిపాదిత అధికారులు?

కేంద్రం సూచనతో అధికారుల పేర్లపై ఇరిగేషన్ శాఖ కసరత్తు చేసింది. అందులో భాగంగా ఇరిగేషన్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్ బొజ్జా, ఈఎన్సీ అమ్జద్ హుస్సేన్, జలవనరుల ప్రభుత్వ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, ఇంటర్‌స్టేట్ వాటర్ విభాగం ఎస్‌ఈ సల్లా విజయ్‌కుమార్ పేర్లను ఖరారు చేసినట్టు విశ్వసనీయ సమాచారం. ఆ ఫైల్‌ను అధికారులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి తాజాగా సమర్పించినట్టు తెలిసింది. ఆ ప్రతిపాదనలపై మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్టు విశ్వసనీయ సమాచారం. కమిటీ కోసం పేర్లను ఎవరు ప్రతిపాదించమన్నారు? ఏ ఉద్దేశంతో ప్రతిపాదనలను పంపారు? అంటూ సిబ్బందిపై నిప్పులు చెరిగినట్టు తెలుస్తున్నది.

చర్చనీయాంశంగా ఉత్తమ్ వైఖరి

ఇప్పటికే ఏపీ ప్రభుత్వం తమ రాష్ట్రం తరఫున పేర్లను కమిటీకి ప్రతిపాదించింది. తెలంగాణ సైతం అధికారుల పేర్లను పంపితే త్వరలోనే కేంద్ర జల్‌శక్తి శాఖ కమిటీని ఏర్పాటు చేయనున్నది. ఈ క్రమంలోనే తాజాగా ఇరిగేషన్ శాఖ అధికారులు పేర్లను ప్రతిపాదించడంపై మంత్రి ఉత్తమ్ ఇప్పుడు ఆగ్రహం వ్యక్తం చేయడం చర్చనీయాంశంగా మారింది. చర్చించకుండానే కమిటీ కోసం అధికారుల పేర్లను ప్రతిపాదించడాన్ని తప్పుబడుతున్నారా? లేదంటే మొత్తంగా కమిటీ కోసం సుముఖత వ్యక్తం చేయడాన్నే వ్యతిరేకిస్తున్నారా? అనేది తెలియక ఇరిగేషన్ శాఖ అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

మేడిగడ్డకు మరణశాసనం

▸ మొదటిపేజీ తరువాయి...

హామీ ఇస్తే ఇచ్చంపల్లి నుంచి గోదావరి-కావేరీ లింక్ ప్రాజెక్టుకు అంగీకరిస్తామని తెలంగాణ, ఏపీ అంగీకారం తెలిపాయి. ఈ మేరకు ఎన్‌డబ్ల్యూడీఏ (నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ అథారిటీ) భేటీలో ఆయా రాష్ట్రాలు తమ అభిప్రాయాలు వెల్లడించాయి. జీసీ లింక్ ప్రాజెక్టుపై బేసిన్‌లోని అన్ని రాష్ట్రాలతో 6వ కన్సల్టెంట్ మీటింగ్‌ను ఎన్‌డబ్ల్యూడీఏ టాస్క్‌ఫోర్స్ కమిటీ, సీడబ్ల్యూసీ చైర్మన్ అతుల్ జైన్ నేతృత్వంలో శుక్రవారం ఉదయం జలసౌధలో నిర్వహించారు. తెలంగాణ, ఏపీ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల అధికారులు నేరుగా సమావేశానికి హాజరుకాగా, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాల అధికారులు హైబ్రిడ్ మోడ్‌లో హాజరయ్యారు. ఒడిశా అధికారులు సమావేశానికి హాజరు కాలేదు. ఈ భేటీల్లో జీసీ లింక్‌పై ఆయా రాష్ట్రాల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టుపై రాష్ట్రాలు లేవనెత్తుతున్న సాంకేతిక అంశాలపై చర్చించారు.

జీసీ లింక్‌లో భాగం చేయొద్దు : కర్ణాటక

కర్ణాటక రాష్ట్ర ప్రతినిధులు మాట్లాడుతూ ఈక్విటబుల్ రేషియో ప్రకారం తమకు మళ్లింపు జలాల్లో 45 టీఎంసీల వాటా రావాల్సి ఉన్నదని, కనీసం 40 టీఎంసీలైనా కేటాయించాల్సిందేనని డిమాండ్ చేశారు. తుంగభద్ర డ్యామ్ పూడికతో నీటినిల్వ సామర్థ్యం తగ్గిపోయిందని, బేడ్తి వార్దా లింక్‌తో తమకు ఒరిగే ప్రయోజనం ఏమీ లేదని, దానికి బదులు తుంగభద్ర ఎగువన ప్రత్యేకంగా ఒక ఇంట్రా లింక్ ప్రాజెక్టు ఇవ్వాలని, జీసీ లింక్‌లో తమను భాగం చేయవద్దని కర్ణాటక తేల్చిచెప్పింది.

ఎక్కువ వాటా మాకే ఇవ్వాలి : మహారాష్ట్ర

మహారాష్ట్ర తరపు ప్రతినిధులు మాట్లాడుతూ గోదావరి, కృష్ణాలో అత్యధిక పరీవాహక ప్రాంతం తమదేనని, అయినా తమకు చుక్క నీటిని కూడా కేటాయించకపోవడం ఏమిటని నిలదీశారు. జీసీ లింక్‌లో నీళ్లు ఇవ్వకున్నా ఫర్వాలేదని, కానీ, ఇంద్రావతి సబ్ బేసిన్‌లోని 41 టీఎంసీలను వాడుకునేందుకు తాము ప్రతిపాదిస్తున్న ఇంట్రా లింక్ ప్రాజెక్టును నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదీగాక ట్రిబ్యునల్ అవార్డు ప్రకారం గోదావరి నుంచి కృష్ణాకు తరలించే జలాల్లో ఎక్కువ వాటా తమకే ఇవ్వాలని తేల్చిచెప్పారు.

ఇచ్చంపల్లికి సై : కాంగ్రెస్ సర్కారు

ఇచ్చంపల్లి బరాజ్‌తో మేడిగడ్డ బరాజ్‌కు తీవ్ర ముప్పు వాటిల్లనున్నది. అయినా ఆ ప్రతిపాదనలకు తెలంగాణ కాంగ్రెస్ సర్కారు అంగీకారం తెలిపింది. భేటీలో ఇరిగేషన్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్‌జీవన్ పాటిల్, ఇంటర్‌స్టేట్ విభాగం ఎస్‌ఈ సల్లా విజయ్‌కుమార్, డిప్యూటీ డైరెక్టర్ (గోదావరి) సుబ్రహ్మణ్యప్రసాద్ పాల్గొన్నారు. ఇచ్చంపల్లి నుంచి జీసీ లింకును చేపట్టేందుకు అంగీకరించారు. మళ్లించే 148 టీఎంసీల జలాల్లో తెలంగాణకు కేవలం 45 టీఎంసీలే (27శాతం) కేటాయించారని, అవి సరిపోవని 74 టీఎంసీలు (50శాతం) ఇవ్వాలని రాహుల్ బొజ్జా డిమాండ్ చేశారు. తెలంగాణకు మళ్లించే జలాలను ఏ బేసిన్‌లోనైనా వాడుకునే స్వేచ్ఛను ఇవ్వాలని, నీటి కోటా వినియోగానికి రెండు రిజర్వాయర్లను కేంద్రమే నిర్మించి ఇవ్వాలని కోరారు. గోదావరిలో తెలంగాణ వాటా 968 టీఎంసీలకు రక్షణ కల్పించాలని, జలాల మళ్లింపునకు తొలుత ఛత్తీస్‌గఢ్ నుంచి అంగీకారం తీసుకోవాలని తెలిపారు. దిగువ గోదావరిలో తెలంగాణ వాటా జలాల వినియోగానికి తొలి ప్రాధాన్యమివ్వాలని, ఆ తర్వాతే జీసీ లింక్‌లో మళ్లింపు చేపట్టేలా చూడాలని స్పష్టంచేశారు. సమ్మక్కసాగర్ ప్రాజెక్టుపై ప్రభావం పడకుండా ఆపరేషన్ ప్రొటోకాల్ షెడ్యూల్‌పై సిమ్యులేషన్ స్టడీస్ చేయాలని వెల్లడించారు. ఇచ్చంపల్లి నుంచి సాగర్‌కు నీటిని సరఫరా చేసేందుకు కాలువ తవ్వకం కోసం తెలంగాణలో చాలా వ్యవసాయ భూములు ముంపునకు గురవుతున్నాయని, ఆ ముంపును తగ్గించాలని కోరారు. నీటిని నేరుగా సాగర్ ప్రాజెక్టులోకి తీసుకెళ్లకుండా టెయిల్‌పాండ్‌కు తరలించి అక్కడి నుంచి తీసుకెళ్లాలని సూచించారు. జీసీ లింక్‌లో కర్ణాటకకు అదనంగా 16 టీఎంసీలు కేటాయించారని, అయితే నీటిని ఎక్కడి నుంచి వినియోగించుకుంటారనేది చెప్పలేదని, ఒకవేళ కృష్ణా బేసిన్‌లో రీప్లేస్‌మెంట్ పేరిట వినియోగానికి అనుమతిస్తే అది జూరాల ప్రవాహాలపై ప్రభావం చూపుతుందని, దీనిపై స్పష్టతనివ్వాలని కోరారు. జీసీ లింక్‌లో ఇచ్చే వాటాతో పాటు రాష్ట్రంలోని కరువు ప్రాంతాలకు తాగునీరు, సాగునీరు అందించేందుకు ఇచ్చంపల్లి నుంచి 200 టీఎంసీల వరద జలాలను వాడుకునేలా అనుమతివ్వాలని తెలంగాణ కోరింది. ఏపీ ప్రతిపాదించిన మరో 4 ఇంట్రా లింక్ ప్రాజెక్టులు చింతలపూడి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్, బాబు జగ్జీవన్‌రామ్ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, వైఎస్‌ఆర్ పల్నాడు డ్రాట్ మిటిగేషన్ ప్రాజెక్ట్, గుండ్రేవుల రిజర్వాయర్లను తెలంగాణ వ్యతిరేకించింది. వాటిని తిరస్కరించాలని ఎన్‌డబ్ల్యూడీఏకు స్పష్టంచేసింది. ఇప్పటికే బనకచర్ల ప్రాజెక్టును కేంద్ర సంస్థలు వ్యతిరేకించిన విషయాన్ని గుర్తుచేసింది. అన్ని రాష్ట్రాలూ సమ్మతించాకే ప్రాజెక్టుపై ముందుకెళ్లాలని తెలిపింది.



ఇచ్చంపల్లికి ఓకే : ఏపీ

భేటీల్లో ఏపీ తరపున జలవనరులశాఖ ప్రభుత్వ సలహాదారు వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నర్సింహమూర్తి పాల్గొన్నారు. గోదావరిలో నీటి లభ్యతపై 2023లో సీడబ్ల్యూసీ ఇచ్చిన రిపోర్టు సరిగా లేదని, అన్ని రాష్ట్రాల వినియోగాలను పరిగణలోకి తీసుకోలేదని వెల్లడించారు. ఆ నివేదిక ప్రకారం ముందుకు వెళ్తే తమ ప్రాజెక్టులపై ప్రభావం పడుతుందని తెలిపారు. జలాల మళ్లింపునకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి అంగీకారం తీసుకోవాలని చెప్పారు. ఇచ్చంపల్లి వద్ద బరాజ్ నిర్మాణానికి అంగీకరిస్తున్నట్టు తెలిపారు. పోలవరం నుంచే గోదావరి- కావేరీ లింక్‌ను చేపట్టే ప్రతిపాదనలను కూడా పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. గోదావరి నుంచి జలాలను మళ్లించి సాగర్, సోమశిల ప్రాజెక్టుల్లో వేయాలన్న ప్రతిపాదనలపై అభ్యంతరం వ్యక్తంచేశారు. ఆయా జలాశయాల్లో తమకు క్యారీ ఓవర్ స్టోరేజీ ఉన్నదని, ఆ వాటాలు తేల్చాలని, లేదంటే ఇతర రాష్ట్రాలూ వాటా అడిగే అవకాశమున్నదని ఆందోళన వ్యక్తంచేశారు. కాబట్టి అక్కడి నుంచి నీటి తరలింపు సులువు కాదని వెల్లడించారు. తుంగభద్ర బేసిన్‌లోని కరువు ప్రాంతాలకు నీళ్లివ్వాలని ప్రతిపాదించారు.

గోదావరి జలాల మళ్లింపును ఒప్పుకోం : ఛత్తీస్‌గఢ్

ఈ భేటీలో ఛత్తీస్‌గఢ్ సీఈ బండారి పాల్గొని తమ రాష్ట్ర అభిప్రాయాన్ని వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ వినియోగించుకోని జలాలనే ప్రస్తుతం తరలిస్తామని ఎన్‌డబ్ల్యూడీఏ ప్రతిపాదించడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. ట్రిబ్యునల్ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి గోదావరి జలాల్లో 301 టీఎంసీలను కేటాయించిందని, అందులో ఇప్పటికే 164 టీఎంసీలను వివిధ ప్రాజెక్టుల ద్వారా వినియోగించుకుంటున్నామని వెల్లడించారు. మిగిలిన వాటా జలాల వినియోగానికి ప్రణాళికలను సిద్ధం చేసుకున్నామని తెలిపారు. అందులో భాగంగా 100 టీఎంసీల వినియోగానికి బోద్‌ఘాట్ బహుళార్ధ సాధక ప్రాజెక్టును చేపడుతున్నామని వివరించారు. ప్రాజెక్టు ద్వారా జలవిద్యుత్తు ఉత్పత్తితో పాటు 4 లక్షల హెక్టార్లకు సాగునీటిని, తాగు, పారిశ్రామిక అవసరాలకు వినియోగించుకుంటామని తేల్చిచెప్పారు. మొత్తంగా ట్రిబ్యునల్ అవార్డు మేరకు తమ వాటా నీటిని తాము వినియోగించుకుంటామని స్పష్టంచేశారు. ఇక ఇచ్చంపల్లి వద్ద 87 మీటర్ల ఎఫ్‌ఆర్‌ఎల్‌తో బరాజ్ నిర్మిస్తే తమ రాష్ట్రంలో 170.6 హెక్టార్ల భూమి, 4 గ్రామాలు ముంపునకు గురవుతాయని తెలిపారు. జౌర్నాల పాయింట్ వద్ద ఒడిశాను ఒప్పించి ప్రాజెక్టును నిర్మించి అందులో 50 శాతం నీటి వినియోగానికి అనుమతివ్వాలని కోరారు.

అవి గోదావరి జలాలుగా భావించొద్దు : అతుల్ జైన్

జీసీ లింక్ ప్రాజెక్టుపై రాష్ట్రాలు వెల్లడించిన అభిప్రాయాలను ఎన్‌డబ్ల్యూడీఏ టాస్క్ ఫోర్స్ కమిటీ చైర్మన్ అతుల్‌జైన్ స్పందించారు. రాష్ట్రాలు వ్యక్తం చేసిన అభ్యంతరాలన్నింటినీ దాదాపు తోసిపుచ్చారు. తెలంగాణ కోరిన మేరకు మళ్లింపు జలాల్లో 50 శాతం వాటా ఇవ్వడం కుదరదని కరాకండిగా తేల్చిచెప్పారు. అదీగాక ఛత్తీస్‌గఢ్ లేవనెత్తిన అంశాలకు జవాబిచ్చారు. ఆ రాష్ట్ర వాటా జలాలను ముట్టుకోబోమని వెల్లడించారు. ప్రస్తుతం జీసీ లింక్‌లో మళ్లించేవి గోదావరి జలాలుగానే భావించవద్దని, హిమాలయ నదుల నుంచి గోదావరికి మళ్లించబోయే జలాలను తరలిస్తున్నట్టుగా భావించాలని సూచించారు. ఛత్తీస్‌గఢ్ తన వాటా జలాల వినియోగానికి మరో 15 నుంచి 20 ఏళ్ల సమయం పడుతుందని, అప్పటి వరకు హిమాలయ నదుల నుంచి జలాలను గోదావరికి మళ్లిస్తామని తెలిపారు. అప్పటివరకు గోదావరి జలాలను తాత్కాలికంగానే జీసీ లింక్ కోసం మళ్లిస్తామని, ఒకవేళ ఛత్తీస్‌గఢ్ ఎప్పుడైతే నీటిని వినియోగించుకుంటుందో అప్పటి నుంచి జీసీ లింక్ ద్వారా నీటి తరలింపు నిలిపేస్తామని వివరించారు. అప్పటి వరకు జీసీ లింక్‌లో తాత్కాలికంగానే ఛత్తీస్‌గఢ్ నీటిని వాడుకుంటామని స్పష్టంచేశారు. గోదావరిలో ఒక్క చుక్క కూడా వాడుకోబోమని స్పష్టంచేశారు. అన్ని రాష్ట్రాలూ పెద్దమనసు చేసుకుని ముందుకు రావాలని, జీసీ లింక్ ప్రాజెక్టుకు అంగీకారం తెలపాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రాలు ప్రతిపాదిస్తున్న ఇంట్రా లింక్ ప్రాజెక్టులను తోసిపుచ్చారు. నేషనల్ పర్‌స్పెక్టివ్ ప్లాన్ (ఎన్‌పీపీ)లో భాగంగా తీసుకున్న ప్రాజెక్టులకే కేంద్రం నిధులు సమకూర్చుతుందని, అందులో భాగంగా ఏ ప్రాజెక్టుకూ నిధులు సమకూర్చబోదని తేల్చిచెప్పారు. త్వరలోనే అన్ని రాష్ట్రాలతో మరోసారి కన్సల్టేషన్ మీటింగ్ నిర్వహించనున్నట్టు వెల్లడించారు. కాగా జీసీ లింక్ ప్రాజెక్టుకు తమిళనాడు, పుదుచ్చేరి ఇప్పటికే అంగీకారం తెలిపాయి. సమావేశానికి ఒడిశా, మధ్యప్రదేశ్ దూరంగా ఉన్నాయి. భేటీలో ఎన్‌డబ్ల్యూడీఏ సీఈ దేవేందర్‌రావు, తెలంగాణ తరపున ఇరిగేషన్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్ బొజ్జా, స్పెషల్ సెక్రటరీ ప్రశాంత్ పాటిల్, ఈఎన్సీ అమ్జద్ హుస్సేన్, ఇంటర్‌స్టేట్ ఎస్‌ఈ విజయ్ కుమార్, గోదావరి డిప్యూటీ డైరెక్టర్ సుబ్రహ్మణ్య ప్రసాద్ తదితరులు హాజరయ్యారు.

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి. చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. e-mail: editpage@ntnews.com

తెలంగాణ విధాతపై వికృత రాజకీయం



ఎస్.శంకర్
94942 34692

> నా తెలంగాణ ప్రజలారా! సమస్త ఉద్యోగ, రైతు సోదరులారా.. నేను చెప్పదలుచుకున్నది ఏమిటంటే.. 1956 నుంచి 2014 దాకా మనకు హక్కుగా దక్కాల్సిన ఉద్యోగాలు, నిధులు ఇవ్వక, సేద్యం కోసం నీళ్లు ఇవ్వక మన రైతాంగాన్ని అప్పటి ఆంధ్ర పాలకులు నానాయాతనలకు గురిచేశారు. వారి నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా కేసీఆర్ నాయకత్వంలో అలుపెరగని పోరాటం చేసి 2014లో తెలంగాణను సాధించుకున్నాం.

స్వరాష్ట్రంలో తెలంగాణ అభివృద్ధికి కావాల్సిన నీళ్లు, విద్యుత్తు, ఉద్యోగ నియామకాలు, మౌలిక వసతుల కల్పనకు కేసీఆర్ సర్కారు తొలి ప్రాధాన్యం ఇచ్చింది. పేదలకు డబుల్ బెడ్రూమ్ ఇండ్లు, ఇంటింటికి తాగునీరు, ఉచిత కరెంటు లాంటి ఎన్నో పథకాలను తీసుకొచ్చింది. ప్రాజెక్టులు, కాలువల ద్వారా ప్రతి ఎకరాకు నీళ్లు పారించడమే కాకుండా మోటర్లకు 24 గంటల ఉచిత కరెంట్ ఇచ్చింది. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ప్రతి మండలంలో దవాఖానలు పెట్టి, నయా పైసా ఖర్చు లేకుండా ప్రతి వ్యక్తికి ఉచితంగా ఎన్నో పరీక్షలు జరిపించింది.

తద్వారా దేశంలోనే కాదు, ప్రపంచవ్యాప్తంగా కేసీఆర్ పాలన 'రామరాజ్యం'గా పేరొందింది. అల్లర్లు, కులమతాల వైషమ్యాలు లేకుండా ప్రజా పాలన సాగిస్తూ కేసీఆర్ హయాంలో దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తెలంగాణ అభివృద్ధి చెందింది. ఇదే కాంగ్రెస్, బీజేపీలకు కన్నుకుట్టేలా చేసింది. అప్పటి బీఆర్ఎస్ నాయకులు, ఇప్పుడు కాంగ్రెస్‌లో చేరిన నాయకులకు ఎలాంటి కమీషన్లు ఇవ్వకుండా వారి నోర్లు కట్టినందుకు, వాళ్లు ఇవ్వాళ చిల్లర రాజకీయాలు చేస్తున్నారు. ముక్కలు ఆంధ్ర వాళ్లు తిని, బొక్కలు పడేయంగనే వీరి నోర్లు మూతబడ్డాయి.

> **1969 నాటి ఉద్యమంలో 369 మంది తెలంగాణ విద్యార్థులు, రైతులు చనిపోయినా కఠిన హృదయమున్న ఇందిరా గాంధీ తెలంగాణ ఇవ్వకుండా మోసం చేశారు. దానికితోడు అప్పటి తెలంగాణ ప్రజా సమితి (టీపీఎస్) నాయకులకు గవర్నర్, మంత్రి, ఇతర పదవులు ఇవ్వడంతో వారి నోర్లు మూతబడి, టీపీఎస్ అర్ధాంతరంగా మూతబడింది.**

ఇప్పుడున్న కె.కేశవరావు కూడా అపరాధియే. స్వలాభం కోసం ఏమైనా చేసే రకం. బీఆర్ఎస్‌లో ఉండి పదవులు అనుభవించి, కేసీఆర్‌ను మోసం చేసిన అవకాశవాది. ఆయనను ఎంత అన్నా తక్కువే. కాంగ్రెస్‌లో చెల్లని రూపాయిగా మారిన కేకే వంటి చాలా మంది కాంగ్రెస్ నాయకులకు కేసీఆర్ ఆశ్రయం ఇచ్చి ఆదరించారు. కానీ, నేడు అందుకు ప్రతిఫలంగా దుష్ట పరిపాలనకు సలహాదారుడిగా మారి కేసీఆర్‌పై కుట్రలను ప్రోత్సహిస్తున్న వీరిని ఏం చేసినా తప్పు లేదు.



2001లో టీఆర్ఎస్ పార్టీ స్థాపించి, జయశంకర్ సార్ ప్రోత్సాహంతో అలుపెరగని పోరాటాలు చేసి, కేంద్రంలోని అనేక పార్టీలను ఒప్పించి, తెలంగాణ ఆవశ్యకతను వారికి చెప్పి, పార్లమెంట్‌లో బిల్లు పెట్టించి మరీ ప్రత్యేక తెలంగాణకు ఊపిరిపోసిన కేసీఆర్‌ను తెలంగాణ గాంధీ అని పిలవడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. నాడు కాంగ్రెస్ ప్రభుత్వంలో మన రైతులు, ఉద్యోగులు పడుతున్న కష్టాలకు చెక్ పెట్టిన తెలంగాణ రాష్ట్ర సాధకులు కేసీఆర్. 2014లో పోరాట ఫలితంగా ప్రత్యేక తెలంగాణ ఏర్పాటైంది. అంతేకానీ, కాంగ్రెస్ వాళ్లు అంటున్నట్టు సోనియమ్మ ఇవ్వలేదు. ఇప్పటి కాంగ్రెస్ అధిష్ఠానం 'కనులుండి చూడలేరు, మనసుండి కానలేరు' అన్నట్టుగా.. తెలంగాణపై కక్షగట్టిన బీజేపీ మన రాష్ర్టానికి రావాల్సిన నిధులను ఇవ్వలేదు.

అయినా మొక్కవోని దీక్షతో తెలంగాణను అభివృద్ధి పథాన నిలిపిన కేసీఆర్‌ను బద్నాం చేయడానికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తాము చెప్పిన విధంగా రిపోర్టు ఇచ్చేందుకే కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ పేరిట జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను నియమించారు. కాబట్టి కాంగ్రెస్, బీజేపీ నేతల చెప్పుడు మాటలు విని జస్టిస్ పీసీ ఘోష్ నివేదిక తయారు చేసినట్టుగా అనిపిస్తున్నది. కాళేశ్వరం కింద సాగుబడి చేస్తున్న రైతులను, బడిపిల్లలను, గ్రామస్థులను, స్త్రీలను కలిసి వారి అభిప్రాయాలను కూడా సేకరించి ఉంటే, 19 నెలల క్రితం వచ్చిన నీళ్లు, కరెంటు ఇప్పుడెందుకు రావడం లేదన్న విషయాలు పూర్తిగా ఆయనకు తెలిసేవి. ఏ ప్రభుత్వంలో ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారు, ఏ ప్రభుత్వంలో కష్టాలు అనుభవిస్తున్నారో కూడా తెలిసేది.

కేసీఆర్‌ను, హరీశ్‌రావును, అప్పటి ఇంజినీర్లను దోషులుగా నిలబెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును చూసిన విదేశీయులు కూడా దాన్ని ఒక ప్రపంచ అద్భుతంగా కీర్తించారు. కాళేశ్వరం ద్వారా శ్రీరాంసాగర్, బంజేపల్లి, నిజాంసాగర్, రాష్ట్రంలోని అన్ని చెరువులు, కుంటలను నింపి కంపెనీల అవసరాలకు నీళ్లు ఇస్తూనే, తాగునీరు, వ్యవసాయానికి సాగునీరు అందించారు.

> **కాంగ్రెస్ అధికారం చేపట్టిన ఈ 19 నెలల నుంచే నీటి కష్టాలు ఎందుకు వస్తున్నాయి? చేలు ఎందుకు ఎండుతున్నాయి? ప్రజలకు తాగునీరు ఎందుకు రావట్లేదు? వ్యవసాయానికి నీళ్లు ఇవ్వాలని రైతులు ఎందుకు ఆందోళనలు చేస్తున్నారు? ఈ ప్రశ్నలకు 'ప్రజా ప్రభుత్వం' సమాధానం చెప్పాలి. పక్క రాష్ర్టానికి చెందిన రిటైర్డ్ అధికారులను సలహాదారులుగా పెట్టుకుని ఏం సాధించారు? తెలంగాణను ఎండబెట్టి, ఆంధ్రను సుభిక్షం చేయడమేనా?**

రైతుభరోసా, ఆసరా, కల్యాణలక్ష్మి-తులం బంగారం, రెండు లక్షల ఉద్యోగాలు, ఉద్యోగులకు పీఆర్సీ-డీఏలు, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ లాంటి హామీలను ఈ ప్రభుత్వం నెరవేర్చాలి. గురుకులాల్లో నాణ్యమైన ఆహారం అందించాలి.

జై కేసీఆర్! జై తెలంగాణ! జై భారత్!

(వ్యాసకర్త: రిటైర్డ్ ఆఫీసర్ సర్వేయర్, సర్వే ఆఫ్ ఇండియా)

> **కేసీఆర్‌ను, హరీశ్‌రావును, అప్పటి ఇంజినీర్లను దోషులుగా నిలబెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును చూసిన విదేశీయులు కూడా దాన్ని ఒక ప్రపంచ అద్భు తంగా కీర్తించారు. కాళేశ్వరం ద్వారా శ్రీరాంసాగర్, బంజేపల్లి, నిజాంసాగర్, రాష్ట్రంలోని అన్ని చెరువులు, కుంటలను నింపి కంపెనీల అవసరాలకు నీళ్లు ఇస్తూనే, తాగునీరు, వ్యవసాయానికి సాగునీరు అందించారు.**



వ్యవస్థల పోరులో నష్టపోయేదెవ్వరు?



డాక్టర్ దాసోజు శ్రవణ్

దేశంలోనే అతి పురాతన పార్టీ కాంగ్రెస్ ఎందరో మహనీయుల త్యాగాల ఫలితంగా పొందిన స్వాతంత్ర్యాన్ని గత 78 ఏండ్లుగా తన ఇష్టానుసారం దుర్వినియోగం చేస్తున్నది. రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తున్నది. ప్రజాస్వామ్య స్ఫూర్తిని మంటగలుపుతున్నది. మరీ ముఖ్యంగా మన ప్రజాస్వామ్య విలువలను నీరుగార్చే రాజ్యాంగ విరుద్ధమైన, చట్ట వ్యతిరేకమైన చర్యలు తెలంగాణలో రేవంత్‌రెడ్డి గద్దెనెక్కాక మరింత ఎక్కువయ్యాయి. ఈ నేపథ్యంలోనే రెండు వారాల వ్యవధిలోనే రేవంత్ సర్కారుకు సుప్రీంకోర్టు రెండుసార్లు మొట్టికాయలు వేసింది. ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు తీర్పు అందులో మొదటిది కాగా, గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకాన్ని రద్దు చేయడం రెండోది.

ఉద్యమ సారథి కేసీఆర్ వెన్నంటే ఉంటూ తెలంగాణ సాధనోద్యమంలో సర్వస్వం ధారపోసిన నేను ఎన్నడూ పదవుల కోసం ఆశ పడలేదు. కానీ, నా సేవలను గుర్తించిన కేసీఆర్ 2023 జూలై 31న గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా సిఫారసు చేశారు. ఒక బడుగుల బిడ్డ ఎదగడాన్ని జీర్ణించుకోలేకపోయిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు గవర్నర్ కార్యాలయాన్ని తమ రాజకీయ లబ్ధి కోసం వాడుకున్నాయి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 171 (5) ప్రకారం లిటరేచర్, సైన్స్, ఆర్ట్, కోపరేటివ్ మూవ్‌మెంట్, సోషల్ సర్వీస్ విభాగాల్లో సేవలందించిన వారిని గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీలుగా నియమించవచ్చు. సోషల్ సర్వీస్ విభాగం కింద అప్పటి కేసీఆర్ ప్రభుత్వం నన్ను ఎమ్మెల్సీగా సిఫారసు చేసింది. కానీ, రెండు నెలలకు పైగా క్యాబినెట్ సిఫారసుపై ఎటూ తేల్చకుండా నాన్చిన అప్పటి గవర్నర్ తమిళి సై.. 2023 సెప్టెంబర్ 19న దాన్ని రద్దు చేశారు. రాజకీయ పార్టీలతో అనుబంధమున్న వ్యక్తులను ఆర్టికల్ 171 (5) ప్రకారం సోషల్ సర్వీస్ విభాగం కింద ఎమ్మెల్సీగా నియమించలేమని పేర్కొన్నారు. ఆ తర్వాత ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడం చకచకా జరిగిపోయాయి. గత క్యాబినెట్ సిఫారసు చేసిన మా పేర్లను కొత్తగా ఎన్నికైన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వెనక్కి తీసుకొని, వేరే వారిని సిఫారసు చేస్తుందని తెలిసీ, గవర్నర్ నిర్ణయాన్ని సవాలు చేస్తూ 2023 డిసెంబర్ 7న హైకోర్టును ఆశ్రయించాను. ఊహించినట్టుగానే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మా పేర్లను వెనక్కి తీసుకొని, 2024 జనవరి 13న సోషల్ సర్వీస్ విభాగంలో తెలంగాణ జనసమితి అధ్యక్షుడు కోదండరాం, మీడియా విభాగంలో జర్నలిస్టు అమీర్ అలీఖాన్ పేర్లను సిఫారసు చేసింది.

> **అంతకుముందు రాజకీయ పార్టీతో సంబంధముందని సాకుగా చెబుతూ మా పేర్లను కాదన్న గవర్నర్.. 2024 జనవరి 27న ఏకంగా ఒక పార్టీ అధ్యక్షుడిగా ఉన్న వ్యక్తిని గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నియమించాలన్న క్యాబినెట్ సిఫారసులను ఆమోదించారు. మా పేర్లను ప్రతిపాదించిన కేసీఆర్ క్యాబినెట్ సిఫారసులను రద్దు చేయడం, ఆ తర్వాత కాంగ్రెస్ క్యాబినెట్ నిర్ణయాన్ని ఆమోదించడం వెనుక రాజకీయం కోణం ఉన్నదని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు.**

గవర్నర్ ఆమోదం తెలిపిన దరిమిలా 2024 జనవరి 27న కాంగ్రెస్ ప్రభుత్వం ఎమ్మెల్సీల నియామకంపై గెజిట్ విడుదల చేసింది. అయితే, 2024 జనవరి 30న అప్పటి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్ కుమార్‌లతో కూడిన హైకోర్టు ధర్మాసనం ఈ నియామకాలపై స్టే విధించింది. కేసీఆర్ క్యాబినెట్ సిఫారసులను గవర్నర్ తిరస్కరించిన ఆర్డర్‌ను, కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా ఎమ్మెల్సీలుగా నియామకం చేపట్టడాన్ని 2024 మార్చి 7 నాటి తన తీర్పులో హైకోర్టు రద్దు చేసింది. ఆ తర్వాత ఈ వ్యవహారం సుప్రీంకోర్టు చేరింది. ఇరుపక్షాల వాదనలు విన్న సుప్రీంకోర్టు గతేడాది ఆగస్టు 14న హైకోర్టు ఆదేశాలపై స్టే విధించింది. తదుపరి విచారణ కొనసాగుతుందని స్పష్టంగా పేర్కొంది. కానీ, సుప్రీంకోర్టు స్టేను రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తనకు అనుకూలంగా మలుచుకున్నది.

సుప్రీంకోర్టు స్టేను తప్పుగా అన్వయించుకొని అప్పటికే గవర్నర్ ఆమోదించిన క్యాబినెట్ నిర్ణయం, ప్రభుత్వం విడుదల చేసిన గెజిట్‌ను ముందటవేసుకొని రెండు రోజులకే ఆగస్టు 16న ఎమ్మెల్సీలుగా ప్రమాణస్వీకారం చేయించేసింది. తాజాగా ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవానికి రెండు రోజుల ముందు ఆగస్టు 13న ఈ నియామకాన్ని సుప్రీంకోర్టు రద్దు చేసింది. తాము హైకోర్టు తీర్పుపై స్టే మాత్రమే ఇచ్చామని, నియామక ప్రక్రియ కొనసాగించాలని ఎక్కడా చెప్పలేదని న్యాయస్థానం పేర్కొనడం గమనార్హం. తమ పొరపాటు వల్ల వారు అయాచిత లబ్ధి పొందారని కూడా చెప్పడం విశేషం. అయితే, వ్యవస్థల మధ్య జరుగుతున్న ఈ సంఘర్షణలో నష్టపోయిందెవరు?

గవర్నర్ నిర్ణయాలు రాజ్యాంగబద్ధంగా ఉన్నాయా, లేవా? అన్న న్యాయ సమీక్ష చేసే అధికారం కోర్టులకు అదే రాజ్యాంగం కల్పించింది. గవర్నర్ సొంతంగా నిర్ణయం తీసుకునే వీలు లేదు. క్యాబినెట్ నిర్ణయాలపై ఏవైనా అనుమానాలుంటే అభ్యంతరాలు వ్యక్తం చేయవచ్చు. అందుకు సంజాయిషీ కోరవచ్చు. అంతేతప్ప, క్యాబినెట్ నిర్ణయాలను పూర్తిగా పక్కనపెట్టడం, రద్దు చేయడం లాంటి హక్కులు గవర్నర్‌కు లేవు. ఇది నేను చెబుతున్న విషయం కాదు. ఈ కేసు విచారణ సందర్భంగా హైకోర్టు ధర్మాసనం పేర్కొన్నది. 2016లో అరుణాచల్ ప్రదేశ్‌లో వ్యవస్థల మధ్య ఏర్పడిన సంఘర్షణతో రాజ్యాంగ సంక్షోభం ఏర్పడింది. Nabam rebia vs Deputy speaker కేసు విచారణ సందర్భంగా గవర్నర్ విధుల గురించి సుప్రీంకోర్టు ధర్మాసనం ఇదే విషయాన్ని స్పష్టం చేసింది. అయినప్పటికీ బీజేపీ, కాంగ్రెస్ పార్టీల ప్రోద్బలంతో అప్పటి గవర్నర్ తమిళి సై తన కార్యాలయాన్ని రాజకీయ వేదికగా మార్చేశారు.

> **2023 జూలై 31న కేసీఆర్ క్యాబినెట్ మా పేర్లను ఎమ్మెల్సీలుగా సిఫారసు చేసిన నాటినుంచి ఇప్పటివరకు రెండేండ్ల విలువైన సమయం వృథా అయ్యింది. రాజ్యాంగం ప్రకారం, చట్టబద్ధంగా మాకు దక్కాల్సిన పదవులు దక్కలేదు. అటు గవర్నర్ తప్పిదం, ఇటు సుప్రీంకోర్టు పొరపాటు కారణంగా ఇతరులు అయాచిత లబ్ధి పొందారు.**

నాకు పదవులు ముఖ్యం కాదు. మాజీ ప్రధాని వాజపేయి చెప్పినట్టు ప్రభుత్వాలు వస్తుంటాయి, పోతుంటాయి.. ఈ దేశం, రాజ్యాంగమే శాశ్వతం. రాజ్యాంగాన్ని అమలు చేయాల్సిన, ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడాల్సిన వ్యవస్థలు, పాలకులే ఇలా వ్యవహరించడం ఎంత వరకు సబబు? నేను మొదటి నుంచీ చెప్తున్నట్టు నా పోరు వ్యక్తులపై కాదు, వ్యవస్థలపై. సెప్టెంబర్ 17న వెలువడనున్న ఈ కేసు తుది తీర్పులో అంతిమంగా న్యాయమే గెలుస్తుందని ఆశిస్తున్నా.

(వ్యాసకర్త: రాష్ట్ర శాసనమండలి సభ్యులు)



పడరాని కష్టాలు

యూరియా కోసం
పొద్దుతో పోటీ పడుతున్న రైతులు
ముందుచూపు లేని పాలనతో
రైతుల ఇక్కట్లు
ఖాకీ పహారాలో
చెప్పుల వరసలు!

అన్నదాతల అవస్థలను
పట్టించుకోని పాలకులు
చీమల బారుల
మహిళలు, రైతులు
ఒక పక్క అతివృష్టి
మరోపక్క యూరియా అనావృష్టి!

పనిపాట విడిచి
కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు
తిండి తిప్పలు మరిచి
చెట్ల కిందనే సేద తీరుతున్నారు
కన్నుల్లో ఒత్తులేసుకొని
యూరియా కోసం ఎదురుచూపులు!

ఓపిక నశించి
తిరుగబడుతున్న వైనం
యూరియా యుద్ధంలో
గాయపడిన రైతులెందరో
చివరికి చేసేది ఏమీ లేక
రోడ్డెక్కిన రైతులు
ప్రజాపాలనలో
పడరాని కష్టాలు!!



ఎదిరేపల్లి కాశన్న

గోదావరి జలాలకు ఆంధ్ర అడ్డుకట్ట

> 'తెలంగాణను ఆంధ్రతో విలీనం చేసినట్టయితే ఈ ప్రాంత సాగునీటి కోసం నిర్మిస్తున్న, నిర్మించాలనుకుంటున్న పలు ప్రాజెక్టులు పూర్తికావన్న భయాందోళనలు, నదీజలాలు దిగువకు తరలించుకుపోతారన్న అనుమానాలు ఈ ప్రాంత ప్రజల్లో ఉన్నందున అన్నిరంగాల్లో అప్పటికే అభివృద్ధి చెందిన ఆంధ్రతో సమానంగా తెలంగాణను కూడా అభివృద్ధి చేసి, 1962లో హైదరాబాద్ రాష్ట్ర శాసనసభకు జరిగే ఎన్నికల్లో మూడింట రెండొంతుల మంది శాసనసభ్యులు అప్పటికీ తెలంగాణను ఆంధ్రతో కలిపేందుకు అంగీకరిస్తే విలీనం చేయవచ్చు'నని అప్పటి స్టేట్స్ రీ-ఆర్గనైజేషన్ కమిషన్ (ఎస్ఆర్సీ) సిఫారసు చేసింది. అయినా ఏ మాత్రం పట్టించుకోకుండా తెలంగాణను ఆంధ్ర రాష్ట్రంలో విలీనం చేసి గోదావరి జలాలకు మరణశాసనం రాసింది అప్పటి (కాంగ్రెస్) ప్రధాని నెహ్రూ, ఆయన ఒత్తిళ్లకు లొంగి విలీనానికి అంగీకరించిన అప్పటి హైదరాబాద్ ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు.



వి.ప్రకాశ్



గోదావరి జలాలకు మరణశాసనం- సమైక్య రాష్ట్రం: 1956 నవంబర్ 1న ఏపీ తొలి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నీలం సంజీవరెడ్డి (ఆంధ్ర) తన తొలి మూడేండ్ల పాలనలోనే గోదావరి జలాలకు మరణశాసనం రాశారు. అప్పటికే రెండవ పంచవర్ష ప్రణాళికలో చేర్చి, నిధుల కేటాయింపు పొంది, నిర్మాణ పనులు ప్రారంభమైన దేవునూరు బహుళార్థ సాధక ప్రాజెక్టును నిర్మించనవసరం లేదని, దీనికోసం కేటాయించిన రూ.2.20 కోట్లను పోచంపాడుకు మళ్లించాలని స్వయంగా అధికారిక లేఖను కేంద్ర ప్రభుత్వానికి రాశారు నీలం సంజీవరెడ్డి. 1959 ఆగస్టులో ప్రణాళికా సంఘం సభ్యుడు త్రివేదిని నీలం సంజీవరెడ్డి కోరినప్పుడు.. 'దేవునూరు జలవిద్యుత్తు ప్రాజెక్టును మీరు వదులుకున్నా పోచంపాడుకు నిధులను బదిలీ చేయడం కుదరద'ని స్పష్టం చేశారు.

> **దేవునూరు ప్రాజెక్టు రద్దు:** 27 టీఎంసీలకు తగ్గించి అనుమతి పొందిన ప్రాజెక్టు దేవునూరు. మెదక్ జిల్లాలో లక్ష ఎకరాలకు మంజీరా నది నుంచి సాగునీరు, హైదరాబాద్ నగరానికి 150 క్యూసెక్కుల తాగునీరు, 14,250 కిలోవాట్ల విద్యుదుత్పాదన, దిగువన ఉన్న నిజాంసాగర్‌కు నదిలో ఇసుక కొట్టుకురాకుండా నివారించడం తదితర లక్ష్యాలుగా రూ.11.95 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించాలనుకున్న దేవునూరు ప్రాజెక్టును రద్దు చేసిన 'ఘనత' కాంగ్రెస్ పాలకులదే.

కాంగ్రెస్ పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనం నిజాంసాగర్: 1931లోనే నిజాం ప్రభుత్వం నిర్మించిన నిజాంసాగర్ కాల్వల కింద కోటి ఆశలతో కోస్తాంధ్ర నుంచి వలసవచ్చి చెరుకు, వరి పంటలు పండిస్తున్న రైతుల నోట్లో మట్టికొట్టిన (తెలంగాణ రైతుల నోట్లో కూడా) మరో వలసవాది కాంగ్రెస్ ముఖ్యమంత్రి జలగం వెంగళరావు. అప్పటికే నిజాంసాగర్ నీటి నిల్వ సామర్థ్యం సుమారు 30 టీఎంసీల నుంచి 11.8 టీఎంసీలకు తగ్గింది. దీనికి కారణం ఇసుక కొట్టుకురాకుండా దేవునూరు ప్రాజెక్టును మంజీరా నదిపై నిజాంసాగర్‌కు ఎగువన నిర్మించాలని నదికి ఇరువైపులా కొంత దూరం వరకు భూమి కోతకు గురికాకుండా లక్షలాది మొక్కలు నాటాలన్న నిజాం ప్రణాళికను అమలుచేయకపోవడం. అసలే 11 టీఎంసీలకు నిజాంసాగర్ నీటి నిల్వ సామర్థ్యం పడిపోయిందంటే, ఆ కొద్ది నీటిని కూడా రానివ్వకుండా ఎగువన మంజీరాపై హైదరాబాద్ పారిశ్రామిక, తాగునీటి అవసరాల కోసం సింగూరు ప్రాజెక్టును నిర్మించింది అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం. నిజాంసాగర్ రైతులు దీన్ని వ్యతిరేకిస్తూ ఆందోళన చేయగా 'మీకు నీళ్లివ్వడానికే సింగూరులో నిల్వ చేస్తున్నా'మని నమ్మించి మోసం చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమే. సింగూరు ప్రాజెక్టు కింద కాల్వలు నిర్మించి 2 టీఎంసీలతో మెదక్ జిల్లాలో 40 వేల ఎకరాలకు సాగునీరిస్తామని ఈ ప్రాంత రైతులను నమ్మించడానికి తూములు పెట్టి కాల్వలు నిర్మించకుండా వదిలివేశాయి కాంగ్రెస్ తదనంతర తెలుగుదేశం ప్రభుత్వాలు. కేంద్ర కార్మిక శాఖ మంత్రిగా కేసీఆర్ ఉన్న సమయంలో అప్పటి సీఎం వైఎస్ఆర్‌తో (సోనియాగాంధీ చొరవతో) జరిపిన హై లెవెల్ మీటింగ్‌లో సింగూరు కాల్వలను నిర్మించాలని పట్టుబట్టారు. తదనంతరం ఎనిమిదేండ్లు కాంగ్రెస్ ప్రభుత్వమే రాష్ట్రంలో ఉన్నా కాల్వల పనులు పూర్తిచేయలేదు. కేసీఆర్ సీఎం అయిన తర్వాతే రైతుల పొలాలను సింగూరు నీళ్లు తడిపాయి. తగ్గిన నిజాంసాగర్ నీటి నిల్వ సామర్థ్యాన్ని రైతుల ఆందోళనల కారణంగా 11.8 టీఎంసీల నుంచి 17.8 టీఎంసీలకు పెంచినా మంజీర నీళ్లను సింగూరు నుంచి వదలకుండా హైదరాబాద్ అవసరాలకు తరలిస్తుండటం వల్ల నిజాంసాగర్ కింద యాభై వేల ఎకరాలకు కూడా సాగునీరు అందడం లేదు.

జీవం కోల్పోయిన మంజీరా: మంజీరా నది ఎగువన ఎలాంటి అనుమతులు లేకుండానే తెలంగాణ రైపేరియన్ రైట్స్‌ను హరిస్తూ మహారాష్ట్ర అప్పర్ మంజీరా డ్యాం ఎత్తు పెంచినా, నదిపై 32, ఉపనదులపై వందలాది బ్రిడ్జ్ కం బ్యారేజీలు, ప్రధాన నదిపై కర్ణాటక 5 బ్యారేజీలు కట్టినా.. ఈ వ్యాసకర్త 2002లో మంజీరా నదిపై పర్యటించి ఈ అక్రమ బ్యారేజీలను వెలుగులోకి తెచ్చేదాకా మన ప్రభుత్వాలకు, ముఖ్యంగా చంద్రబాబు ప్రభుత్వానికి సోయి రాలేదు. ప్రాజెక్టు ఆయకట్టులో బోర్లు వేసుకునే దుస్థితి నిజాంసాగర్ రైతులకు రావడానికి బాధ్యత వహించాల్సింది కాంగ్రెస్ పాలకులే.

> **కె.ఎల్.రావు అనుమానాలే నిజమయ్యాయి:** మంజీరా నీళ్ల దుస్థితి ఇలా ఉంటే నిజాం నిర్మించాలనుకున్న గోదావరి (ఆరు జిల్లాల్లో 28 లక్షల ఎకరాలకు సాగునీరిచ్చే) ప్రాజెక్టును నీలం సంజీవరెడ్డి, కాసు బ్రహ్మానందరెడ్డిల నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు 1963 జూలై 26న కేవలం 66 టీఎంసీల వినియోగంతో 5.70 లక్షల ఎకరాలకు సాగునీరిచ్చే ప్రాజెక్టుగా కుదించి నెహ్రూతో శంకుస్థాపన చేయించారు.

ఒక్కరోజు ముందు శంకుస్థాపన చేసిన శ్రీశైలం డ్యాం నిర్మాణానికి పోచంపాడు మెషినరీని తరలించడంతో 1969లో తెలంగాణ తొలిదశ ఉద్యమం సందర్భంగా తెలంగాణ రీజినల్ కమిటీతో పాటు ప్రొఫెసర్ జయశంకర్, ఇతర నేతలు ఈ ప్రాజెక్టు జాప్యం, నిధుల కొరతపై ప్రశ్నించిన తర్వాతే కొద్దిగా నిధులు విడుదల చేశారు. పోచంపాడు పేరును అప్పటి సీఎం చెన్నారెడ్డి శ్రీరాంసాగర్‌గా మార్చి (జీవో నెం.355 తేదీ 20.11.78) ఆయకట్టును తొలిదశ 9,54,000 ఎకరాలు, రెండో దశ 4,40,000 ఎకరాలు, వరదకాల్వ మరో 2,00,000 ఎకరాలు పెంచినా ఈ పనులన్నీ పూర్తికావడానికి నాలుగు దశాబ్దాల జాప్యం జరిగింది. ఈలోగా శ్రీరాంసాగర్‌కు ఎగువన గోదావరి ప్రధాన నదిపై బాబ్లీతో పాటు 13 బ్యారేజీలు, ఉప నదులు, వాగులపై వందల సంఖ్యలో బ్యారేజీలు నిర్మించడంతో 196 టీఎంసీలను వినియోగించాల్సిన శ్రీరాంసాగర్‌కు చుక్క నీరు రావడమే కరువైంది. క్లౌడ్ బరస్ట్ అయి భారీ వర్షాలు ఎగువన కురిసినప్పుడే ఈ ప్రాజెక్టుకు నీరు చేరుతుంది. సమైక్య రాష్ట్రంలో ఈ ప్రాజెక్టు వివక్షకు, నిర్లక్ష్యానికి గురైనందున ఏనాడూ మొదటి దశలో సగం ఆయకట్టుకు కూడా నీళ్లు రాలేదు. రెండో దశ కాల్వలు, వరద కాల్వల్లో చుక్క నీరు రాలేదు. అలీ నవాజ్ జంగ్ నిర్మించాలనుకున్న పెన్‌గంగా, ప్రాణహిత, ఇచ్చంపల్లి ప్రాజెక్టులను నీలం సంజీవరెడ్డి నుంచి కిరణ్‌కుమార్ రెడ్డి దాకా కాంగ్రెస్, టీడీపీ ముఖ్యమంత్రులెవరూ నిర్మించడానికి ఎలాంటి ప్రయత్నం కూడా చేయలేదు.

దుబాయి, బొంబాయి, బొగ్గుబాయి, బస్తర్: ఉత్తర తెలంగాణ జిల్లాల్లో పైన పేర్కొన్న సాగునీటి ప్రాజెక్టుల్లో వివక్ష, తీవ్ర నిర్లక్ష్యం వల్ల తీవ్రమైన దుర్భిక్ష పరిస్థితులు నెలకొనడంతో కన్నబిడ్డలకు ఇంత అన్నం పెట్టడానికి లక్షలాది మంది విద్యావంతులు, నిరక్షరాస్యులైన తెలంగాణ రైతు కూలీలు గల్ఫ్ దేశాలకు వలసబోయి దారుణమైన బాధలుపడ్డారు. వేలాదిగా మరణించడమో, జైలు పాలు కావడం జరిగింది. ఈ జిల్లాల్లోనే 1970 తర్వాత నక్సలైట్ ఉద్యమం మొదలై వేలాదిగా యువతీ యువకులు తుపాకులు పట్టుకొని భారతదేశమంతా మావోయిస్టు ఉద్యమాన్ని తీవ్రతరం చేశారు. పీపుల్స్‌వార్ మాజీ కార్యదర్శి గణపతి (ముప్పాళ లక్ష్మణరావు) నుంచి ప్రస్తుత కేంద్ర కమిటీ నేత మల్లోజుల వేణుగోపాలరావు వరకు ఉత్తర తెలంగాణకు చెందిన అగ్రనేతలే. అబూజ్‌మడ్‌లో మరణిస్తున్న వందలాది మంది విప్లవకారుల్లో డజన్ల మంది ఉత్తర తెలంగాణవారే. తెలంగాణ తొలి దశ ఉద్యమాన్ని అణచివేయగానే నక్సలైట్ ఉద్యమాన్ని తెలంగాణలో ప్రారంభించిన నక్సలైట్లే కొండపల్లి, సత్యమూర్తిల నాయకత్వం నుంచి బయటపడి, మలిదశ తెలంగాణ ఉద్యమానికి సన్నద్ధమయ్యారు. 'దగాపడిన తెలంగాణ' లెక్కలు బయటపెట్టి గద్దర్‌తో 'అమ్మా తెలంగాణమా' అంటూ ఆకలి కేకల గానాన్ని వినిపించారు. తెలంగాణ చూడకుండానే అసువులుబాసిన లాల్‌గర్ కిషన్ జీ, నల్లా ఆదిరెడ్డి తొలిదశ తెలంగాణ ఉద్యమ ధ్రువతారలే.

సింగరేణి బొగ్గు గనుల్లో తట్టమోస్తున్న వేలాది మంది ఉత్తర తెలంగాణ రైతు కుటుంబాల నుంచి వచ్చిన బిడ్డలే. సికాసను రగిలించి హక్కుల కోసం పోరాడి అమరులైన వారెందరో! బొంబాయి, భీవండి, సూరత్, షోలాపూర్ వంటి దూరప్రాంతాలకు (తాము నేసిన బట్టలను కొనేవారు లేక) కూలీలుగా వేల సంఖ్యలో వలసబోయిన పద్మశాలీ బిడ్డలు ఈ ఉత్తర తెలంగాణవారే. రెండు దశాబ్దాల కాలంలో సాగునీరు లేక, బావులు, బోర్లు లక్షలాదిగా ఎండిపోవడంతో బోరులో నీళ్ల కోసం పదుల సంఖ్యలో బోర్లు వేసి అప్పులపాలై, పరువు పోయి పెరుగన్నంలో పురుగుమందు కలుపుకొని, చెట్ల కొమ్మలకు, ఇంటి దూలాలకు ఉరిబెట్టుకొని బలవన్మరణాలకు పాల్పడ్డ వేలాది రైతు బిడ్డలు ఉత్తర తెలంగాణవారే.

(వ్యాసకర్త: చైర్మన్, భారత వర్షాధార నదీ పరీవాహక ప్రాంతాల కౌన్సిల్)

> **ఉత్తర తెలంగాణ జిల్లాల్లో పైన పేర్కొన్న సాగునీటి ప్రాజెక్టుల్లో వివక్ష, తీవ్ర నిర్లక్ష్యం వల్ల తీవ్రమైన దుర్భిక్ష పరిస్థితులు నెలకొనడంతో కన్న బిడ్డలకు ఇంత అన్నం పెట్టడానికి లక్షలాది మంది విద్యావంతులు, నిరక్షరాస్యులైన తెలంగాణ రైతు కూలీలు గల్ఫ్ దేశాలకు వలసబోయి దారుణమైన బాధలుపడ్డారు. వేలాదిగా మరణించడమో, జైలు పాలు కావడం జరిగింది. ఈ జిల్లాల్లోనే 1970 తర్వాత నక్సలైట్ ఉద్యమం మొదలై వేలాదిగా యువతీ యువకులు తుపాకులు పట్టుకొని భారతదేశమంతా మావోయిస్టు ఉద్యమాన్ని తీవ్రతరం చేశారు.**



శాంతి చర్చలు కాదు, అదొక ట్రాప్!


రష్యా పైకి శాంతి మంత్రం జపిస్తూనే ఉక్రెయిన్‌పై ఇంకా దాడులను కొనసాగిస్తున్నది. ఉక్రెయిన్ భూభాగాలను ఆక్రమించుకోవడమే పుతిన్ అసలు లక్ష్యం. శాంతి ఒప్పందం పేరిట జరుగుతున్న చర్చలు ఆ భూభాగాల కోసం విసురుతున్న ఒక వల. రష్యా షరతులు, డిమాండ్లకు ఒప్పుకొంటే ఆ ట్రాప్‌లో ఉక్రెయిన్ చిక్కుకున్నట్టే.

– కాజా కల్లాస్, ఈయూ ప్రతినిధి

దేశంలోనే సంపన్న సీఎం చంద్రబాబు

- రెండో స్థానంలో అరుణాచల్ ప్రదేశ్ సీఎం పెమా ఖండూ
- తక్కువ ఆస్తులున్న సీఎం మమత
- అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫామ్స్ నివేదిక వెల్లడి

కోల్‌కతా, ఆగస్టు 22: దేశంలోని 31 మంది ముఖ్యమంత్రులలో అత్యంత సంపన్నుల జాబితాలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్ చంద్రబాబు నాయుడు అగ్ర స్థానంలో ఉన్నారు. ఆయన ఆస్తుల విలువ రూ. 931 కోట్ల మేరకు ఉండగా, అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి పెమా ఖండూ రూ. 332 కోట్ల ఆస్తులతో రెండవ స్థానంలో ఉన్నారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అత్యంత తక్కువ ఆస్తులున్న ముఖ్యమంత్రిగా నిలిచారు. ఆమె ఆస్తుల విలువ కేవలం రూ. 15 లక్షలకు కొద్దిగా ఎక్కువ ఉంది. గత అసెంబ్లీ ఎన్నికలలో పోటీ చేసి గెలిచిన తర్వాత ముఖ్యమంత్రులుగా బాధ్యతలు చేపట్టిన అభ్యర్థులు దాఖలు చేసిన అఫిడవిట్లలో పొందుపరిచిన ఆస్తుల వివరాల ఆధారంగా అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్) రూపొందించిన నివేదిక ద్వారా ఈ వివరాలు వెల్లడయ్యాయి. దేశంలోని 31 ముఖ్యమంత్రుల మొత్తం ఆస్తుల విలువ రూ. 1,630 కోట్లని నివేదిక పేర్కొంది. తనకు రూ. 15 లక్షల విలువైన ఆస్తులు ఉన్నట్లు మమతా బెనర్జీ ప్రకటించగా జమ్ము కశ్మీరు ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఆస్తులు రూ. 55 లక్షలని ఏడీఆర్ తెలిపింది. ఆస్తుల విషయంలో కింది నుంచి మూడవ స్థానంలో కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఉన్నారు. ఆయనకు రూ. 1 కోటి మేర ఆస్తులు ఉన్నాయి. 2021 సెప్టెంబర్ 30న జరిగిన భోవానీపొర అసెంబ్లీ స్థానానికి జరిగిన ఉప ఎన్నిక సందర్భంగా మమతా బెనర్జీ అఫిడవిట్ దాఖలు చేశారు. 2020-21లో దాఖలు చేసిన ఆదాయం పన్ను రిటర్న్స్‌లో ఆమె రూ. 15.4 లక్షల ఆస్తులు చూపించారు. 2016 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మమత ఆస్తులు రూ. 30.4 లక్షలు ఉన్నాయి. తన వద్ద రూ. 69,255 నగదు ఉన్నట్లు ఆమె తెలిపారు. ఆమె బ్యాంక్ బ్యాలెన్స్ రూ. 13.5 లక్షలు ఉండగా అందులోనే ఆమె ఎన్నికల ఖర్చులను రూ. 1.5 లక్షలు చూపారు. తన వద్ద రూ. 43,837 విలువచేసే 9 గ్రాముల బంగారం ఉన్నట్లు మమత తెలిపారు. తన పేరిట స్థలం కాని, నివాస గృహం కాని ఉన్నట్లు ఆమె తన అఫిడవిట్‌లో పేర్కొనలేదు.



5.5 కోట్ల వీసాల నిశిత పరిశీలన

ట్రంప్ సర్కారు వెల్లడి

న్యూఢిల్లీ: అమెరికా ప్రభుత్వం వలస విధానాలను మరింత కఠినతరం చేస్తూ కీలక ప్రకటన చేసింది. ప్రస్తుతం చెల్లుబాటులో ఉన్న దాదాపు 5.5 కోట్ల మంది విదేశీయుల వీసాలను నిశితంగా సమీక్షిస్తున్నట్టు అమెరికా విదేశాంగ శాఖ వెల్లడించింది. ఈ సమీక్షలో ఎవరైనా వీసా నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే, తక్షణమే వారి వీసాను రద్దు చేయడమే కాకుండా, వారిని అమెరికా నుంచి బహిష్కరించే ప్రక్రియను ప్రారంభిస్తామని స్పష్టం చేసింది. ఈ 'నిరంతర పరిశీలన'లో భాగంగా వీసాదారుల ప్రవర్తనపై అధికారులు నిఘా పెడతారు. ముఖ్యంగా వీసా జారీ అయిన తర్వాత వారి ప్రవర్తనలో ఏమైనా మార్పులు వచ్చాయా? వారు నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారా? అని తనిఖీ చేస్తారు. వీసా గడువు ముగిసినా దేశంలోనే ఉండిపోవడం, నేర కార్యకలాపాలకు పాల్పడటం, ఉగ్రవాద కార్యకలాపాల్లో పాల్గొనడం లేదా ఉగ్రవాద సంస్థలకు మద్దతు ఇచ్చినట్టు తేలితే వీసాలు ఏ క్షణమైనా రద్దు అవుతాయని విదేశాంగ శాఖ తెలిపింది. ఈ కొత్త నిబంధన కొత్తగా వీసా కోసం దరఖాస్తు చేసుకునే వారితో పాటు, ఇప్పటికే వీసా కలిగి ఉన్న అందరికీ వర్తిస్తుంది. .

విదేశీ లారీ డ్రైవర్లకు వర్కర్ వీసాల జారీ నిలిపివేత

విదేశాలకు చెందిన లారీ డ్రైవర్లకు వీసాల జారీని అమెరికా గురువారం నుంచి హఠాత్తుగా నిలిపేసింది. అమెరికాలో చట్టవిరుద్ధంగా ఉంటున్న భారతీయ డ్రైవర్ నడిపిన లారీ ప్రమాదానికి గురికావడంతో దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అడ్మినిస్ట్రేషన్ ఈ నిర్ణయం తీసుకుంది. అమెరికా సెక్రటరీ ఆఫ్ స్టేట్ మార్కో రుబియో కమర్షియల్ ట్రక్ డ్రైవర్స్‌కు వర్కర్ వీసాల జారీని తక్షణమే నిలిపేస్తున్నామని ఎక్స్‌లో చెప్పారు. భారీ ట్రాక్టర్-ట్రైలర్ ట్రక్స్‌ను విదేశీ డ్రైవర్లు నడపటం వల్ల అమెరికన్ ట్రక్కర్ల జీవనోపాధి దెబ్బతింటున్నదని తెలిపారు.



మళ్లీ భారత్‌లోకి టిక్ టాక్?

అందుబాటులోకి చైనా కంపెనీ వెబ్‌సైట్

న్యూఢిల్లీ: భారతీయ, చైనా సైనిక బలగాల మధ్య గల్వాన్ ఘర్షణ తర్వాత భద్రతా కారణాలు చూపుతూ భారత ప్రభుత్వం 2020లో నిషేధించిన చైనాకు చెందిన బైట్‌డ్యాన్స్ యాప్ టిక్ టాక్ ఐదేళ్ల తర్వాత మళ్లీ భారత్‌లోకి ప్రవేశించే అవకాశం కనపడుతోంది. టిక్ టాక్‌తోపాటు వందలాది చైనీస్ గేమింగ్ యాప్‌లను భారత ప్రభుత్వం నిషేధించింది. ఆ తర్వాత కూడా భారత్‌లో ఏదోవిధంగా కొనసాగేందుకు శాయశక్తులా ప్రయత్నించిన టిక్ టాక్ కంపెనీ ఎట్టకేలకు 2023 ఫిబ్రవరి 28న మూతపడింది. అప్పటి నుంచి భారత్‌లో అందుబాటులో లేని టిక్ టాక్ వెబ్‌సైట్ హఠాత్తుగా మళ్లీ జీవం పోసుకుంది. త్వరలోనే దేశంలో షార్ట్ వీడియో షేరింగ్ ప్లాట్‌ఫామ్‌ని కంపెనీ తిరిగి ప్రారంభించనున్నట్లు సూచనలు అందుతున్నాయి. ఆన్‌లైన్ షాపింగ్ ప్లాట్‌ఫామ్ అలీఎక్స్‌ప్రెస్, విమెన్ క్లోథింగ్ ఈకామర్స్ ప్లాట్‌ఫామ్ షీన్ కూడా రీఎంట్రీ ఇవ్వనున్నట్టు తెలుస్తున్నది. ఈ కంపెనీల వెబ్‌సైట్లు భారత్‌లో తిరిగి ప్రారంభమయ్యాయి. చైనా విదేశాంగ మంత్రి భారత్‌ను సందర్శించి వెళ్లిన కొన్ని రోజులకే ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. భారతీయ వస్తువులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 50 శాతం సుంకాలు విధించినప్పటి నుంచి భారత్, చైనా మధ్య సంబంధాలలో పురోగతి కనిపిస్తోంది. భారత్‌కు ఎరువులు, అరుదైన ఖనిజాలు, సొరంగాలను తవ్వే మిషన్ల ఎగుమతులపై నిషేధాన్ని ఎత్తివేస్తున్నట్లు చైనా గురువారం ప్రకటించింది. టియాంజిన్‌లో ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 1 వరకు జరిగే షాంఘై సహకార సంస్థల(ఎస్‌సీఓ) సదస్సుకు ప్రధాని మోదీ హాజరయ్యే అవకాశం ఉంది. ఈ సందర్భంగా చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో ఆయన ద్వైపాక్షిక చర్చలు జరిపే అవకాశం ఉంది. కాగా, టిక్ టాక్‌ను తిరిగి దేశంలో అనుమతించే విషయమై అధికారికంగా ఇప్పటివరకు ఎటువంటి ప్రకటన వెలువడలేదు.

20 ఏండ్లు పైబడిన వాహనాల

రిజిస్ట్రేషన్ రెన్యువల్ ఫీజు పెంపు

న్యూఢిల్లీ: దేశంలో 20 ఏండ్లు పైబడిన వాహనాల రిజిస్ట్రేషన్ రెన్యువల్ ఫీజును పెంచుతున్నట్టు కేంద్ర రవాణా శాఖ శుక్రవారం ప్రకటించింది. 20 ఏండ్లు పైబడిన వాహనాలు వినియోగించకుండా ప్రజల్ని నిరుత్సాహపర్చడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఒక ప్రకటనలో తెలిపింది. 20 ఏండ్లు దాటిన లైట్ మోటార్ వెహికల్స్ (ఎల్‌ఎంవీ) రెన్యువల్ ఫీజును రూ.5 వేల నుంచి 10 వేలకు, 20 ఏండ్ల పైబడిన మోటారు సైకిళ్ల రెన్యువల్ ఫీజును రూ.వెయ్యి నుంచి 2 వేలకు, త్రిచక్ర, నాలుగు చక్రాల వాహనాలకు రూ.3,500 నుంచి 5 వేలకు పెంచుతున్నట్టు వివరించింది.

నివాస రుజువుగా ఆధార్ చెల్లుతుంది

- బీహార్ ఓటరు జాబితాపై ఈసీకి సుప్రీం ఆదేశం
- పార్టీల వైఖరిపై తీవ్ర ఆక్షేపణ

న్యూఢిల్లీ, ఆగస్టు 22: అసెంబ్లీ ఎన్నికలకు ముందు తమ పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించడాన్ని సవాలు చేస్తున్న బీహార్ ఓటర్లు తమ నివాస రుజువుగా ఆధార్‌ని సమర్పించవచ్చని సుప్రీంకోర్టు శుక్రవారం తెలిపింది. నివాస రుజువు కోసం ఎన్నికల కమిషన్ కోరుతున్న 11 ధ్రువపత్రాలలో ఆధార్‌ని కూడా చేర్చాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. మరణించిన వారు, డూప్లికేట్ ఓటర్లను మినహాయించిన తర్వాత తొలగింపునకు గురైన మిగిలిన దాదాపు 35 లక్షల మంది ఓటర్లు త్వరితంగా తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని ధర్మాసనం సూచించింది. సెప్టెంబర్ 1 నాటికి పత్రాల దాఖలు పూర్తయ్యేలా చూడాలని ఈసీని కోర్టు ఆదేశించింది. తమ ఓటు హక్కు కోల్పోయిన లక్షలాదిమంది ఓటర్లకు సాయపడడంలో రాజకీయ పార్టీలు ఎందుకు ముందుకు రాలేదని ధర్మాసనం ప్రశ్నించింది. 'రాజకీయ పార్టీలు ఏం చేస్తున్నాయో మాకు ఆశ్చర్యంగా ఉంది. మీ బీఎల్‌ఏలు ఏం చేస్తున్నారు? ఓటర్లకు రాజకీయ పార్టీలు సాయపడాలి కదా" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

కుక్కలకు వీధుల్లో ఆహారం పెట్టొద్దు

స్టెరిలైజ్ చేసి తెచ్చిన చోటనే విడిచిపెట్టాలి

రేబిస్ కుక్కలు మాత్రం షెల్టర్ హోంలకు తరలింపు ▪ వీధి కుక్కలపై తీర్పును సవరించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, ఆగస్టు 22: ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లోని వీధి కుక్కల తరలింపుపై తన ఇదివరకటి తీర్పును సుప్రీంకోర్టు శుక్రవారం సవరిస్తూ తాజా ఉత్తర్వులు జారీచేసింది. స్టెరిలైజేషన్, ఇమ్యూనైజేషన్ తర్వాత వీధి కుక్కలను వాటిని తెచ్చిన వీధులలోనే విడిచిపెట్టాలని మున్సిపల్ అధికారులను జస్టిస్ విక్రమ్ నాథ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం ఆదేశించింది. అయితే రేబిస్ సోకిన లేదా ఉన్మాద లక్షణాలు ప్రదర్శిస్తున్న వీధి కుక్కలను మాత్రం షెల్టర్ హోంలోనే ఉంచాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కుక్కలకు వీధుల్లో ప్రజలు ఆహారం పెట్టడాన్ని అనుమతించబోమని, వీధికుక్కల కోసం ఆయా ప్రాంతాలలో ఆహార పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని తెలిపింది. మున్సిపల్ వార్డులలో వీధి కుక్కల కోసం ఆహార కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్(ఎంసీడీ)ని ధర్మాసనం ఆదేశించింది. వీధి కుక్కల దత్తత కోసం జంతు ప్రేమికులు ఎంసీడీకి దరఖాస్తు చేసుకోవచ్చని సుప్రీం కోర్టు తెలిపింది. వీధి కుక్కల బెడదకు సంబంధించిన పరిశీలనాంశాల పరిధిని విస్తరించిన సుప్రీంకోర్టు ఈ సమస్యను ఎదుర్కొనేందుకు ఓ జాతీయ విధానాన్ని రూపొందించడంపై తమ స్పందనను తెలియచేయవలసిందిగా అన్ని రాష్ర్టాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన పశు సంవర్ధక శాఖల కార్యదర్శులకు నోటీసులు జారీచేసింది. వీధి కుక్కలకు సంబంధించి రాష్ట్రాల హైకోర్టులలో ఏవైనా పిటిషన్లు పెండింగ్‌లో ఉంటే వెంటనే వాటిని సుప్రీంకోర్టుకు బదిలీ చేయాలని కోరాలని రిజిస్ట్రీని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది.



ప్రతి కుక్కకూ ఓ రోజొస్తుంది.. సుప్రీం తీర్పుపై పెటా హర్షం

ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లోని వీధి కుక్కలను షెల్టర్ హోంలకు తరలించాలని ఆదేశిస్తూ ఇదివరకు జారీచేసిన ఉత్తర్వులను సుప్రీంకోర్టు సవరించినందుకు సుప్రీంకోర్టుకు దేశంలోని జంతు హక్కుల పరిరక్షణ సంస్థ పెటా(పీపుల్స్ ఫర్ ది ఎథికల్ ట్రీట్‌మెంట్ ఫర్ యానిమల్స్) ధన్యవాదాలు తెలియచేస్తూ "ప్రతి కుక్కకు ఓ రోజొస్తుంది" అంటూ ప్రకటించింది. "టీ స్టాల్ దగ్గరున్న షేరూ, గుడి మెట్ల మీదున్న రాణి, సొసైటీ మైదానంలో ఉన్న మోతీదే ఈరోజు" అని దేశంలో జంతు హక్కుల కోసం పోరాడుతున్న పెటా ఎక్స్ వేదికగా శుక్రవారం వ్యాఖ్యానించింది. వీధి కుక్కల కోసం ప్రజలు శుభ్రమైన పాత్రలలో మంచినీరు అందచేయాలని, ప్రతి వీధిలో కుక్కలకు ఆహారం లభించే విధంగా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరింది.

భర్త నిరుద్యోగాన్ని ఎగతాళి చేయడం క్రూరత్వమే

విడాకులు మంజూరు చేసిన ఛత్తీస్‌గఢ్ హైకోర్టు

బిలాస్‌పూర్: భర్త నిరుద్యోగిగా ఉండటాన్ని భార్య ఎత్తిపొడవటం, ఎగతాళి చేయడం, ఆర్థిక కష్టాల్లో ఉన్నపుడు అసమంజసమైన కోరికలు కోరడం మానసిక క్రూరత్వమేనని ఛత్తీస్‌గఢ్ హైకోర్టు తెలిపింది. ఈ కారణాల రీత్యా భర్తకు విడాకులు మంజూరు చేసింది. ఆయనకు విడాకులు మంజూరు చేసేందుకు తిరస్కరించిన కుటుంబ న్యాయస్థానం తీర్పును రద్దు చేసింది. భార్య పీహెచ్‌డీ పట్టా పొందిన తర్వాత, స్కూలు ప్రిన్సిపాల్‌గా అధిక వేతనం గల ఉద్యోగాన్ని పొందిన అనంతరం, తన భర్త పట్ల ఆమె ప్రవర్తన మారిపోయినట్లు రుజువైందని హైకోర్టు తెలిపింది. ఆయన పట్ల ఆమెకు గౌరవం లేకుండా పోయిందని, కొవిడ్-19 మహమ్మారి సమయంలో నిరుద్యోగిగా ఉన్నందుకు ఆయనను తరచూ ఎగతాళి చేస్తూ ఉండేదని పేర్కొంది. అల్పమైన విషయాలపై సైతం తరచూ జగడాలకు దిగుతుండేదని పేర్కొంది. ఇటువంటి చర్యలు చట్టప్రకారం మానసిక క్రూరత్వమేనని స్పష్టం చేసింది.

పార్లమెంట్ వద్ద భద్రతా వైఫల్యం

గోడ దూకి లోపలికి చొరబడిన ఓ వ్యక్తి

న్యూఢిల్లీ: పార్లమెంట్ వద్ద భద్రతా వైఫల్యం చోటుచేసుకుంది. ఓ వ్యక్తి శుక్రవారం ఉదయం ఓ చెట్టు ఎక్కి గోడ దూకి లోపలికి ప్రవేశించాడు. ఉదయం 6.30 గంటల సమయంలో జరిగిన ఈ ఘటన హై-ప్రొఫైల్ కాంప్లెక్స్‌లో భద్రతా ఏర్పాట్లపై తీవ్రమైన ప్రశ్నలు లేవనెత్తింది. అధికారుల కథనం ప్రకారం చొరబాటుదారుడు రైల్ భవన్ వైపు నుంచి గోడ దూకి కొత్త పార్లమెంట్ భవనంలోని గరుడ ద్వారం వద్దకు చేరుకున్నాడు. భద్రతా సిబ్బంది వెంటనే అతడిని గమనించి అదుపులోనికి తీసుకున్నారు. అతడి గుర్తింపును, చొరబాటు వెనుక ఉన్న ఉద్దేశాన్ని తెలుసుకోవడానికి అతడిని కస్టడీలోకి తీసుకొని విచారిస్తున్నారు.

ఆన్‌లైన్ గేమ్స్ నిషేధ బిల్లుకు

రాష్ట్రపతి ఆమోదం

న్యూఢిల్లీ, ఆగస్టు 22: ఆన్‌లైన్ గేమ్స్‌ని నిషేధిస్తూ పార్లమెంట్ ఆమోదించిన బిల్లుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుక్రవారం ఆమోదం తెలిపారు. దీంతో ఈ బిల్లు చట్టరూపంలోకి వచ్చింది. ఆన్‌లైన్ మనీ గేమింగ్ యాప్‌లన్నిటినీ ఈ చట్టం నిషేధించింది. ఈ మనీ గేమింగ్‌లను ప్రమోట్ చేసిన వారికి మూడు సంవత్సరాల జైలు శిక్ష, రూ. 1 కోటి వరకు జరిమానా విధించడానికి చట్టం అవకాశం కల్పిస్తోంది. అటువంటి ప్లాట్‌ఫారాల తరఫున ప్రచారం చేసిన వారికి సైతం 2 ఏళ్ల వరకు జైలు శిక్ష, రూ. 50 లక్షల వరకు జరిమానా విధించవచ్చు. ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు, 2025ని రాజ్యసభ గురువారం 26 నిమిషాల్లో ఆమోదించగా అంతకుముందు రోజు లోక్‌సభ కేవలం 7 నిమిషాలలో ఎటువంటి చర్చ లేకుండా ఆమోదించింది.

వైర్ జర్నలిస్టులపై తొందరపాటు చర్యలొద్దు

రెండో ఎఫ్ఐఆర్‌పై అస్సాం పోలీసులకు సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ, ఆగస్టు 22: ఓ వార్తా కథనంపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌కి సంబంధించి ది వైర్ న్యూస్ పోర్టల్‌లో పనిచేస్తున్న కన్సల్టింగ్ ఎడిటర్ తోసహా సీనియర్ జర్నలిస్టు సిద్ధార్థ వరదరాజన్, ఇతర జర్నలిస్టులపై ఎటువంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని అస్సాం పోలీసులను సుప్రీంకోర్టు శుక్రవారం ఆదేశించింది. అత్యున్నత న్యాయస్థానం గతంలో జారీచేసిన ఉత్తర్వులను అస్సాం పోలీసులు ఉల్లంఘిస్తున్నారంటూ జర్నలిస్టుల తరఫున సీనియర్ న్యాయవాది నిత్య రామకృష్ణన్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చి ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు.వారిని అరెస్టు చేస్తారన్న అనుమానాలు ఉన్నట్లు తెలిపారు.

'బీజేపీ కార్యకర్త ఫిర్యాదుతో ఇండిపెండెంట్

జర్నలిస్టులపై ఎఫ్ఐఆరా?'

హైదరాబాద్, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ): ఇండిపెండెంట్ జర్నలిస్టులు సిద్ధార్థ వరదరాజన్, కరణ్ థాపర్ (ది వైర్), అభిసార్ శర్మలను వేధించే ఉద్దేశంతో గువాహటిలో బీజేపీ కార్యకర్త ఫిర్యాదుపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నట్లు సీపీఐ జాతీయ కార్యదర్శి డి రాజా తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటనను విడుదల చేశారు. పాలక పక్షాలు, వాటి విధానాల పట్ల విమర్శనాత్మకంగా వ్యవహరించే గొంతులను నొక్కేందుకు ప్రజాస్వామ్య చట్ట పుస్తకాలలో స్థానం లేని నిరంకుశ నిబంధనలను ప్రయోగించడం అస్సాం వంటి బీజేపీ పాలిత రాష్ట్రాలలో ప్రమాదకరమైన విధానంగా మారిందని ఆయన విమర్శించారు.



మా షరతులకు ఒప్పుకోకపోతే

నరక ద్వారాలు తెరుచుకుంటాయ్

హమాస్‌కు ఇజ్రాయెల్ హెచ్చరిక

టెల్ అవీవ్, ఆగస్టు 22: హమాస్ కనుక తమ షరతులకు అంగీకరించకపోతే వారికి నరకం తప్పదని, గాజా.. మరో రఫా, బీట్ హనౌన్‌గా మారుతుందని ఇజ్రాయెల్ రక్షణ శాఖ మంత్రి కట్జ్ శుక్రవారం హెచ్చరించారు. గాజాని స్వాధీనం చేసుకోవడానికి సైన్యానికి అధికారిక అనుమతి ఇస్తానని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ప్రకటన చేయడంతో.. ముట్టడించిన గాజా నగరంపై ఇజ్రాయెల్ మిలిటరీ దళాలు భారీ సైనిక దాడికి సిద్ధమవుతున్న క్రమంలో ఆయనీ హెచ్చరిక చేశారు. హమాస్ ఆయుధాలు విడిచిపెట్టకపోతే గాజాను నాశనం చేస్తామని హెచ్చరిస్తూ.. హమాస్ తమ దారికి రాకపోతే గాజా విధ్వంసం తప్పదని, వారికి నరక దారులు తెరుచుకుంటాయని స్పష్టంచేశారు.

గాజాలో తీవ్ర కరువు

- ఐక్యరాజ్యసమితి ప్రకటన
- పశ్చిమాసియాలో ఇదే తొలిసారి

రోమ్: గాజాలో కరువు నెలకొన్నట్లు ఐక్య రాజ్య సమితి శుక్రవారం అధికారికంగా ప్రకటించింది. పశ్చిమాసియాలో ఇటువంటి పరిస్థితి రావడం ఇదే తొలిసారి. ఇక్కడ 5 లక్షల మందికిపైగా ఘోరమైన ఆకలితో బాధపడుతున్నట్లు ఐరాస నిపుణులు చెప్పారు. యూఎన్ ఎయిడ్ చీఫ్ టామ్ ఫ్లెచర్ మాట్లాడుతూ, ఈ కరువు పూర్తిగా నిరోధించగలిగినదేనని చెప్పారు. ఇజ్రాయెల్ పద్ధతి ప్రకారం అడ్డంకులు సృష్టిస్తున్నందు వల్లే పాలస్తీనా భూభాగంలోకి ఆహారం వెళ్లడం లేదన్నారు. దీనిపై ఇజ్రాయెల్ విదేశాంగ శాఖ స్పందిస్తూ, గాజాలో కరువు లేదని చెప్పింది. రోమ్ నుంచి పని చేస్తున్న ఐపీసీ ప్యానెల్ విడుదల చేసిన నివేదిక హమాస్ ఉగ్రవాద సంస్థ చెప్పిన అబద్ధాల ఆధారంగా తయారు చేసినదని దుయ్యబట్టింది.

కేరళలో బీజేపీ ఓటు చోరీ!

ఒప్పుకున్న పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

తిరువనంతపురం, ఆగస్టు 22: ఎన్నికలలో తాము గెలవాలనుకున్న స్థానాలలో ఓటర్ల జాబితాలో ఓటర్లను కలుపుతామని కేరళ బీజేపీ ఉపాధ్యక్షుడు బీ గోపాలకృష్ణన్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. తప్పుడు చిరునామాలలో ఓటర్ల పేర్లు చేర్చినట్లు వస్తున్న ఆరోపణలను ఆయన ఖండించారు. తాము గెలవడానికి అవకాశం ఉన్నట్లు భావిస్తున్న స్థానాలలోనే ఓటర్ల జాబితాలో ఓటర్లను కలుపుతామని శుక్రవారం నాడిక్కడ విలేకరులతో మాట్లాడుతూ ఆయన వెల్లడించారు. గత లోక్‌సభ ఎన్నికల సందర్భంగా కేంద్ర మంత్రి సురేష్ గోపీ గెలుపు కోసం త్రిసూర్ లోక్‌సభ స్థానంలోని ఓటర్ల జాబితాలో అక్రమంగా ఓటర్లను చేర్చినట్లు వచ్చిన ఆరోపణలపై స్పందిస్తూ ఓటర్ల జాబితాకు భారీ స్థాయిలో ఓటర్లను తాము జతచేస్తామని చెప్పారు. గెలుపు కోసం జమ్ము కశ్మీరు నుంచి కూడా ఓటర్లను తెచ్చి ఇక్కడి ఓటర్ల జాబితాలో కలుపుతామని ఆయన స్పష్టం చేశారు. ఓ ఏడాదిపాటు వారిని నియోజకవర్గంలోనే ఉంచి వారి పేర్లను ఓటర్ల జాబితాలో కలుపుతామని ఆయన వెల్లడించారు. భవిష్యత్తులో కూడా తామే గెలుస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తాను గెలుపొందాలని కోరుకున్న కశ్మీరీ ఓటరు ఇక్కడకు వచ్చి పార్టీ కోసం పనిచేసి ఏడాది పాటు నియోజకవర్గంలోనే ఉంటే తప్పేమిటని ఆయన ఎదురు ప్రశ్నించారు.

డీకే నోట సంఘ్ పాట!

పార్టీ మార్పునకు సంకేతమా?

బెంగళూరు ఆగస్టు 22: కర్ణాటక అసెంబ్లీలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్‌ఎస్‌ఎస్) ప్రార్థనా గీతాన్ని ఆలపించి కాంగ్రెస్ పార్టీకి చెందిన ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ అలజడి సృష్టించారు. బీజేపీ సభ్యులతో తీవ్ర వాగ్వాదం జరుగుతున్న సందర్భంగా చోటుచేసుకున్న ఈ ఉదంతం రాష్ట్రంలో భవిష్యత్ పరిణామాలకు సూచనగా రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు. జూన్ 4న బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వెలుపల తొక్కిసలాట జరిగి 11 మంది మరణించిన ఘటనపై బీజేపీ సభ్యుడు ఆర్ అశోక్ రాష్ట్ర ప్రభుత్వాన్ని నిందించారు. దీనిపై శివకుమార్ స్పందిస్తూ బీజేపీ వ్యూహాల గురించి తనకు చాలా బాగా తెలుసునంటూ వ్యాఖ్యానిస్తూ ఆర్‌ఎస్‌ఎస్ ప్రార్థనా గీతం "నమస్తే సదా వత్సలే మాతృభూమే"లోని రెండు పంక్తులు చదివారు. రాజకీయ పునరేకీకరణను డీకే సూచిస్తున్నారా అని నెటిజన్లు ఊహాగానాలు చేస్తున్నారు. ఇది ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు హెచ్చరికగా కొందరు భావిస్తున్నారు.

ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీఏకు

క్రాస్ ఓటింగ్ భయం

- తెలంగాణ, ఏపీ ఎంపీలపై బీజేపీకి అనుమానం
- శివసేన యూబీటీ నేత సంజయ్ రౌత్ ఆరోపణ

ముంబై, ఆగస్టు 22: వచ్చే నెలలో జరిగే ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో బీజేపీకి క్రాస్ ఓటింగ్ భయం పట్టుకుందని శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్ ఆరోపించారు. ఎన్డీఏ అభ్యర్థికి మద్దతు ఇవ్వాలంటూ తమ కూటమి పార్టీలకు బీజేపీ విజ్ఞప్తి చేస్తున్నప్పటికీ కొందరు నేతల్లో ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎంపీల్లో అశాంతి నెలకొని ఉండటంతో ఈ పరిస్థితి ఏర్పడిందని ఆయన తెలిపారు. ఈ రెండు రాష్ర్టాల ఎంపీలు విపక్ష అభ్యర్థి సుదర్శన్ రెడ్డికి మద్దతు తెలపవచ్చునని ఎన్డీఏ భయపడుతున్నదన్నారు. పేపర్‌పై ఎన్డీఏ పటిష్ఠంగా ఉన్నట్టు కన్పిస్తున్నా, వారిలో ఆత్మ విశ్వాసం లేదని అన్నారు. ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో మద్దతు ఇవ్వాలని కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఎన్సీపీ (శరద్ పవార్), శివసేన (యూబీటీ)లను కోరడాన్ని ఆయన ప్రస్తావిస్తూ ఏ పార్టీలనైతే చీల్చారో ఇప్పుడు వాటినే బీజేపీ మద్దతు కోరుతున్నదని విమర్శించారు.

నక్సల్స్‌కు జస్టిస్ సుదర్శన్‌రెడ్డి మద్దతు

విపక్షాల ఉప రాష్ట్రపతి అభ్యర్థిపై అమిత్‌షా ఆరోపణ



న్యూఢిల్లీ, ఆగస్టు 22: విపక్షాల తరఫున ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో పోటీచేస్తున్న జస్టిస్ బీ సుదర్శన్‌రెడ్డి కారణంగా దేశంలో నక్సలిజం బలపడిందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ఆరోపించారు. సల్వాజుడుం కేసులో జస్టిస్ సుదర్శన్‌రెడ్డి తీర్పు ఇవ్వకపోయి ఉంటే 2020 కన్నా ముందుగానే దేశంలో వామపక్ష తీవ్రవాదాన్ని అంతమొందించి ఉండేవారమని పేర్కొన్నారు. మలయాళం పత్రిక మనోరమ న్యూస్ కాన్‌క్లేవ్‌ను ప్రారంభించిన సందర్భంగా అమిత్‌షా మాట్లాడారు. ఉప రాష్ట్రపతి పదవికి తమ అభ్యర్థిగా సుదర్శన్‌రెడ్డిని ఎంపిక చేసుకోవడంతోనే కేరళలో కాంగ్రెస్ పార్టీ విజయావకాశాలు మరింత దిగజారాయని అన్నారు. 'సుదర్శన్‌రెడ్డి అనే వ్యక్తి నక్సలిజానికి సాయం చేశారు. ఆయన సల్వాజుడుం తీర్పునిచ్చారు. సల్వా జుడుం తీర్పు ఇవ్వకపోయి ఉంటే నక్సల్స్ ఉగ్రవాదం 2020నాటికే అంతమై ఉండేది. నక్సల్స్ సిద్ధాంతాలతో స్ఫూర్తి పొందినందునే ఆయన సల్వాజుడుం తీర్పునిచ్చారు' అని అమిత్‌షా వ్యాఖ్యానించారు. మావోయిస్టులపై పోరాటంలో భాగంగా గిరిజన యువతను కోయ కమాండోలు, సల్వా జుడుం పేరిట ప్రత్యేక పోలీసు అధికారులుగా నియమించడాన్ని సుప్రీంకోర్టు 2011లో రద్దు చేసింది. ఇది చట్టవ్యతిరేకం, రాజ్యాంగ విరుద్ధం అని నాడు సుప్రీంకోర్టు జడ్జిగా ఉన్న సుదర్శన్‌రెడ్డి తీర్పు చెప్పారు. వామపక్షాల ఒత్తిడితోనే కాంగ్రెస్ పార్టీ నక్సలిజాన్ని ప్రోత్సహించే వ్యక్తిని తమ అభ్యర్థిగా నిలబెట్టిందని షా ఆరోపించారు.

ఉప రాష్ట్రపతి బరిలో ఆ ఇద్దరే

మిగిలిన 44 మంది దరఖాస్తుల తిరస్కరణ

న్యూఢిల్లీ, ఆగస్టు 22: వచ్చే నెల 9న జరిగే ఉప రాష్ట్రపతి ఎన్నికకు సంబంధించి నామినేషన్ల పరిశీలన పూర్తయ్యింది. 46 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా, ఇద్దరు తప్ప మిగతా వారి దరఖాస్తులను రిటర్నింగ్ అధికారి తిరస్కరించినట్టు శుక్రవారం అధికారులు తెలిపారు. వారంతా మొత్తం 68 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల పరిశీలన తర్వాత ఎన్డీఏ అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్, విపక్ష కూటమి అభ్యర్థి జస్టిస్ బీ సుదర్శన్ రెడ్డి మాత్రమే రంగంలో మిగిలారు. వీరిద్దరూ తలో నాలుగు సెట్ల నామినేషన్ పేపర్లు దాఖలు చేయగా, అన్నీ సక్రమంగా ఉండటంతో అధికారులు ఆమోదించారు.



భారతీయ అంతరిక్ష కేంద్రం నమూనా ఆవిష్కరణ

న్యూఢిల్లీ : భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) శుక్రవారం భారతీయ అంతరిక్ష కేంద్రం (బీఏఎస్) మాడ్యూల్‌ను ఆవిష్కరించింది. ఢిల్లీలోని భారత మండపంలో శుక్రవారం ప్రారంభమైన రెండు రోజుల జాతీయ రోదసీ దినోత్సవాల్లో దీనిని ప్రదర్శించింది. మన దేశంలోనే తయారు చేసిన అంతరిక్ష స్టేషన్ బీఏఎస్ మొదటి మాడ్యూల్‌ను 2028నాటికి ప్రారంభించేందుకు భారత దేశం ప్రయత్నిస్తున్నది. 2035 నాటికి ఐదు బీఏఎస్ మాడ్యూల్స్‌ను అందుబాటులోకి తేవాలని ప్రయత్నిస్తున్నది. భూమి ఉపరితలం నుంచి 450 కి.మీ. ఎత్తులో భూ దిగువ కక్ష్యలో దీనిని ఉంచుతారు. ప్రస్తుతం ఉన్న ఆర్బిటాల్ ల్యాబొరేటరీలు ఏమిటంటే, ఐదు అంతరిక్ష సంస్థలు నిర్వహిస్తున్న ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్, చైనాకు చెందిన తియాంగాంగ్ స్పేస్ స్టేషన్.

ఏఐ హైప్ చల్లబడుతున్నదా?

- హఠాత్తుగా ఏఐ ఇంజినీర్లను తొలగిస్తున్న మెటా
- నిలిచిపోతున్న అత్యధిక పైలట్ ప్రాజెక్టులు



న్యూఢిల్లీ : కృత్రిమ మేధ (ఏఐ) గురించి జరుగుతున్న భారీ ప్రచార ఆర్భాటం నెమ్మదిగా చల్లబడుతున్నట్లు కనిపిస్తున్నది. ఏఐ ఇంజినీర్లు, పరిశోధకులు ఉద్యోగాలను కోల్పోయే పరిస్థితులు వస్తున్నాయి. నిరుడు ఏఐ టాలెంట్‌ను భారీ వేతనాలిచ్చి నియమించుకున్న మెటా తాజాగా విస్తరణకు బదులు కుదింపు గురించి మాట్లాడుతుండటమే దీనికి నిదర్శనం. కొద్ది రోజుల క్రితం ఓపెన్‌ఏఐ తన జీపీటీ-5ను ఎలాంటి ఆర్భాటం లేకుండా విడుదల చేసింది. అదేవిధంగా మరికొన్ని టెక్ కంపెనీలు తమ ఏఐ ఆకాంక్షలను కుదించుకునే అవకాశాలు ఉన్నాయి. దీంతో ఏఐపై మోజు సన్నగిల్లుతున్నదా? అనే భావన కలుగుతున్నది. మెటా ఏఐ డివిజన్ చీఫ్ ఏఐ ఆఫీసర్ అలెగ్జాండర్ వాంగ్ రాసిన ఇంటర్నల్ నోట్‌లో, ఈ ఏఐ డివిజన్‌కు మెటా సూపర్‌ఇంటెలిజెన్స్ లాబ్స్ అని పేరు పెట్టినట్లు తెలిపారు. దీనిని నాలుగు బృందాలుగా విభజిస్తున్నట్లు చెప్పారు. అయితే, ఈ వివరణను ఉద్యోగులు నమ్మడం లేదు. కొందరు ఏఐ ఇంజినీర్లను తొలగించేందుకు లేదా సిబ్బందిని ఏఐ వర్క్‌ఫోర్స్‌లోనే అటు, ఇటు మార్చేందుకు మెటా పరిశీలిస్తున్నదని 'న్యూయార్క్ టైమ్స్'కథనం పేర్కొంది. కొందరు ఎగ్జిక్యూటివ్‌లు ఇప్పటికే తప్పుకున్నారు. దీంతో అస్థిరత్వ భావనకు మరింత ఆజ్యం తోడైంది. గతంలో ఆర్భాటంగా, భారీ ప్రచారం పొందిన - బ్లాక్‌చైన్ లేదా మెటావెర్స్ వంటి టెక్నాలజీల మాదిరిగానే ఏఐ కూడా ఆ బాటలోనే పయనిస్తున్నదా? అనే భావన కలుగుతున్నది.



అక్కడ పర్యాటకులకు ఉచిత విమానయానం

బ్యాంకాక్, ఆగస్టు 22: అంతర్జాతీయ పర్యాటకులకు థాయ్‌లాండ్ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. విదేశీ పర్యాటకులు ఆ దేశంలో ఉచితంగా విమాన ప్రయాణం చేసే ప్రణాళికను సిద్ధం చేసింది. అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించేందుకు దీనికోసం సుమారు 187 కోట్ల రూపాయలను తన బడ్జెట్‌లో కేటాయించే ప్రతిపాదనను మంత్రివర్గ ఆమోదం కోసం పంపింది. ఈ పథకం ద్వారా 2 లక్షల మందికి ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించనున్నట్టు 'ద నేషన్ థాయ్‌లాండ్' పత్రిక వెల్లడించింది. ఈ మేరకు ప్రభుత్వం ఆరు వైమానిక సంస్థలతో ఒప్పందం కుదుర్చుకోనుంది. ఈ పథకం కింద ప్రభుత్వం ఒక వైపు ప్రయాణానికి 1,750 బాట్‌లు (రూ.4,700) , రౌండ్ ది ట్రిప్పు ప్రయాణానికి 3,500 బాట్‌లు (రూ.9,400) సబ్సిడీగా ఇస్తుంది.



శ్రీలంక మాజీ అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘే అరెస్ట్

కొలంబో: ప్రభుత్వ నిధుల దుర్వినియోగం ఆరోపణలపై శ్రీలంక మాజీ అధ్యక్షుడు రణిల్ విక్రమ్‌సింఘేను శుక్రవారం అరెస్ట్ చేశారు. అధ్యక్షుడిగా ఉన్న సమయంలో 2023 సెప్టెంబర్‌లో ఆయన లండన్ పర్యటనలో ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేసినట్టు వచ్చిన ఆరోపణలపై ప్రశ్నించిన అనంతరం అధికారులు ఆయనను అరెస్ట్ చేశారు. ఆయనను కొలంబో ఫోర్ట్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరుస్తారు. బ్రిటిష్ యూనివర్సిటీలో తన భార్యను సత్కరించే కార్యక్రమానికి దేశ నిధులు దుర్వినియోగం చేసినట్టు ఆయనపై ఆరోపణలు నమోదయ్యాయి. ఆ కార్యక్రమానికి హాజరైన సింఘే ప్రయాణ, బాడీగార్డు ఖర్చులకు ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేశారని అధికారులు ఆరోపించారు. అయితే ఈ ఆరోపణలను రణిల్ ఖండించారు.



జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు సింగిల్‌విండో కార్యాలయం వద్ద యూరియా కోసం పాసు పుస్తకాలు, ఆధార్‌కార్డు జిరాక్స్ ప్రతులు క్యూలో ఉంచిన రైతులు



యూరియా కోసం రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం కొత్తపల్లి సింగిల్ విండో గోదాం వద్దకు భారీగా చేరుకున్న రైతులు

ఎవుసం వదిలి.. ఎరువు పోరు!

ఆగ్రో కేంద్రాల వద్దే అన్నదాతల తిండి, నిద్ర

పుట్టెడు ఆశలతో నాట్లు వేసుకున్న రైతులు.. యూరియా చల్లడం అనేది పంట సంరక్షణలో సర్వసాధారణమైన ఓ పనిగా సాగిపోతుంది. కానీ ఇప్పుడు యూరియా దక్కించుకోవడం చాలా పెద్ద శ్రమైపోయింది. నిత్యం పొలంబాట పట్టాల్సిన రైతులు... తెల్లవారుజాము నుంచే సొసైటీల వద్ద పడిగాపులు కాస్తున్నారు. బారులు తీరిన రైతుల్లో సగం మందికి కూడా బస్తాలు అందడంలేదు. పోలీసు బందోబస్తు మధ్య టోకెన్లు ఇచ్చి చేతులు దులుపుకుంటున్న అధికారులు స్టాక్ ఎప్పుడు వస్తుందో చెప్పలేకపోతున్నారు. అరకొరగా వస్తున్న స్టాక్ కూడా గంటలోనే ఖాళీ అయిపోతున్నది. దీంతో ఎప్పుడు వచ్చినా ఓ సంచీ దక్కించుకోవాలనే ఆరాటంతో అన్నదాతలు ఆరాటపడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు పరస్పరం చేసుకుంటున్న విమర్శలతో రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు రైతుల జీవితాలతో చెలగాటమాడుతున్నాయని నిప్పులుచెరిగారు. శుక్రవారం కూడా రైతులు సొసైటీల వద్ద నిద్రకాచి నిరీక్షించారు.



మహబూబాబాద్ పట్టణంలో సొసైటీ కార్యాలయం ఎదుట ఉన్న స్కూల్ ఆవరణలో భోజనం చేస్తున్న రైతులు



సిద్దిపేట జిల్లా దుబ్బాకలోని సహకార సంఘం వద్దకు శుక్రవారం ఉదయం 5గంటలకు యూరియా కోసం భారీగా తరలి వచ్చిన రైతులు



సిద్దిపేటలోని మిరిదొడ్డిలో యూరియా ఎక్కడ అని నిలదీస్తున్న రైతు నోరుమూయించే ప్రయత్నం చేస్తున్న పోలీసులు



వనపర్తి జిల్లా ఆత్మకూరు పీఏసీసీఎస్ వద్ద యూరియా కోసం పడిగాపులు కాసి ఆగ్రహంతో గన్నీ బ్యాగులకు నిప్పు పెట్టిన రైతులు



తెలుకుట్టి చికిత్సపొందుతూ యూరియా కోసం మహబూబాబాద్ బయ్యారం సహకార సంఘానికి వచ్చిన రైతు కమల



శుక్రవారం హన్మకొండ జిల్లాలో యూరియా కోసం కార్యాలయం చుట్టూ క్యూ కట్టిన రైతులు



కామారెడ్డి జిల్లా దోమకొండ వ్యవసాయ సహకార సంఘం ఎదుట వరుసలో పెట్టిన చెప్పులు



యూరియా కోసం శుక్రవారం తెల్లవారుజామున భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం నర్సాపురం సహకార సంఘం గోడౌన్ వద్దకు చేరుకున్న రైతులు



మహబూబ్‌నగర్‌లోని మోతీనగర్‌లో క్యూలైనులో నిలబడి అలసిపోయిన రైతులు తమ వంతు వచ్చే వరకు కూర్చొన్న దృశ్యం



సంగారెడ్డిలోని చౌటకూరులో ఎరువుల కోసం పాస్‌బుక్‌ను అధికారికి చూపిస్తున్న రైతులు



యూరియా ఇవ్వకపోవడంతో అలిసిపోయి మహబూబాబాద్ పట్టణంలో సొసైటీ కార్యాలయం ఎదుట ఉన్న స్కూల్ ఆవరణలో పడుకున్న రైతులు



ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఎరువుల దుకాణం ముందు యూరియా కోసం బారులు తీరిన రైతులు



మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి రైతువేదిక వద్ద యూరియా టోకెన్ల కోసం బారులుతీరిన రైతులు

స్పెషలిస్టు డాక్టర్ల భర్తీకి నోటిఫికేషన్

హైదరాబాద్, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలోని దవాఖానాల్లో 1,616 సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్టు డాక్టర్లు, ఆర్టీసీ హాస్పిటల్‌లో 7 స్పెషలిస్టు మెడికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. సెప్టెంబర్ 8 నుంచి 22 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నట్టు వెల్లడించింది. అభ్యర్థులు మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు(ఎంహెచ్‌ఎస్‌ఆర్బీ) వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించింది.

25 నుంచి టీఏఎఫ్‌ఆర్సీ పునర్విచారణ

హైదరాబాద్, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని ప్రొఫెషనల్ కాలేజీల్లో ట్యూషన్ ఫీజులపై ఈ నెల 25 నుంచి పునర్విచారణ ప్రారంభంకానున్నది. తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీజు రెగ్యులేటరీ కమిటీ (టీఏఎఫ్‌ఆర్సీ) విచారణ షెడ్యూల్ విడుదల చేసింది. 25న 20 కాలేజీలను విచారణకు ఆహ్వానించారు. మొత్తం 160 కాలేజీలను విచారించనుండగా, సెప్టెంబర్ 3 వరకు పునర్విచారించనున్నారు.

25నుంచి ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో ప్రవేశాలు

హైదరాబాద్, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ) : ఐదేండ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సుల సీట్ల భర్తీ షెడ్యూల్ విడుదలయ్యింది. ఈ నెల 25 నుంచి సీట్ల భర్తీ కౌన్సెలింగ్ ప్రారంభమవుతుందని సీపీగెట్ కన్వీనర్ పాండురంగారెడ్డి తెలిపారు. ఈ నెల 25, 26న రిజిస్ట్రేషన్, 28న సర్టిఫికెట్ వెరిఫికేషన్, 28, 29న వెబ్ ఆప్షన్స్, 30న వెబ్ ఆప్షన్ల ఎడిటింగ్, సెప్టెంబర్ 1న సీట్లను కేటాయిస్తామని పేర్కొన్నారు.

'గెస్ట్ ఫ్యాకల్టీని కొనసాగించాలి'

హైదరాబాద్, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ) : ఇంటర్ విద్యలో పనిచేస్తున్న 1,654 మంది గెస్ట్ లెక్చరర్స్‌ను తిరిగి కొనసాగించాలని గెస్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ నేతలు కోరారు. శుక్రవారం ఇంటర్ విద్య డైరెక్టర్ కృష్ణఆదిత్యను కలిసి వినతిపత్రం సమర్పించారు.

ఉద్యమిద్దాం.. పాత పింఛన్ సాధిద్దాం: ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ): పాత పెన్షన్‌ను సాధించే పోరాటంలో రాష్ట్రంలోని ఉపాధ్యాయులంతా భాగస్వామ్యం కావాలని టీచర్ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 1న పీఆర్టీయూ టీఎస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ధర్నాచౌక్‌లో నిర్వహించే పెన్షన్ విద్రోహదినం మహాధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ ధర్నాకు వచ్చే వారంతా నలుపు రంగు టీషర్ట్‌లు, చొక్కాలు, చీరలతో హాజరుకావాలని సూచించారు.

సీపీఎస్ రద్దుకు ఉద్యమిద్దాం: ఆర్‌యూపీపీ

హైదరాబాద్, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ) : కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్) రద్దుకోసం ఉద్యమిద్దామని ఆర్‌యూపీపీ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు శానమోని నర్సింహులు పిలుపునిచ్చారు. సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శనివారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై, మధ్యాహ్న భోజన సమయంలో నిరసన తెలపాలని పిలుపునిచ్చారు. 24న ఇందిపార్క్‌లో నిర్వహించే ధర్నాలో పాల్గొనాలని, సెప్టెంబర్ 1న సుందరయ్య విజ్ఞానకేంద్రంలో నిర్వహించే ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

హోంగార్డు నియామకాలు అబద్ధం

తెలంగాణ పోలీసు శాఖ వెల్లడి

హైదరాబాద్, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ): ఈగల్ సెల్ (యాంటీ నార్కోటిక్ యూనిట్)లో హోంగార్డుల నియామకాలకు సంబంధించి సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న పబ్లిక్ నోటీస్ ఫేక్ అని తెలంగాణ పోలీసులు స్పష్టంచేశారు. ఈ నోటీసులో అర్హత గల పురుషులు, మహిళల నుంచి హోంగార్డుల నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఉన్నదని పేర్కొన్నారు. నెలకు రూ.25,000-26,000 గౌరవ వేతనం ఉంటుందన్న విషయం కూడా పూర్తిగా అవాస్తవమని చెప్పారు.

చేనేతపై జీఎస్టీ ఎత్తివేయాలి: చిన్నారెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ): చేనేత పరిశ్రమపై విధిస్తున్న జీఎస్టీని ఎత్తివేయాలని, వారసత్వ సంస్కృతిని కాపాడాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి కోరారు. ఈ మేరకు శుక్రవారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు లేఖ రాశారు. తెలంగాణలో వ్యవసాయం తర్వాత చేనేత రంగంలోనే అధిక మంది ఉపాధి పొందుతున్నారని, దీనిపై జీఎస్టీ విధించడం వల్ల తీవ్ర నష్టం జరుగుతున్నదని లేఖలో పేర్కొన్నారు.

షరతుల్లేకుండా అడ్మిషన్లు కల్పించాలి: ఏబీవీపీ

హైదరాబాద్, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ) : ప్రొఫెషనల్ కోర్సుల ప్రవేశాల్లో ఎలాంటి షరతుల్లేకుండా అడ్మిషన్లు కల్పించాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) డిమాండ్ చేసింది. శుక్రవారం ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వీ బాలకిష్టారెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించింది.

బీటెక్ సీట్ల సంఖ్యలో గందరగోళం

- 12 రోజుల్లో తగ్గిన 1,403 సీట్లు

హైదరాబాద్, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో కన్వీనర్ కోటా ఇంజినీరింగ్ సీట్ల సంఖ్య లెక్క తప్పింది. సీట్ల సంఖ్యలో తేడాలతో గందరగోళం నెలకొన్నది. పది రోజుల వ్యవధిలోనే ఏకంగా 1,403 సీట్లు తగ్గాయి. ఎప్‌సెట్ వెబ్‌కౌన్సెలింగ్‌లో భాగంగా ఈ నెల 10న నిర్వహించిన తుది విడత సీట్ల కేటాయింపు సమయంలో మొత్తం 91,649 సీట్లున్నట్టు సాంకేతిక విద్యాశాఖ అధికారులు ప్రకటించారు. తాజాగా శుక్రవారం సెంట్రలైజ్డ్ ఇంటర్న్ స్లైడింగ్ సీట్ల కేటాయింపు సందర్భంగా మొత్తం సీట్ల సంఖ్య 90,246 ఉన్నట్టు ప్రకటించారు. అంటే పన్నెండు రోజుల్లోనే 1,403 సీట్లు తగ్గాయన్న మాట. అసలింతకు ఈ వ్యవధిలో ఏం జరిగింది. ఈ సీట్లు ఏమైనట్టు అన్న ప్రశ్నలొస్తున్నాయి.

1,815 మంది డ్రాప్..

ఇంజినీరింగ్‌లో సీటు వచ్చినా ఈ సారి 1,815 మంది సీట్లు వదులుకున్నారు. వీరంతా ఇప్పటికే కట్టిన ఫీజులు కోల్పోనున్నారు. ఇంటర్నల్ స్లైడింగ్‌కు ముందు 11,638 సీట్లు మిగలగా, తాజాగా ఇంటర్నల్ స్లైడింగ్ తర్వాత 13,453 సీట్లు మిగిలాయి. ఇంటర్నల్ స్లైడింగ్ తర్వాత ఈ సారి మొత్తంగా 85.1% సీట్లు నిండాయి.

నేటి నుంచి ఇంటర్‌లో ఎఫ్‌ఆర్‌ఎస్

- విద్యార్థులతోపాటు లెక్చరర్లు, సిబ్బందికి కూడా

హైదరాబాద్, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఫేషియల్ రికగ్నిషన్ హాజరు(ఎఫ్‌ఆర్‌ఎస్)ను శనివారం నుంచి అమలుచేయనున్నారు. హాజరు నమోదు కోసం టీజీ డీఐఈ ఎఫ్‌ఆర్‌ఎస్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. లెక్చరర్లు ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఎలా వినియోగించుకోవాలో సూచించే మాడ్యూల్‌ను ప్రిన్సిపాళ్లకు పంపించారు. విద్యార్థులతోపాటు లెక్చరర్లు, సిబ్బందికి కూడా ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరు తప్పనిసరి చేశారు. విద్యార్థుల గైర్హాజరు సమాచారాన్ని తల్లిదండ్రులకు చేరవేస్తారు.

ఏఐ ఏజెంట్లతో మెయిల్ మేడ్ ఈజీ



ప్రొఫెషనల్ మెయిల్ చేయాలన్నా, అఫీషియల్ డాక్యుమెంట్ రాయాలన్నా.. ఇంగ్లిష్‌పై మంచి పట్టు ఉండాలి. ఫార్మాట్ తెలిసి ఉండాలి. అతికొద్ది మంది మాత్రమే ఈ విషయంలో ముందుండే వారు. వారికి అంతా ఇంతా డిమాండ్ ఉండదు. ఇప్పుడు రాసేది ఏ విషయమైనా.. ఆన్‌లైన్ టూల్స్ చూసుకుంటున్నాయి. ఈ సేవల్లో గ్రామర్లీ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. మనం చేసే గ్రామర్ మిస్టేక్స్ అన్నీ అదే సరిదిద్దేది. ఇప్పుడు గ్రామర్లీ కొత్తగా 'ఏఐ ఏజెంట్స్'ని రంగంలోకి దింపింది. ఫుల్‌ప్యాకేజ్ రైటింగ్ అసిస్టెంట్‌గా గ్రామర్లీ పనిచేస్తున్నది. విద్యార్థులు, అధికారులు.. ఇలా ఎవరైనా ఏ తరహా మెయిల్ రాయాలన్నా... ఏఐ ఏజెంట్స్ చూసుకుంటాయి. ఒక్కో ఏజెంట్ ఒక్కో పనిలో ఎక్స్‌పర్ట్ అన్నమాట. ఫ్రీ వెర్షన్‌లోనూ మంచి ఫీచర్లు అందుబాటులో ఉన్నాయి.

- 'రీడర్ రియాక్షన్' ఏజెంట్‌ని తీసుకుంటే.. మీరు రాసిన మెయిల్ చదివిన తర్వాత మీ బాస్‌కు గానీ, మీ క్లయింట్‌కు గానీ ఎలాంటి సందేహాలు వస్తాయో చెబుతుంది. ముందే వాటిని ఊహించి మార్పులు సూచిస్తుంది.
- 'ఏఐ గ్రేడర్' ఏజెంట్ విషయానికి వస్తే..అసైన్‌మెంట్ సబ్మిట్ చేయకముందే ఏ గ్రేడ్ వస్తుందో అంచనా వేస్తుంది. విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్స్‌కు ఇది బాగా ఉపయోగపడుతుంది.
- 'సైటేషన్ ఫైండర్' ఏజెంట్ మీకు కావాల్సిన రిఫరెన్స్‌లు వెతికి, ఫార్మాట్ చేసి ఇస్తుంది. కార్పొరేట్ ఉద్యోగులకు యూజ్ ఫుల్.
- 'ప్రూఫ్ రీడర్' ఏజెంట్.. పదాల్లో, వాక్యాల్లో తప్పులు లేకుండా చూసుకుంటుంది. తప్పులొస్తే లిప్తపాటులో సరిచేస్తుంది.
- ప్లేజొరిజమ్ చెకర్.. కంటెంట్ కాపీ కొట్టిందో, సొంతంగా రాసిందో తేల్చేస్తుంది. ఇలా ఒక్కో ఏజెంట్ ఒక్కో పని చక్కబెడుతుందన్నమాట!



ఊబకాయాన్ని వదలించుకోవడానికి అందరూ ఉబలాటపడుతుంటారు. బరువు తగ్గేందుకు కడుపు కట్టేసుకుంటారు. నాజూకుగా తయారవ్వాలని.. లేనిపోని డైట్ పాటిస్తూ, వ్యాయామం అంటూ నానా అవస్థలూ పడుతుంటారు. కానీ, చాలామంది మధ్యలోనే చేతులెత్తేస్తారు. అయితే.. క్రమశిక్షణతో ప్రయత్నిస్తే బరువు తగ్గడం పెద్ద విషయమేమీ కాదని అమెరికాకు చెందిన 'అమకా' అంటున్నది. కేవలం నాలుగు నెలల్లోనే 25 కిలోలు తగ్గిన ఈ ఫిట్‌నెస్ ట్రైనర్.. అందరితో 'ఔరా!' అనిపించుకున్నది. ఇందుకోసం తాను చేసిన త్యాగాలను సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నది.

ప్రేరణ కాదు.. క్రమశిక్షణ!



ఊబకాయం నుంచి బయటపడటం.. శారీరకంగా కన్నా మానసికంగానే ఎక్కువ కష్టమని అమకా చెబుతున్నది. ఆరోగ్యకరమైన శరీరాన్ని పొందాలంటే.. పలు త్యాగాలు చేయాల్సి ఉంటుంది. అందుకోసం మానసికంగా సిద్ధమవ్వడం చాలా ముఖ్యం.

బరువు తగ్గడంలో పురోగతి స్పష్టంగా కనిపించాలంటే.. జంక్‌ఫుడ్‌కు నో చెప్పాల్సిందే! చాక్లెట్లు, పేస్ట్రీలు, లేట్ నైట్ స్నాక్స్.. మొదలైనవాటిని పక్కన పెట్టేయాల్సిందే!

క్రమం తప్పని వ్యాయామం.. తన దినచర్యలో భాగం చేసుకున్నది అమకా. అలసిపోయినట్లు అనిపించినా.. ప్రతిరోజూ ఆరు గంటలకే వ్యాయామం మొదలుపెట్టేది. ఈ అలవాటే.. ఆమె స్థిరంగా, క్రమశిక్షణగా ఉండటానికి సహాయపడింది. సరికొత్త శక్తిని అందించింది.

ఇక ఓవర్‌నైట్ పార్టీలు, ఆల్కహాల్, ఎనర్జీ డ్రింక్స్, ఇతర కూల్ డ్రింక్స్‌కు ఎంత దూరంగా ఉంటే.. అంత మంచిదని చెబుతున్నది. అప్పుడే గుండె ఆరోగ్యం బాగుంటుందనీ, శరీరంలోకి చెడు కొలెస్ట్రాల్ చేరదనీ అంటున్నది. ఈ అలవాటుతో బరువు తగ్గడంతోపాటు డబ్బు కూడా ఆదా అవుతుంది.

తాను డిటాక్స్ డైట్‌ను ఫాలో అయినట్లు అమకా వెల్లడించింది. ఇందులో భాగంగా వారంలో రెండుమూడు రోజులు మితాహారం తీసుకొనేది. కేవలం పండ్లు మాత్రమే తినేది. ఈ డైట్ ప్లాన్‌తోనే తన నడుము కొలత తగ్గిందని చెబుతున్నది.

ఆకలిగా ఉన్నప్పుడు కాదు.. షెడ్యూల్ ప్రకారం తినాలని సూచన చేస్తున్నది అమకా. బాగా ఆకలి వేసేదాకా వేచి ఉండకుండా.. నిర్ణీత సమయాల్లో తినడం మంచిదట.

ఏం తింటున్నాం? ఎంత తింటున్నాం? ఎంత తగ్గుతున్నాం? అనేది ఎప్పటికప్పుడు ట్రాక్ చేసుకుంటూ ఉండాలి. మొదట్లో చిరాకు తెప్పించినా.. శరీరంలో ఎలాంటి మార్పు వస్తున్నదో కచ్చితంగా తెలుసుకోవాలి. అప్పుడే ప్లాన్‌లో ఏవైనా మార్పులు-చేర్పులు చేసుకునే అవకాశం ఉంటుంది.

ఆరోగ్యమే మహాభాగ్యం. మరి అలాంటి ఆరోగ్యం బాగుండాలంటే మంచి ఆహారం అవసరం. కానీ, ఆహార వ్యవహారాలను మారిన జీవనశైలి తీవ్రంగా ప్రభావితం చేస్తున్నది. ప్రాసెస్డ్ జంక్‌ఫుడ్‌కు అలవాటు పడుతున్నారు. దీంతో వయసుతో సంబంధం లేకుండా బీపీ, డయాబెటిస్ కొని తెచ్చుకుంటున్నారు. మరి ఇలాంటి పరిస్థితుల్లో 'ఆరోగ్యకరమైన ఆహారం మీ కోసం' అని ముందుకొచ్చింది పలక్ అరోరా. 'మిల్లియమ్' బ్రాండ్ పేరిట రెడీ టు కుక్ మిల్లెట్ మిక్స్‌తో ఆంత్రప్రెన్యూర్‌గా రాణిస్తున్న 26 ఏండ్ల పలక్ అరోరా కథ ఇది..

చిరుధాన్యాలతో ఘన విజయం

హర్యానాలోని ఫరీదాబాద్‌కు చెందిన పలక్ వాళ్లింటి టెర్రస్‌పై రకరకాల చిరుధాన్యాల ఆహార ఉత్పత్తులు తయారు చేస్తున్నది. 'మిల్లియం' ఫుడ్ బ్రాండ్‌తో నేటితరానికి సంప్రదాయ చిరుధాన్యాలను పరిచయం చేస్తున్నది. స్థానిక రైతుల నుంచి చిరుధాన్యాలు కొనుగోలు చేసి.. రకరకాల వెరైటీలు అందిస్తున్నది. ఈ మిల్లెట్ మిక్స్‌లు బిజీబిజీగా ఆఫీసులకు పరిగెత్తేవాళ్లకు రెడీమేడ్‌గా రుచితోపాటు ఆరోగ్యాన్నీ ప్రసాదిస్తున్నాయి.

నాన్న ఆరోగ్యం కోసం..

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ ఆంత్రప్రెన్యూర్ అండ్ మేనేజ్‌మెంట్‌లో ఫుడ్ ఇంజినీరింగ్ చేసింది పలక్. ఆమె మూడో సంవత్సరంలో ఉన్నప్పుడే రోగనిరోధక శక్తిని పెంచే ఆహారంపై పరిశోధన ప్రారంభించింది. ఆ సమయంలోనే పలక్ తండ్రికి మూత్రపిండాల సమస్య వచ్చింది. దానికి కారణం ఆయన దీర్ఘకాలంగా పోషకాహారం తీసుకోకపోవడమే అని డాక్టర్లు చెప్పారు. దాంతో తన కుటుంబానికి ఆరోగ్యకర ఆహారం అందించాలన్న లక్ష్యంతో ఈ చిరుధాన్యాల వైపు అడుగులు వేసిందామె.

మాతో పాటు అందరికీ..

'మా నాన్న అనారోగ్యానికి గురైనప్పుడు మా కుటుంబమంతా ఒక్కసారిగా కుంగిపోయింది. ఫుడ్ ఇంజినీరింగ్ చేస్తున్న నాకు ఆహారమే మహాభాగ్యమని తెలిసినా, ఇంటి ఆహారాన్ని సరిగ్గా పట్టించుకోలేదు. కానీ, డాక్టర్లు మేము తినే ఆహారంలో పోషకాలు లేవన్నప్పుడు, నేను మన ముందు తరాల వాళ్లు తీసుకునే ఆహారం గురించి ఆరా తీశాను. వారి ప్రధాన ఆహారం చిరుధాన్యాలే అని తెలిసింది. దాంతో మా కుటుంబ ఆరోగ్యంతో పాటు నలుగురికీ ఈ ఆహారం అందించాలనుకున్నాను. అలా మొదలైందే మా 'మిల్లియం' బ్రాండ్. స్థానికంగా చిరుధాన్యాలు పండించే రైతులను సంప్రదించాను. వారి నుంచి మేలు రకం ధాన్యం కొనుగోలు చేస్తున్నాను. దీనిద్వారా వాళ్లకూ మంచి గిట్టుబాటు దక్కుతున్నది. నాకూ నాణ్యమైన ధాన్యం లభిస్తున్నది. అంతేకాదు, నాకు ఆంత్రప్రెన్యూర్ అవ్వాలన్నది ఎంత ఇష్టమో.. నలుగురికి ఉపాధి కల్పించడమూ అంతే ఆనందం. ఉత్పత్తుల తయారీ, ప్యాకింగ్ కోసం కొందరిని తీసుకున్నాం. వారంతా ఇప్పుడు సంతోషంగా ఉన్నారు' అని చెప్పుకొచ్చింది పలక్.

పురాతన ధాన్యాల్లోనే ఆరోగ్యం..

కరోనా లాక్‌డౌన్ సమయంలో పలక్ ఈ ఫుడ్ ప్రయోగాలు ప్రారంభించింది. కేవలం సోలార్ డ్రైయర్స్, బ్లెండర్స్‌తో చిరుధాన్యాలను శుభ్రం చేసి పొడి చేసేది. ఇలా పొడులైతే ఉద్యోగులకు త్వరగా వండుకునే అవకాశం ఉంటుందని పలక్ ఉద్దేశం. అప్పుడే ఆమె ప్రభుత్వరంగ సంస్థల నుంచి సర్టిఫికెట్లు పొంది, పూర్తిస్థాయి ఆంత్రప్రెన్యూర్‌గా మారింది. గోధుమ పిండిని ప్రజలు ఎలా విరివిగా వాడుతున్నారో, ఈ చిరుధాన్యాల మిక్స్‌లను కూడా అలాగే వాడాలన్నది తన లక్ష్యం అంటుంది పలక్.

కుటుంబ ప్రోత్సాహం..

ప్రయోగాల పేరిట కుస్తీ పడుతున్న కూతురుని తల్లిదండ్రులు, ఇతర కుటుంబ సభ్యులు ప్రోత్సహించారు. ఈ ఫుడ్ ప్రొడక్ట్ తయారీలో తన తల్లి ఎంతో సహకరిస్తుందని పలక్ చెప్పుకొచ్చింది. రుచి చూడటం, పరిమాణాల్లో మార్పులు చెప్పడం వంటివి ఆవిడే చెప్పేవారట. అలా ఆర్థికంగా, ఎమోషనల్‌గా ఫ్యామిలీ ఎంతగానో సపోర్ట్‌గా నిలిచిందంటుంది పలక్. 'మిల్లియం' బ్రాండ్ మొదటి ప్రొడక్ట్ రెడీ ఫర్ కుక్ పోరిడ్జ్. తర్వాత వెజిటేబుల్ మిక్స్ ఇడ్లీ పిండి, పంజాబీ స్టైల్ చీలా పొడి ఇలా రకరకాల ఉత్పత్తులు తయారు చేస్తున్నది. 2021 సెప్టెంబర్‌లో పలక్ తన కంపెనీని రిజిస్టర్ చేయించింది. తర్వాత 2022 జూన్‌లో మిల్లియం బ్రాండ్‌ను లాంచ్ చేసింది.

టన్నుల కొద్దీ ఉత్పత్తి..

ఒకప్పుడు టెర్రస్‌నే కిచెన్‌గా మార్చుకున్న పలక్ ఇప్పుడు ఫరీదాబాద్‌లో భారీ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌ను స్థాపించింది. నెలకు ఎనిమిది టన్నుల 'రెడీ టు కుక్', 21 టన్నుల 'రెడీ టు ఈట్ మిల్లెట్ ప్రొడక్ట్స్' ఉత్పత్తి చేస్తున్నది. అందులో రాగి సూప్, మిల్లెట్ నూడుల్స్,



పాస్తా, మిల్లెట్ పోహా, పాన్ కేక్ మిక్స్ ఇలా 15 రకాల ఉత్పత్తులు ఉన్నాయి. అందుబాటు ధరల్లోనే విక్రయిస్తున్నది. అలాగే తన ఉత్పత్తులను హోటళ్లు, రెస్టారెంట్లు, క్యాటరింగ్ సర్వీసులకు అందిస్తూనే, దేశవ్యాప్తంగా ఆన్‌లైన్‌లో ఆర్డర్లు తీసుకుంటున్నది. 'హెల్దీ బీ జల్దీ బీ' అనే ట్యాగ్ లైన్‌తో విపణిలోకి ప్రవేశించిన పలక్‌కు ఆదిలో ఆటుపోట్లు ఎదురైనా తట్టుకొని నిలబడింది. ఇప్పుడు నెలకు లక్షల్లో టర్నోవర్ సాధిస్తూ.. వినియోగదారులకు రెడీమేడ్ ఆరోగ్యాన్ని అందిస్తున్నది.



> **"మిల్లెట్ పంటలు ఎలాంటి వాతావరణాన్నైనా తట్టుకుంటాయి. అలాగే వరి, గోధుమలకు కావాల్సినంత నీళ్లు ఈ చిరుధాన్యాల సాగుకు అవసరం లేదు. వీటివల్ల మట్టి కూడా సారవంతం అవుతుంది. అలాగే అందరికీ ఆరోగ్యం అనే కాన్సెప్ట్ నాది. వ్యవసాయ క్షేత్రం నుంచి కిచెన్ వరకు అన్ని దశల్లో ఉపాధి అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో దీనిని ప్రారంభించాను."**

ఆ లిప్‌స్టిక్‌లతో అపాయం



అనేక మంది మహిళలు తాము అందంగా కనిపించేందుకు సౌందర్య సాధనాలు విరివిగా వాడుతుంటారు. అందులో ప్రధానంగా వివిధ రకాల లిప్‌స్టిక్‌లతో తమ పెదాలను అలంకరించుకుంటారు. కానీ కొన్ని లిప్‌స్టిక్‌లు వాడటం వల్ల నెలసరి సమస్యలు వస్తాయని హెచ్చరిస్తున్నారు వైద్యులు. కొన్ని హార్మోన్లను దెబ్బతీసే రసాయనాలను కలిగి ఉంటాయని చెబుతున్నారు. లిప్‌స్టిక్ ప్యాకేజింగ్‌లో కనిపించే బిస్ ఫినాల్ ఏ (బీపీఏ) కెమికల్ ఈస్ట్రోజెన్‌ను అనుకరించి మహిళల శరీరంలోని హార్మోన్లను గందరగోళంగా మారుస్తుందట. మెతిల్ ప్యారాబెన్, ప్రొపిల్ ప్యారాబెన్ అనే రెండు పదార్థాలు మహిళల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయని పలు అధ్యయనాల్లో తేలింది. లిప్‌స్టిక్ ప్యాకెట్ మీద అలాంటి పదార్థాలు ఉపయోగించినట్టు కనిపిస్తే వాటిని కొనుగోలు చేయొద్దని సూచిస్తున్నారు. పరాబెన్-ఫ్రీ, బీపీఏ-ఫ్రీ అని రాసి ఉన్న లిప్‌స్టిక్‌లను వాడటమే మంచిదని చెబుతున్నారు. మరోవైపు విటమిన్ ఈ,




స్క్వాలిన్, నేచురల్ ఆయిల్స్‌తో కూడిన హైడ్రేటింగ్ పదార్థాలు ఉండే లిప్‌స్టిక్స్ సురక్షితమైనవిగా, లెడ్, కాడ్మియం లాంటి లోహాలు కలిగినవి ఆరోగ్యానికి హానికరమని పలువురు డెర్మటాలజిస్టులు హెచ్చరిస్తున్నారు.

- ఎండిపోయే మ్యాట్ లిప్‌స్టిక్‌లను ఎక్కువగా వాడొద్దు.
- రాత్రిపూట లిప్‌స్టిక్‌ను పూర్తిగా తుడిచేయాలి.
- హైడ్రేటింగ్‌బేస్ లేదా లిప్‌బామ్ ఉపయోగిస్తే మేలు.

గంట చూసినా గండమే!

డిజిటల్ కంటి ఒత్తిడి.. ఆధునిక ఆరోగ్య సంక్షోభంగా మారుతున్నది. రోజుకు ఒక గంటసేపు స్మార్ట్‌ఫోన్‌తో గడిపినా.. ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావం చూపుతున్నది. మానసిక, శారీరక ఇబ్బందులను కలిగిస్తున్నది. 'జర్నల్ ఆఫ్ ఐ మూమెంట్ రీసెర్చ్'లో ప్రచురితమైన తాజా అధ్యయనం.. ఈ విషయాన్ని వెల్లడించింది. రీల్స్ చూడటం, ఈ బుక్స్ చదవడం లాంటివి.. తీవ్రమైన కంటి అలసట, ఆందోళనతోపాటు నిద్ర సమస్యలనూ కలిగిస్తున్నట్లు తేల్చింది.

భారతీయ యువతలో స్మార్ట్‌ఫోన్ వాడకం, కంటి సమస్యలపై ఈ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా రోజుకు కనీసం గంటసేపు స్మార్ట్‌ఫోన్ వినియోగిస్తున్న వారి హెల్త్ డేటాను పరిశీలించారు. స్మార్ట్‌ఫోన్‌లో ఈ-బుక్ రీడింగ్, వీడియోలు చూడటం, సోషల్ మీడియా రీల్స్ (చిన్న వీడియోలు) ఉపయోగించడం లాంటి కార్యకలాపాలను రికార్డ్ చేశారు. ఈ సర్వేలో పాల్గొన్నవారిలో 60 శాతం మంది స్మార్ట్‌ఫోన్‌ను ఎక్కువసేపు ఉపయోగించిన తర్వాత తీవ్రమైన అసౌకర్యాన్ని అనుభవించినట్లు చెప్పారు. కంటి అలసట, మెడ నొప్పి, చెయ్యి లాగడం లాంటి లక్షణాలు ఉన్నట్లు వెల్లడించారు. 83 శాతం మందిలో ఆందోళన, నిద్రాభంగం, మానసిక అలసట వంటి రుగ్మతలను ఎదుర్కొంటున్నట్లు చెప్పుకొచ్చారు. ఇందుకు గల కారణాలను అధ్యయనకారులు వివరిస్తూ.. సోషల్ మీడియా రీల్స్ స్మార్ట్‌ఫోన్ స్క్రీన్ వైవిధ్యాలను పెంచుతాయని అంటున్నారు. వీడియోలకు తగ్గట్టుగా స్క్రీన్ బ్రైట్‌నెస్ పెరగడం, తగ్గడం జరుగుతుంది. ఇక ఈ బుక్స్‌లో చిన్నచిన్న అక్షరాలను చదవడం.. కళ్లపై తీవ్ర ప్రభావం



చూపుతుంది. ఇలాంటి మార్పుల కారణంగా కనుపాప తీవ్రంగా ప్రభావితం అవుతుంది. ఇక ఒకేసారి 20 నిమిషాలకు మించి స్మార్ట్‌ఫోన్ వాడితే.. శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. డిజిటల్ పరికరాలు విడుదల చేసే నీలికాంతికి ఎక్కువసేపు గురికావడం వల్ల కంటి అలసట, నిద్ర రుగ్మతలు, దృశ్య సంబంధిత సమస్యలు వస్తాయని సర్వే ప్రతినిధులు హెచ్చరిస్తున్నారు. డిజిటల్ పరికరాలపై గడిపే సమయం మాత్రమే కాకుండా.. ఉపయోగిస్తున్న కంటెంట్ కూడా ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని చెబుతున్నారు. ఈ క్రమంలో స్మార్ట్‌ఫోన్ వినియోగంపై నియంత్రణ ఉండాలని సూచిస్తున్నారు.

రష్యన్ భామల బ్యూటీ సీక్రెట్స్!

రష్యా పడతులు.. అత్యంత ఆకర్షణీయంగా కనిపిస్తారు. లేత గులాబీ వర్ణంలో.. అందానికి సరికొత్త నిర్వచనంగా మెరిసిపోతుంటారు. తాజాగా, వీరి బ్యూటీ సీక్రెట్స్‌ను వెల్లడించారు బ్యుటీషియన్లు. రష్యా మహిళల మేనిఛాయ రహస్యాన్ని బయటపెట్టారు.

- చర్మాన్ని శుభ్రపరచడానికి రష్యా మహిళలు 'బన్యా స్టీమ్ బాత్'ను ఎక్కువగా ఆశ్రయిస్తారు. ఈ స్టీమ్‌బాత్ వల్ల చర్మ రంధ్రాలు లోతుగా శుభ్రమవుతాయి. రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. ఈ పురాతన చర్మ సంరక్షణ పద్ధతితో.. మానసిక-శారీరక విశ్రాంతితోపాటు చర్మానికి మెరుపు, ఆరోగ్యానికి భరోసా దక్కుతుంది.
- ప్లాస్టిక్, రసాయన ఉత్పత్తులకు పూర్తిదూరంగా ఉంటారు. చర్మాన్ని ఎక్స్‌ఫోలియేట్ చేసేందుకు బిర్చ్/ఓక్ కొమ్మలతో తయారైన స్క్రబ్‌లను ఉపయోగిస్తారు. వీటితో చర్మాన్ని సున్నితంగా మసాజ్ చేయడం వల్ల.. రక్త ప్రసరణ మెరుగుపడుతుంది.



- ఎప్పుడూ చల్లగా, పొడిగా ఉండే రష్యాలో.. చర్మం పొడిబారుతూ ఉంటుంది. అందుకే, చర్మాన్ని ఎప్పుడూ హైడ్రేటెడ్‌గా ఉంచుకోవడానికి కొన్నిరకాల సముద్రపు ఉత్పత్తులు, పొద్దుతిరుగుడు, ఆముదం నూనెను వాడుతారు. వీటిలో చర్మ ఆరోగ్యాన్ని రక్షించే పోషకాలు, వృద్ధాప్య నిరోధక లక్షణాలు ఎక్కువ. అవి చర్మం, జుట్టుకు మంచి హైడ్రేషన్ అందిస్తాయి.
- కోల్డ్ వాటర్ థెరపీ, ఐస్ ఫేషియల్స్‌తో చర్మాన్ని ఎప్పటికప్పుడు రిఫ్రెష్‌గా ఉంచుకుంటారు. ఈ థెరపీలతో ముఖ చర్మం బిగుతుగా మారుతుంది. రక్త ప్రసరణ మెరుగుపడటంతోపాటు ముడతలూ తగ్గుముఖం పడుతాయి. ఇక కళ్ల కింద వాపును నివారించడంలో కోల్డ్ వాటర్ థెరపీ అద్భుతంగా పనిచేస్తుంది.
- రష్యన్ల సాంప్రదాయ మాస్కులలో ఎక్కువగా ఉపయోగించే పదార్థాలు.. సోర్ క్రీం, తేనె. వంటింట్లో నిత్యం అందుబాటులో ఉండే ఈ పదార్థాలు.. చర్మాన్ని తేమగా, కాంతివంతంగా ఉంచుతాయి.
- ఇక క్లెన్సర్లుగా పాల ఉత్పత్తులకు ఓటేస్తారు రష్యన్ అమ్మాయిలు. ఇందులో ఉండే లాక్టిక్ యాసిడ్.. చర్మాన్ని మృదువుగా, హైడ్రేటెడ్‌గా ఉంచడంలో సాయపడుతుంది. చర్మం పీహెచ్ సమతుల్యతను కాపాడటంతోపాటు చర్మ సహజవర్ణాన్ని మెరుగుపరచడంలోనూ ముందుంటుంది.

..ఇలా రసాయన ఉత్పత్తులపై ఎక్కువగా ఆధారపడకుండానే రష్యన్ అమ్మాయిలు అందాన్ని కాపాడుకుంటున్నారు. సంప్రదాయ పద్ధతులను పాటిస్తూ.. 'బ్యూటీ'కి కేరాఫ్‌గా నిలుస్తున్నారు.



కరోనా వ్యాక్సిన్‌తోనే ఆకస్మిక మరణాలు



టీకా వేసుకున్న వారిలో త్రాంబోసిస్, గుండెపోటు, పక్షవాతం
వేల సంఖ్యలో మరణిస్తున్నా దిద్దుబాటు చర్యలు శూన్యం
కారణాలు అన్వేషించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం
యూనివర్సల్ హెల్త్ ఆర్గనైజేషన్ సమావేశంలో వక్తల ఆందోళన

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ): కరోనా వ్యాక్సిన్ ప్రభావంతోనే దేశంలో ఆకస్మిక మరణాలు సంభవిస్తున్నాయని యూనివర్సల్ హెల్త్ ఆర్గనైజేషన్ చైర్మన్ డాక్టర్ అమితవ్ బెనర్జీ చెప్పారు. దేశవ్యాప్తంగా వయస్సుతో సంబంధం లేకుండా గుండెపోటుతో సహా ఇతర కారణాలతో ప్రజలు ఆకస్మికంగా మరణించడం ఆందోళనకరమని అన్నారు. యూనివర్సల్ హెల్త్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సోమాజిగూడలోని ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అమితవ్ బెనర్జీ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం, ఫార్మా కంపెనీలు కుమ్మక్కై కరోనా మహమ్మారిని బూచిగా చూపి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయని ఆరోపించారు. కరోనా సమయంలో సంభవించిన మరణాల కంటే ఆ తరువాత సంభవిస్తున్న మరణాలు రెట్టింపవుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. కరోనా వ్యాక్సిన్ పనితీరును పూర్తిస్థాయిలో నిబంధనల ప్రకారం పరీక్షించకుండానే ప్రజలకు వేయడం ద్వారా అనేక సైడ్ ఎఫెక్ట్స్ వస్తున్నాయని తెలిపారు. ముఖ్యంగా గుండెపోటు, త్రాంబోసిస్, త్రాంబోసైటోపీనియా, ఫేషియల్ పక్షవాతం, పలు రకాల క్యాన్సర్లు సోకుతున్నాయని వెల్లడించారు. కరోనా టీకా వేయని దేశాల్లో ఇలాంటి మరణాలు నమోదైన దాఖలాలు లేవని స్పష్టంచేశారు. ఆఫ్రికా సహా పలు ద్వీపాల్లో పోస్టు కరోనా మరణాలు చాలా తక్కువగా ఉన్నాయని తెలిపారు. ఆకస్మిక మరణాలు రోజురోజుకు పెరిగిపోతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దిద్దుబాటు చర్యలు తీసుకోకపోవడం ఆందోళనకరంగా ఉందని అన్నారు. కనీసం ఆకస్మిక మరణాలకు కారణాలను అన్వేషించడానికి కూడా ప్రభుత్వాలు చొరవ తీసుకోకపోవడానికి కారణమేమిటని ప్రశ్నించారు. కరోనాను బూచిగా చూపి రూ.5 లక్షల కోట్లను కేంద్ర ప్రభుత్వం ఖర్చు చేసిందని వెల్లడించారు. కోట్ల రూపాయల ప్రజల సొమ్మును వెచ్చించింది వారి మరణాలను పెంచడానికేనా? అని నిలదీశారు.

ఆకస్మిక మరణాలపై ఎందుకు దృష్టిపెట్టడంలేదు?

దేశవ్యాప్తంగా గుండెపోటు, రక్తంలో ప్లేట్‌లెట్స్ పడిపోవడం, ఆకస్మికంగా క్యాన్సర్ల బారిన పడి ప్రజలు పిట్టల్లా రాలిపోతుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎందుకు పట్టించుకోవడంలేదని రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న వక్తలు ప్రశ్నించారు. గుండెపోటు సంభవిస్తే జీవన విధానంలో మార్పులే కారణమని నిపుణులైన డాక్టర్లు చెప్పడం ఆశ్చర్యానికి గురిచేస్తున్నదని పేర్కొన్నారు. చిన్న పిల్లలు, ఎలాంటి చెడు అలవాట్లు లేని వారే ఎక్కువగా కార్డియాక్ అరెస్ట్ (గుండెపోటు) బారిన పడి చనిపోతున్నారని గుర్తుచేశారు. ఈ మరణాలకు కారణాలు తెలుసుకునే ప్రయత్నం ప్రభుత్వాలు చేయకపోవడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. కారణాలను అన్వేషిస్తే ఫార్మా కంపెనీలు, కేంద్ర ప్రభుత్వానికి మధ్య జరిగిన కరోనా వ్యాక్సిన్ డీల్ బయటపడుతుందని భయపడుతున్నారేమోనని అనుమానం వ్యక్తంచేశారు. పేరు మోసిన వైద్యులు కూడా ఆకస్మిక మరణాలపై నోరు మెదపకపోవడంతో ప్రజల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. తెలంగాణ ప్రభుత్వం స్పందించి కర్ణాటక తరహాలో ఆకస్మిక మరణాలపై ప్రత్యేక కమిటీని వేసి పరిశోధించాలని డిమాండ్‌చేశారు. కేంద్ర ప్రభుత్వం దీనిపై దృష్టి పెట్టకుంటే మరిన్ని మరణాలు సంభవించే పరిస్థితి దాపురిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

వైటీపీఎస్.. దేవాలయం

- **ఈ కరెంటుతో రాష్ట్ర జీడీపీకి ఊతం: భట్టి విక్రమార్క**
- **వైటీపీఎస్ భూ నిర్వాసితులకు ఉద్యోగ నియామకపత్రాలు**



హైదరాబాద్, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ): కేసీఆర్ కలల ప్రాజెక్ట్ అయిన యాదాద్రి పవర్ ప్లాంట్ (వైటీపీఎస్) పై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రశంసలు కురిపించారు. రాష్ట్రంలోనే అతిపెద్ద ప్లాంట్ అయిన వైటీపీఎస్‌ను దేవాలయంగా అభివర్ణించారు. ఈ ప్లాంట్‌లో ఉత్పత్తి అయ్యే కరెంటు రాష్ట్ర జీడీపీని పెంచేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. వైటీపీఎస్ భూ నిర్వాసితులకు ఉద్యోగపత్రాల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం బేగంపేటలోని ప్రజాభవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. వైటీపీఎస్‌లోని మిగతా మూడు యూనిట్లను డిసెంబర్ కల్లా అందుబాటులోకి తీసుకొచ్చి, జనవరి 15 కల్లా మొత్తం వైటీపీఎస్‌ను జాతికి అంకితం చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా 335 మందికి వైటీపీఎస్‌లో జూనియర్ అసిస్టెంట్, జూనియర్ ప్లాంట్ అటెండెంట్, ఆఫీస్ సబార్డినేట్, హౌజ్ కీపర్లుగా ఉద్యోగ నియామక పత్రాలు, మరో 151 మందికి కారుణ్య నియామక పత్రాలు అందజేశారు.

మహిళా పోలీసుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

శాంతిభద్రతల పరిరక్షణలో తెలంగాణ నంబర్‌వన్: భట్టి విక్రమార్క

హైదరాబాద్, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ): మహిళా పోలీసుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. వీరి సంక్షేమం కోసం చేసే సిఫారసులను అమలుచేసేందుకు సిద్ధంగా ఉన్నదని తెలిపారు. మహిళా పోలీసులో మహిళ అనే పదాన్ని తొలగించాలన్న సిఫారసు మంచి ఆలోచనని, ఈ సిఫారసుతో ఏకీభవిస్తున్నానని వెల్లడించారు. తెలంగాణ పోలీసు అకాడమీలో శుక్రవారం మహిళా పోలీసు సదస్సు ముగింపు కార్యక్రమానికి భట్టి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళా పోలీస్ సిబ్బంది సమస్యలపై త్వరితగతిన కమిటీ వేసి నివేదికను ప్రభుత్వానికి అందిస్తే అమలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఏ రాష్ట్రమైనా అభివృద్ధి చెందాలంటే, పెట్టుబడులు రావాలంటే శాంతి భద్రతలు బాగుండాలని వెల్లడించారు. అంకిత భావంతో పనిచేసే పోలీసు సిబ్బంది ఉన్నప్పుడే శాంతిభద్రతలు బాగుంటాయని పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో తెలంగాణ రాష్ట్రం నంబర్ వన్‌గా ఎదిగిందని చెప్పారు. కాగా, సదస్సుకు హాజరైన భట్టి విక్రమార్క ముందు మహిళా పోలీసులు తమ సమస్యలను ఏకరువుపెట్టారు. ఉన్నతాధికారుల నుంచి లైంగిక వేధింపులు, పని ప్రదేశంలో రక్షణ లేకుండా పోవడం, మహిళా అనే చిన్నచూపు, స్టేషన్లలో రిసెప్షన్‌కు పరిమితం చేయడం తదితర సమస్యలను భట్టి దృష్టికి తీసుకొచ్చారు.

అబద్ధాలు.. అభాండాలు!

- **వైటీపీఎస్‌పై తప్పుడు ప్రచారం**
- **అబద్ధాలు వల్లెవేసిన భట్టి**
- **వాస్తవాలు మరిచి కేసీఆర్ సర్కారుపై విమర్శలు**
- **నాడు నానా యాగీచేసి ఇప్పుడు తామే నిర్మించినట్టు పోజులు**



హైదరాబాద్, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కాంగ్రెస్ పాలకులు ఒక అబద్ధాన్ని వందసార్లు చెప్పి నిజమని ప్రజలను భ్రమింపజేస్తున్నారు. అవే అబద్ధాలు.. అవే అభాండాలను పదేపదే వల్లిస్తున్నారు. తాజాగా నల్లగొండ జిల్లా దామరచర్ల వద్ద నిర్మించిన యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ (వైటీపీఎస్) భూ నిర్వాసితులకు ఉద్యోగ నియామక పత్రాలిచ్చే కార్యక్రమాన్ని కూడా అసత్యాలు వల్లించేందుకు వేదిక చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని, కేసీఆర్‌ను లక్ష్యంగా చేసుకుని మరోసారి నిందలు మోపారు. వాస్తవాలను మరిచి విమర్శలు గుప్పించారు.

అబద్ధం: గత పాలకులు యాదాద్రి పవర్ ప్లాంట్ గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. బీహెచ్ఈఎల్‌తో సమీక్షించలేదు.

నిజం: ఇది శుద్ధ అబద్ధం. యాదాద్రి పవర్ ప్లాంట్ పనులను 2017 అక్టోబర్ 17న చేపట్టారు. నవరత్న కంపెనీ అయిన బీహెచ్ఈఎల్ సంస్థ ప్రతినిధులతో కేసీఆరే స్వయంగా భేటీ అయ్యారు. జెన్‌కో, భెల్ మధ్య లెటర్ ఆఫ్ ఇండెంట్ (ఎల్‌వోఐ) కేసీఆర్ సమక్షంలోనే కుదిరింది. ఈ ప్లాంట్ నిర్మాణం కోసం తొలి విడతగా రూ. 417.16 కోట్ల చెక్కును స్వయంగా కేసీఆరే భెల్ ప్రతినిధులకు అందజేశారు. గ్రామీణ విద్యుదీకరణ సంస్థ (ఆర్ఈసీ) రూ. 16,070 కోట్ల ప్రోత్సాహకాన్ని మంజూరు చేయగా, ఆర్ఈసీ సీఈవో రాజీవ్ శర్మ నుంచి స్వయంగా కేసీఆరే స్వీకరించారు. ఈ ప్లాంట్‌కు సాక్షాత్తు కేసీఆరే శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత పలుమార్లు విద్యుత్తు అధికారులతో సమీక్షించారు. 2022 నవంబర్ 29న దామరచర్లలో పర్యటించి ప్లాంట్ నిర్మాణాన్ని పరిశీలించారు.

అబద్ధం: వేలకోట్ల పెట్టుబడితో ప్రారంభించిన పరిశ్రమ ఆలస్యమైన కారణంగా రాష్ట్ర ప్రజలపై ఆర్థికభారం పడింది.

నిజం: వైటీపీఎస్‌కు శంకుస్థాపన చేసిన తర్వాత కరోనా కష్టాలు ఈ ప్లాంట్‌ను వెంటాడిన విషయం తెలియనిది కాదు. పనులు పుంజుకుంటున్న సమయంలో అత్యంత వేగంగా నిర్మాణం సాగుతున్న సమయంలో కరోనా దెబ్బకొట్టింది. లాక్‌డౌన్, కరోనా మొదటి, రెండో వేవ్‌లతో కార్మికులు సొంతూళ్లకు వెళ్లిపోయారు. ఛత్తీస్‌గఢ్, బెంగాల్, బీహార్, జార్ఖండ్ నుంచి 10వేల మంది కార్మికులు ఈ ప్లాంట్ నిర్మాణంలో పనిచేయగా, కరోనాతో వీరంతా అర్ధాంతరంగా సొంతూళ్లకు వెళ్లిపోయారు. ఆ తర్వాత కార్మికులను రప్పించి పనులు వేగవంతం చేశారు.

అబద్ధం: 2022 అక్టోబర్‌లో ఎన్జీటీలో పర్యావరణ అనుమతులపై స్టే ఇచ్చింది. స్టేను ఎత్తివేసే దిశగా చర్యలు చేపట్టలేదు.

నిజం: ఈ ప్లాంట్‌ను అడ్డుకునే కుతంత్రాలకు కొదవలేదు. అన్ని అనుమతులు తీసుకున్న తర్వాతే ఈ ప్రాజెక్ట్‌ను చేపట్టినా ముంబైకి చెందిన సంస్థ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ)లో కేసు వేయడంతో కథ మొదటికొచ్చింది. 64శాతం నిర్మాణం పూర్తయిన తర్వాత మళ్లీ అధ్యయనం చేయాలంటూ ఎన్జీటీ తీర్పునిచ్చింది, ప్లాంట్ నిర్మాణం పూర్తయినా ఉత్పత్తి చేయవద్దని తీర్పునిచ్చింది. అప్పట్లోనే బీఆర్ఎస్ ఎంపీలు నామా నాగేశ్వర్‌రావు, బడుగుల లింగయ్యయాదవ్, దీవకొండ దామోదర్‌రావులు కేంద్ర పర్యావరణ శాఖ అదనపు కార్యదర్శి తన్మయ్‌కుమార్‌ను కలిసి పర్యావరణ అనుమతులు మంజూరుచేయాలని కోరారు. దీంతో కేంద్ర విద్యుత్తుశాఖ కార్యదర్శి అలోక్ కుమార్ 2023 మే 11న కేంద్ర పర్యావరణ శాఖ కార్యదర్శి లీనా నందన్‌కు ఓ లేఖ రాశారు. పర్యావరణ అనుమతుల సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

కమిషన్ పేరుతో నిందలు

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే విద్యుత్తు రంగంపై ప్రభుత్వం శ్వేతపత్రాన్ని విడుదల చేసింది. భారీ తప్పిదాలు, అక్రమాలు జరిగాయని ఆరోపించింది. విద్యుత్తు ఒప్పందాలు, వైటీపీఎస్, బీటీపీఎస్ నిర్మాణంపై విచారణ సంఘాలను నియమించింది. జస్టిస్ నర్సింహారెడ్డి విచారణ దశలోనే కమిషన్ చైర్మన్ పదవి నుంచి వైదొలగాల్సి వచ్చింది. ఆ తర్వాత జస్టిస్ మదన్ బీ లోకూర్ కమిషన్‌ను నియమించగా, ఇది విచారణ నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. ఈ నివేదికలో ఏముంది అన్నది ఎవరికీ తెలియదు. ప్రభుత్వం బయటపెట్టడంలేదు. మొత్తంగా కథ పరిసమాప్తమైంది. వాస్తవానికి తప్పే జరిగి ఉంటే అక్రమాలు, కుంభకోణం జరిగినట్టు విచారణలో తేలితే ఎన్ని నిందలేసేవారో, ఎంత హడావుడి చేసేవారో మనకు తెలియనిది కాదు. కానీ నివేదికపై క్యాబినెట్‌లో చర్చ జరిగిన తర్వాత కూడా సర్కారు వర్గాలు కిమ్మనడం లేదంటేనే, ఏం లేదని అర్థం. వాస్తవానికి యాదాద్రి పవర్ ప్లాంట్ కేసీఆర్ కలల ప్రాజెక్ట్. రాష్ట్ర భవిష్యత్తు అవసరాలను తీర్చడం, విద్యుత్తు డిమాండ్‌ను అధిగమించేందుకు మనం ఎవరిపైనా ఆధారపడకూడదన్న ఆలోచనతో ఈ ప్రాజెక్ట్‌ను చేపట్టారు. యాదాద్రి ప్లాంట్ ప్రణాళికలు, నిర్మాణం, నిధుల సేకరణ ఏ విషయంలోనూ కాంగ్రెస్ నేతలకు, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇసుమంతైనా భాగస్వామ్యం లేదు. ఇప్పుడదే ప్రాజెక్ట్‌ను మేం చకాచకా పూర్తి చేశాం. మాదే క్రెడిట్ అన్నట్టు వ్యవహరిస్తున్నారు. 70 శాతానికి పైగా నిర్మాణం పూర్తయిన తర్వాత ఇప్పుడొచ్చి అంతా తామే చేసినట్లు, నిర్మించినట్టు పోజులుకొడుతున్నారు. అక్రమాలు జరిగాయన్న ప్రాజెక్టే ఇప్పుడు గొప్ప ప్రాజెక్ట్, దేవాలయం వంటి ప్రాజెక్ట్ అంటూ కొత్త పల్లవినందుకున్నారు.

అబద్ధం: గత ప్రభుత్వ పెద్దలు సబ్ క్రిటికల్ టెక్నాలజీతో చేపట్టిన భద్రాద్రి పవర్ ప్లాంట్ రాష్ట్రానికి గుదిబండగా మారింది.

నిజం: రాష్ట్రంలో కరెంట్ కష్టాల్లో ఉన్నప్పుడు, బయటి రాష్ట్రాల్లో కరెంట్ దొరకప్పుడు అప్పటికప్పుడు రాష్ట్ర అవసరాలను తక్షణమే తీర్చేందుకు కేసీఆర్ ప్రభుత్వం బీటీపీఎస్‌ను నిర్మించింది. రాష్ట్రంలోని థర్మల్ ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్ (పీఎల్ఎఫ్) 62.65 కాగా, భద్రాద్రి పవర్ ప్లాంట్‌లో నాలుగు యూనిట్ల పీఎల్ఎఫ్ 66.84గా ఉంది. అంటే రాష్ట్ర సగటు పీఎల్ఎఫ్‌ను మించింది. మొత్తం నాలుగు యూనిట్లు విజయవంతంగా నడుస్తున్నాయి. మరీ గుదిబండ ఎలా అవుతుందన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. పిడుగు పడటమో లేదా అగ్నిప్రమాదంతోనో ఒక యూనిట్ కాలిపోగా, మరో జనరేటర్‌తో నడుపుతున్నారు. ఈ యూనిట్ ప్రతి రోజు విద్యుత్తునందిస్తూనే ఉంది.



శంకరవరప్రసాద్‌గారు పండక్కొస్తున్నారు

అనిల్ రావిపూడి దర్శకత్వంలో అగ్ర నటుడు చిరంజీవి నటిస్తున్న మోస్ట్ ఎవైటెడ్ మూవీ టైటిల్ గ్లింప్స్‌ను శుక్రవారం చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా లాంచ్ చేశారు. 'మెగా 157' వర్కింగ్ టైటిల్‌తో రూపొందుతున్న ఈ చిత్రానికి 'మన శంకరవరప్రసాద్‌గారు' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. 'పండగకు వస్తున్నారు' అనేది ఉపశీర్షిక. సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా విడుదల కానుంది. ఈ సినిమాను ఓ స్టైలిష్ మాస్ ఎంటర్టైనర్‌గా దర్శకుడు అనిల్ రావిపూడి రూపొందిస్తున్నారని శుక్రవారం విడుదల చేసిన టైటిల్ గ్లింప్స్ చెబుతున్నది. కారు వచ్చి ఆగింది.. డోర్ తీసి సిగరెట్ వెలిగిస్తూ, బ్లాక్ సూట్‌లో ఉన్న చిరంజీవి రివీల్ అయ్యారు. కారు దిగి కమాండోల మధ్య నడుస్తుండగా గ్లింప్స్ ప్రారంభమైంది. సిగరెట్ విసిరేస్తున్నప్పుడు టైటిల్ రివీల్ అయ్యింది. అగ్ర నటుడు వెంకటేశ్ వాయిస్ ఓవర్ ఫ్యాన్స్‌లో మరింత జోష్ నింపింది. చిరంజీవి ఎవర్‌గ్రీన్ చరిష్మాను, స్టైల్‌ని అనిల్ రావిపూడి పర్ఫెక్ట్‌గా ప్రజెంట్ చేశారనీ, గ్లింప్స్ చివర్లో వచ్చే గుర్రం సీన్ 'కొండవీటి దొంగ'ను గుర్తు చేసిందనీ అభిమానులు అంటున్నారు. గ్లింప్స్ బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ కూడా చిరంజీవి ఇమేజ్‌ని గుర్తుచేస్తున్నది. 'చిరంజీవి కంబ్యాక్ తర్వాత, ఆయన మెగా స్వాగ్‌ను మళ్లీ చూడాలనే ఒక కోరిక నాకెప్పట్నుంచో ఉండేది. ఫైనల్‌గా ఆయన్నలా చూపించే అవకాశం నాకే వచ్చింది. చిరంజీవిగారిని మనమంతా ఎలా చూడాలనుకుంటున్నామో అంతకు రెండింతలు రేపు సంక్రాంతికి చూస్తారు. చిరంజీవిగారి అసలు పేరైన శివశంకరవరప్రసాద్‌లో శంకరవరప్రసాద్‌ని తీసుకొని ఈ సినిమాకు 'మన శంకరవరప్రసాద్‌గారు' అనే టైటిల్ పెట్టాం. గ్లింప్స్‌కి వాయిస్ ఇచ్చిన విక్టరీ వెంకటేశ్‌గారికి థాంక్యూ. ప్రస్తుతానికి వాయిస్ ఇచ్చారు. వెరీ సూన్ ఎంట్రీ కూడా ఇవ్వబోతున్నారు. వీరిద్దరి కాంబినేషన్ ఎలా ఉంటుందో, రేపు పండక్కి చూస్తారు. ఈ గ్లింప్స్ శాంపిలే.. సినిమాలో ఇంకా చాలా వున్నాయి.' అని అనిల్ రావిపూడి చెప్పారు. ఇంకా నిర్మాతలు సుస్మిత కొణిదెల, సాహు గారపాటి, మ్యూజిక్ డైరెక్టర్ భీమ్స్ సిసిరోలియో కూడా మాట్లాడారు. ఇదిలావుంటే... బ్లాక్‌బస్టర్ 'వాల్తేరు వీరయ్య'ని చిరంజీవికి అందించిన డైరెక్టర్ బాబీ(కె.ఎస్.రవీంద్ర) దర్శకత్వంలో చిరంజీవి మళ్లీ నటించనున్నారు. కె.వి.ఎన్ ప్రొడక్షన్స్ నిర్మించనున్న ఈ చిత్రానికి సంబంధించిన కాన్సెప్ట్ పోస్టర్‌ని కూడా శుక్రవారం విడుదల చేశారు.

చిత్రం

అందులో పదోశాతం కూడా ఇవ్వరు



ఇంట గెలిచి రచ్చ గెలిచిన కథానాయిక ప్రియాంక చోప్రా. బాలీవుడ్‌లోనే కాదు, హాలీవుడ్‌లోనూ గుర్తింపు తెచ్చుకున్న ఏకైక భారతీయ నటీమణి ఆమె. ప్రస్తుతం 'SSMB 29' కథానాయికగా నటిస్తూ తెలుగు ప్రేక్షకులకు కూడా చేరువ కానున్నది ఈ అందాలభామ. ఇదిలావుంటే.. ప్రస్తుతం బాలీవుడ్‌లో హీరోయిన్ల పరిస్థితి గురించి ఈమె మాట్లాడిన ఓ వీడియో సోషల్ మీడియాలో ఓ రేంజ్‌లో వైరల్ అవుతున్నది. ఇందులో ఆమె బాలీవుడ్‌లో మేల్ డామినేషన్ గురించి మాట్లాడారు. 'ఇక్కడంతా మగాళ్ల ఆధిక్యమే. నిజానికి మేం హీరోలకు ఏ విషయంలోనూ తీసిపోం. వారెంత కష్టపడతారో మేమూ సెట్స్‌లో అంతే కష్టపడతాం. కానీ వాళ్లకిచ్చిన దాంట్లో పదోశాతం కూడా మా పారితోషికం ఉండదు. సెట్‌లో మేం గంటల తరబడి ఎదురుచూస్తుంటే, షాట్‌కి ఎప్పుడు రావాలో హీరో నిర్ణయిస్తాడు. కానీ హాలీవుడ్‌లో ఈ పరిస్థితి లేదు.' అంటూ వ్యాఖ్యానించారు ప్రియాంక. కెరీర్ ప్రారంభంలో రంగు విషయంలోనూ విమర్శలు ఎదుర్కొన్నానని, ఛాయ తక్కువ కావడంతో అవకాశాలు వచ్చేవి కావని, దాంతో తోటి నటులకంటే ఎక్కువ కష్టపడాల్సివచ్చిందని ప్రియాంక గుర్తు చేసుకున్నారు.

లెజెండ్స్ ఎప్పుడూ అలసిపోరు



ఈ పోటీ ప్రపంచంలో కల్మషమెరుగని మనుషులు చాలా అరుదు. ఏపాటికీ అంతమ లక్ష్యం అందుకునేందుకు ఆరాటమే తప్ప, సాటి వారి క్షేమాన్ని కాక్షించే మనసులు ఎక్కడో కానీ ఉండవ్. కానీ.. అనారోగ్యం నుంచి బయటపడ్డ మమ్ముట్టి గురించి మలయాళ పరిశ్రమ స్పందిస్తున్న తీరు చూస్తే, బోల్డన్ని మంచి మనసులు ఇంకా ఈ భూమ్మీద ఉన్నాయనిపిస్తుంది. ఇటీవల మమ్ముట్టి అనారోగ్యానికి గురయ్యారు. ఈ విషయంపై సోషల్ మీడియాలో రకరకాల కథనాలు వెలువడ్డాయి. దాంతో మోహన్‌లాల్ శబరిమల వెళ్లి, తమ మిత్రుడు వెంటనే కోలుకోవాలంటూ అయ్యప్పను ప్రార్థించి, పూజలు జరిపారు. ఆయన ఆరోగ్యం విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదంటూ అభిమానుల్లో ధైర్యాన్ని కూడా నింపారు. ఇదిలావుంటే.. ప్రస్తుతం మమ్ముట్టి కోలుకుంటున్నారు. ఆయన ఆరోగ్యం పూర్తిగా కుదుటపడిందనేది లేటెస్ట్ న్యూస్. త్వరలో ఆయన షూటింగ్‌లో కూడా పాల్గొనబోతున్నట్టు మలయాళ మీడియా పేర్కొంది. ఇదే విషయాన్ని మోహన్‌లాల్ కూడా ప్రపంచానికి పరోక్షంగా తెలియజేశారు. వారిద్దరి స్నేహబంధానికి దర్పణంగా నిలిచే ఓ ముచ్చటైన ఫొటోను ఆయన షేర్ చేశారు. దానికి లవ్ సింబల్‌ని కూడా జత చేసి, తామంతా ఆనందంగా ఉన్నట్టు ఓ ఎమోజీని జోడించారు. ఈ ఫొటో చూసిన వారంతా ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. మమ్ముట్టి, మోహన్‌లాల్‌ల స్నేహబంధాన్ని చూసి ఫిదా అయిపోతున్నారు. పనిలోపనిగా మలయాళ నిర్మాతలు సైతం మమ్ముట్టి క్షేమ సమాచారాన్ని అందరికీ తెలియజేస్తున్నారు. 'మీ అందరి ప్రార్థనలు ఫలించాయి. నా ఆనందానికి అవధుల్లేవు. ఆయనకు ఏం కాదని నాలో ధైర్యాన్ని నింపిన అందరికీ ధన్యవాదాలు' అంటూ మమ్ముట్టి మేకప్‌మ్యాన్ జార్జ్ పెట్టిన ఎమోషనల్ పోస్ట్ కూడా సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతున్నది. నటి మంజు వారియర్ అయితే.. తన ఇన్‌స్టాలో మమ్ముట్టి ఫొటోను షేర్ చేసి, 'వెల్‌కమ్ బ్యాక్ టైగర్' అనే క్యాప్షన్‌ను జోడించింది. ఈ పోస్ట్‌పై అభిమానులు ఓ రేంజ్‌లో స్పందిస్తున్నారు. 'లెజెండ్స్ ఎప్పుడూ అలసిపోరు' అంటూ కామెంట్లు పెడుతున్నారు. ప్రస్తుతం మమ్ముట్టి జితిన్ దర్శకత్వంలో 'కళంకావల్' అనే సినిమాలో నటిస్తున్నారు. క్రైమ్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ సినిమా రూపొందుతున్నది. త్వరలోనే ఆయన ఈ సినిమా షూటింగ్‌లోకి ఎంట్రీ ఇస్తారు.



సస్పెన్స్ థ్రిల్లర్‌గా త్రిశంకినీ

రంజిత్‌కుమార్ నటిస్తూ స్వీయ దర్శకత్వం వహించిన చిత్రం 'త్రిశంకినీ'. పలువురు నూతన తారలు ఇందులో కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఎన్ బిక్కునాథ్ నాయక్ నిర్మాత. ఈ సినిమా టైటిల్ లాంచ్ కార్యక్రమం శుక్రవారం హైదరాబాద్‌లో జరిగింది. ప్రముఖ హాస్యనటుడు బాబూమోహన్ టైటిల్‌ని లాంచ్ చేసి, చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు అందించారు. ఓ సరికొత్త సస్పెన్స్ థ్రిల్లర్ మూవీ ఇదని నిర్మాత ఎన్.బిక్కునాథ్ నాయక్ చెప్పారు. చిరంజీవి పుట్టినరోజున మా సినిమా టైటిల్ లాంచ్ జరగడం చాలా ఆనందంగా ఉందని దర్శకుడు రంజిత్‌కుమార్ అన్నారు. అతిథిగా విచ్చేసిన మరో అతిథి డా.రాజేంద్ర కూడా మాట్లాడారు. త్వరలో విడుదల కానున్న ఈ చిత్రానికి కెమెరా, ఎడిటింగ్, వీఎఫ్ఎక్స్: విశ్వక్ స్టూడియో, సంగీతం: వీఆర్‌కే, నిర్మాణం: ఎన్.బి.జె.ప్రొడక్షన్స్.

ఏ రీల్ లైఫ్ స్టోరీ..

గురుచరణ్ నేతి, జూహీ భట్, అమిషి రాఘవ్ ప్రధాన పాత్రధారులుగా రూపొందుతున్న మ్యూజికల్ లవ్ ఎంటర్టైనర్ 'మిస్టర్ రోమియో'. 'ఏ రీల్ లైఫ్ స్టోరీ' అనేది ఉపశీర్షిక. మనోజ్‌కుమార్ కటోకర్ దర్శకుడు. నేతి శ్యామ్‌సుందర్ నిర్మాత. నిర్మాణం పూర్తి కావొచ్చిన ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా టీజర్ లాంచ్ ఈవెంట్‌ను హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన నటి శ్రియా శరణ్ టీజర్‌ని ఆవిష్కరించి చిత్రయూనిట్‌కి శుభాకాంక్షలు అందించారు. దర్శకుడు కరుణకుమార్ మరో అతిథిగా విచ్చేసి చిత్ర యూనిట్‌కు ఆల్ ది బెస్ట్ చెప్పారు. సినిమా ఆల్మోస్ట్ పూర్తయిందని, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతున్నదని, మరో నెలలో విడుదల చేస్తామని, యువతరానికి నచ్చే సినిమా ఇదని దర్శకుడు మనోజ్‌కుమార్ తెలిపారు. ఎస్.కె.ఖాదర్, నవనీత్ బన్సాలి, కుల్దీప్ రాజ్ పురోహిత్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కథనం, మాటలు: చైతన్య గరికిన, కెమెరా: చందు సి.ఎస్.ఆర్, సంగీతం: ప్రజ్వల్ క్రిష్.





డ్యూడ్ సంగీత ప్రయాణం

క్రేజీ యువ జంట ప్రదీప్ రంగనాథన్, మమితా బైజు నటిస్తున్న పాన్ ఇండియా యూత్‌ఫుల్ ఎంటర్టైనర్ 'డ్యూడ్'. శరత్ కుమార్ కీలక పాత్ర పోషిస్తున్నారు. కీర్తిశ్వరన్ దర్శకత్వంలో ప్రతిష్టాత్మక మైత్రీ మూవీమేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. దీపావళి కానుకగా తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది. ప్రమోషన్స్‌లో భాగంగా ఈ సినిమాలోని తొలి పాటను ఈ నెల 28న విడుదల చేయనున్నట్టు మేకర్స్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. 'బూమ్ బూమ్' అంటూ సాగే ఈ పాట ఎనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో ప్రదీప్ రంగనాథన్, మమితా బైజు ట్రెండీ, స్టైలిష్ లుక్‌లో కనిపిస్తున్నారు. హృదు హరూన్, ద్రవిడ్ సెల్వం తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: నికేత్ బొమ్మి, సంగీతం: సాయి అభ్యంకర్.



సుస్వరాల సుందరకాండ

నారా రోహిత్ 20వ సినిమాగా తెరకెక్కిన చిత్రం 'సుందరకాండ'. వృతి వాఘాని, శ్రీదేవి విజయ్‌కుమార్ కథానాయికలు. వెంకటేశ్ నిమ్మలపూడి దర్శకుడు. సంతోష్ చిన్నపోళ్ల, గౌతమ్‌రెడ్డి, రాకేష్ మహంకాళి నిర్మాతలు. ఈ నెల 27న సినిమా విడుదల కానుంది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు సినిమాపై అంచనాలు పెంచాయని మేకర్స్ చెబుతున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం ఈ సినిమా నుంచి 'డియర్ ఐరా..' అంటూ సాగే పాటను విడుదల చేశారు. శ్రీహర్ష ఈమని రాసిన ఈ ప్రేమ గీతాన్ని లియోన్ జేమ్స్ స్వరపరచి, కీర్తన వైద్యనాథన్‌తో కలిసి ఆలపించారు. నరేశ్ విజయకృష్ణ, వాసుకి ఆనంద్, సత్య, అజయ్ తదితరులు ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: ప్రదీప్ ఎం.వర్మ, నిర్మాణం: సందీప్ పిక్చర్ ప్యాలెస్.

అవంతిక-2 సినిమా షూటింగ్ ప్రారంభం

క్లాప్ కొట్టిన మాజీ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి



జడ్చర్ల టౌన్, ఆగస్టు 22 : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల రంగనాయకస్వామి గుట్టపై శుక్రవారం అవంతిక-2 సినిమా షూటింగ్ ప్రారంభించారు. మాజీ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి క్లాప్ కొట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవంతిక-2 సినిమా రంగనాయకస్వామి ఆశీస్సులతో విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

రాణించిన రాగ్వి, జోషిత

- భారత్ 'ఏ' 299 ఆలౌట్



బ్రిస్బేన్: ఆస్ట్రేలియా 'ఏ'తో జరుగుతున్న అనధికారిక తొలి టెస్టులో భారత్ పుంజుకుంది. ఓవర్‌నైట్ స్కోరు 93/5తో రెండో రోజు శుక్రవారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్ 'ఏ' 299 పరుగులు చేసింది. వర్షం కారణంగా 90 పరుగులకే సగం వికెట్లు కోల్పోయి కష్టాల్లో ఉన్న జట్టును రాగ్వి బిస్త్ (153 బంతుల్లో 99, 16ఫోర్లు), జోషిత (51) అర్ధ సెంచరీలతో ఒడ్డున పడేశారు. ముఖ్యంగా రాగ్వి..ఆసీస్ బౌలింగ్‌కు ఎదురొడ్డి నిలుస్తూ సాధికారిక ఇన్నింగ్స్‌తో ఆకట్టుకుంది. కెప్టెన్ రాధాయాదవ్(33)తో కలిసి ఆరో వికెట్‌కు 75 పరుగులు జోడించిన బిస్త్..మిన్ను మణి(33)తో కలిసి స్కోరుబోర్డుకు కీలక పరుగులు జతచేసింది.మరోవైపు జోషిత కూడా రాణించడంతో భారత్ పోరాడే స్కోరు అందుకుంది. బ్రౌన్, ప్రెస్ట్‌బ్రిడ్జ్ మూడేసి వికెట్లు తీశారు. ఆ తర్వాత బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్ 5 వికెట్లకు 158 పరుగులు చేసింది. సైమా ఠాకూర్ (2/21), రాధాయాదవ్(2/40) ధాటికి కంగారూలు నిలదొక్కుకోలేకపోయారు. కెప్టెన్ విల్సన్ (49) ఆకట్టుకుంది.

బెంగళూరు నుంచి ముంబైకి

- వన్డే వరల్డ్‌కప్ షెడ్యూల్ మార్పు



న్యూఢిల్లీ: ప్రతిష్టాత్మక వన్డే ప్రపంచకప్ షెడ్యూల్ మార్పులు చోటు చేసుకున్నాయి. మెగాటోర్నీలో మ్యాచ్‌లను బెంగళూరు నుంచి ముంబైకి మారుస్తూ ఐసీసీ శుక్రవారం కొత్త షెడ్యూల్‌ను ప్రకటించింది. ఇంతకుముందు ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం బెంగళూరు చిన్నస్వామి స్టేడియం వరల్డ్‌కప్ మ్యాచ్‌లకు ఆతిథ్యమివ్వాల్సి ఉంది. కానీ ఇటీవల ఐపీఎల్ టైటిల్ గెలిచిన జోష్‌లో ఆర్‌సీబీ విక్టరీ పరేడ్‌లో తొక్కిసలాట ఘటనతో సీన్ మొత్తం మారిపోయింది. తొక్కిసలాటపై దేశవ్యాప్తంగా తీవ్ర విమర్శలకు దారితీయడంతో చిన్నస్వామి స్టేడియంలో మ్యాచ్‌ల నిర్వహణకు అవకాశం లేకుండా పోయింది. దీంతో మ్యాచ్‌లను బెంగళూరు నుంచి ముంబైకి మార్చాల్సి వచ్చింది. 'అనుకోని కారణాల వలన వేదికను వేరే చోటికి మార్చాల్సి వచ్చింది. మహిళల క్రికెట్‌ను మరో స్థాయికి తీసుకెళ్లేందుకు ఐదు ప్రపంచ స్థాయి వేదికలను సిద్ధం చేశాం' అని ఐసీసీ చైర్మన్ జై షా పేర్కొన్నాడు. సెప్టెంబర్ 30 నుంచి మెగాటోర్నీ మొదలుకానుంది.



ఎలావెనిల్‌కు స్వర్ణం

షిమ్కెంట్(కజకిస్థాన్): ఏషియన్ చాంపియన్‌షిప్‌లో శుక్రవారం జరిగిన మహిళల 10మీటర్ల ఎయిర్ రైఫిల్ ఫైనల్లో భారత యువ షూటర్ ఎలావెనిల్ వాలరివన్ పసిడి పతకంతో మెరిసింది. ఎలావెనిల్ ఫైనల్లో 253.6 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి స్వర్ణం కైవసం చేసుకుంది. ఇదే విభాగంలో భారత షూటర్ మెహులీ ఘోశ్(208.9) నాలుగో స్థానంలో నిలిచి త్రుటిలో పతకం చేజార్చుకుంది. మహిళల జూనియర్ 10మీటర్ల ఎయిర్ రైఫిల్ ఫైనల్లో శాంభవి, హృద్యశ్రీ, ఇషా పసిడి దక్కించుకుంది.

కొత్తకొత్తగా పీకేఎల్



ముంబై: ప్రొ కబడ్డీ లీగ్(పీకేఎల్) 12వ సీజన్ కొత్త హంగులతో రాబోతున్నది. అభిమానులకు మరింత మజాను అందించాలన్న ఉద్దేశంతో లీగ్ ఫార్మాట్‌లో మార్పులు, చేర్పులు చేశారు. ఈనెల 29 నుంచి విశాఖపట్నం వేదికగా మొదలయ్యే లీగ్ జైపూర్, చెన్నై, ఢిల్లీ నగరాల్లో జరుగనుంది. ఈసారి లీగ్ దశలో మొత్తం 108 మ్యాచ్‌లు ఉంటాయి. ప్రతీ టీమ్ 18 మ్యాచ్‌లు ఆడుతుంది. ఫలితం సమమైతే విజేతను నిర్ణయించేందుకు టై బ్రేకింగ్ నిర్వహిస్తారు. దీనికి తోడు గోల్డెన్ రైడ్ విధానాన్ని లీగ్ స్టేజ్‌కు వర్తింపజేశారు. కొత్తగా ప్లేఇన్స్ అనే రౌండ్‌తో పాటు ప్లేఆఫ్స్ విధానంలోనూ మార్పులు చేశారు. దీని ద్వారా టాప్-8 జట్లకు ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించే అవకాశముంటుంది.

ఎల్బీ స్టేడియానికి ఇదేం గతి!

- ప్రైవేట్ కార్యక్రమాలకు కిరాయిగా మారిన వైనం
- ఇష్టారాజ్యంగా వాడుతున్న నిర్వాహకులు
- రూపురేఖలు కోల్పోయిన క్రీడా మైదానం
- ప్రభుత్వ తీరుపై క్రీడా ఔత్సాహికుల ఆగ్రహం



నమస్తే తెలంగాణ క్రీడా విభాగం

గతమెంతో ఘనం..ప్రస్తుతమే దైవాధీనం అన్నట్లు ఉంది చారిత్రక ఎల్బీ స్టేడియం పరిస్థితి. సరిగ్గా 75 ఏండ్ల క్రితం 1950లో నిర్మితమైన ఫతేమైదాన్(ఎల్బీ స్టేడియం) ఎన్నో చారిత్రక సందర్భాలకు వేదిక. అసఫ్ జాహీ పాలనలో మొఘల్ సైనికుల విజయోత్సవానికి వేదికైన ఫతే మైదాన్ ప్రాభవాన్ని కోల్పోయే పరిస్థితికి వచ్చింది. భారత క్రికెట్ జట్టుకు పెట్టని కోట లాంటి స్టేడియం అంతకంతకు ప్రభ కోల్పోతున్నది. లెక్కకు మిక్కిలి జాతీయ, అంతర్జాతీయ క్రీడా ఈవెంట్లకు వేదికైన స్టేడియం ప్రస్తుతం ప్రైవేట్ ఫంక్షన్ ప్యాలెస్‌ను తలపిస్తున్నది. సంధు దొరికినప్పుడల్లా స్పోర్ట్స్ పాలసీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ, క్రీడలకు పెద్దపీట అంటూ ఊదరగొడుతున్న రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ధనార్జనే ధ్యేయంగా ఎల్బీ స్టేడియాన్ని విచ్చలవిడిగా వాడుతున్నది. ఇప్పటికే పలు రాజకీయ పార్టీల సమావేశాలకు కేంద్రబిందువుగా మారిన స్టేడియం తాజాగా సంగీత కచేరీలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తున్నది. నగరం నడిబొడ్డున అందరికీ అనుకూలంగా ఉన్న స్టేడియంలో క్రీడా టోర్నీలు నిర్వహించాల్సింది పోయి ప్రైవేట్ కార్యక్రమాలకు అడ్డగా మారిపోయింది. ఇటీవలి వర్షాలకు చిత్తడిగా మారిన మైదానం కార్యక్రమాల నిర్వహణతో పూర్తిగా రూపురేఖలు కోల్పోయి బురదమయంగా మారింది. దేశానికి భవిష్యత్ ప్లేయర్లను అందించాల్సిన స్టేడియం కాస్తా సాట్స్‌కు కిరాయి అందించే వనరుగా మారింది. స్టేడియం పరిస్థితిపై ఔత్సాహిక క్రీడాకారులు, మాజీ ప్లేయర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఫతే మైదాన్(ఎల్బీ స్టేడియం) దీనస్థితికి చేరింది. గతంలో ఎన్నడూ లేని విధంగా క్రీడలకు పెద్దపీట వేస్తున్నామంటూ జబ్బలు చరుచుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆచరణలో ఘోరంగా విఫలమవుతున్నది. ఉన్న స్టేడియాలను సరిగ్గా సద్వినియోగం చేసుకోలేకపోతున్న ప్రభుత్వం వాటిని ప్రైవేట్ కార్యక్రమాలకు అడ్డాగా మారుస్తున్నది. ఈవెంట్‌కు ఇంత అంటూ బడ్జెట్ నిర్ణయిస్తూ సంగీత కచేరీలు నిర్వహిస్తున్నది. గతంలోనే ఒక ప్రముఖ బాలీవుడ్ సింగర్ మ్యూజికల్ నైట్‌తో తీవ్ర విమర్శల పాలైన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మరో కార్యక్రమానికి తెరతీసింది. శనివారం ఒక ప్రముఖ టీవీ ఆధ్వర్యంలో ఫోక్‌నైట్ నిర్వహిస్తున్నారు. దీని కోసం స్టేడియంలో ఏర్పాట్లు సాగుతున్నాయి. అయితే ఇటీవల ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మైదానం మొత్తం చిత్తడిగా మారిపోయింది. కార్యక్రమ నిర్వహణ కోసం సామాగ్రిని తరలించేందుకు భారీ వాహనాలను మైదానంలోకి తీసుకురావడంతో మైదానం మొత్తం రూపురేఖలు కోల్పోయింది. ఇందుకు అద్దె కింద సాట్స్‌కు 9 లక్షలు చెల్లించినట్లు తెలిసింది. టికెట్ల ద్వారా తిరిగి రెట్టింపు మొత్తంలో డబ్బును పొందేందుకు ప్రయత్నిస్తున్నాయి. క్రికెట్‌తో పాటు పలు క్రీడాటోర్నీలకు ఆతిథ్యమిచ్చే ఎల్బీ స్టేడియం ప్రస్తుత పరిస్థితి చూస్తే ఎవరైనా ముక్కున వేలేసుకునే పరిస్థితికి వచ్చింది. అసలు ఇది స్టేడియమేనా అన్న స్థితిలో కనిపిస్తున్నది. భారీ స్థాయిలో వచ్చే ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని నిర్వాహకులు పెద్ద పెద్ద ఎల్‌ఈడీ స్క్రీన్లు, భారీ స్టేజ్ సెటప్‌తో నానా హంగామా కనిపిస్తున్నది. క్రీడలకు రికార్డు స్థాయిలో బడ్జెట్ కేటాయించామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం ప్రైవేట్ కార్యక్రమాలకు కిరాయి ఇస్తూ డబ్బులు ఆర్జించడంపై క్రీడాభిమానులు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. 'పే అండ్ యూజ్' తరహాలో సాట్స్ అవలంభిస్తున్న వైఖరిని తప్పుబడుతున్నారు. తమ కార్యక్రమాల నిర్వహణ కోసం కొందరు సాట్స్‌తో సంబంధం లేకుండా మంత్రులు, సీఎం స్థాయిలో పైరవీలు చేస్తూ కోట్లు కొల్లగొడుతున్నారు.



తీరుమారని సాట్స్

తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (సాట్స్) తీరు మారడం లేదు. ఇది వరకే గచ్చిబౌలి స్టేడియంలో ప్రముఖ సంగీత దర్శకుడు కార్యక్రమానికి అద్దె ఇచ్చి అభాసుపాలైన సాట్స్ తమ వైఖరి మార్చుకోలేదు. ఒలింపిక్స్‌లో పతకాలు సాధించే స్థాయికి రాష్ట్ర ప్లేయర్లు ఎదగాలని సీఎం గొప్పలకు పోతూ ఉంటే సాట్స్ మాత్రం ఆదాయ ఆర్జన కోసం పెడదారి పడుతున్నది. స్టేడియం మెయింటెన్స్ కోసం లక్షలకు లక్షలు ఇబ్బడి ముబ్బడిగా కిరాయి ఇస్తూ ఆదాయం సొమ్ము చేసుకుంటున్నది. క్రీడలకు భారీ బడ్జెట్ అంటూ గాలి మాటలు చెబుతున్న ప్రభుత్వం ఇలా స్టేడియంలో ప్రైవేట్ కార్యక్రమాలు నిర్వహిస్తూ విమర్శల పాలవుతున్నది. సంగీత కచేరీలు, మ్యూజికల్ నైట్స్ ద్వారా స్టేడియం రూపురేఖలను దెబ్బతీస్తున్న సాట్స్ ఇకనైనా క్రీడాటోర్నీలకు తప్ప మిగతా వాటికి ఉపయోగించవద్దంటూ క్రీడాభిమానులు కోరుకుంటున్నారు. ప్రతీ రోజు మైదానంలో ప్రాక్టీస్ చేసుకునే పిల్లలు ఇలాంటి వాటి వాళ్ల తమ అద్భుతమైన కెరీర్‌లను ఆదిలోనే తుంచేసుకునే పరిస్థితికి ప్రభుత్వం తీసుకురావడంపై పలువురు మాజీ ప్లేయర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్టేడియాలను ఇప్పటి నుంచైనా క్రీడా టోర్నీలకు వినియోగించేలా ప్రణాళికలు రూపొందించాలని సూచిస్తున్నారు.



క్రికెట్‌కు సుల్తానా వీడ్కోలు

న్యూఢిల్లీ: అంతర్జాతీయ క్రికెట్ కెరీర్‌కు భారత వెటరన్ ప్లేయర్ గౌహర్ సుల్తానా వీడ్కోలు పలికింది. అన్ని రకాల ఫార్మాట్ల నుంచి వైదొలుగుతున్నట్లు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొంది. అంతర్జాతీయ స్థాయిలో దేశానికి ప్రాతినిధ్యం వహించే అవకాశం రావడం చాలా గర్వంగా ఉందని తెలిపింది. తన కెరీర్‌లో టీమ్ఇండియా తరఫున 50 వన్డేలు 37 టీ20 మ్యాచ్‌లు ఆడిన 37 ఏండ్ల హైదరాబాదీ సుల్తానా లెఫ్టార్మ్ స్పిన్‌తో వికెట్ల వేట కొనసాగించింది. వన్డేల్లో 19.39 సగటుతో 66 వికెట్లు తీసిన సుల్తానా టీ20ల్లో 26.27 సగటుతో 29 వికెట్లు ఖాతాలో వేసుకుంది. కెరీర్‌లో 2009, 2013 వన్డే ప్రపంచకప్ టోర్నీలు ఆడిన ఈ హైదరాబాదీ స్పిన్నర్ 11 మ్యాచ్‌ల్లో 12 వికెట్లు తీసింది.

సఫారీలదే సిరీస్

మకాయ్: ఆస్ట్రేలియాతో మూడు వన్డేల సిరీస్‌ను దక్షిణాఫ్రికా మరో మ్యాచ్ ఉండగానే కైవసం చేసుకుంది. శుక్రవారం రెండో వన్డేలో సఫారీలు 84 పరుగుల తేడాతో ఆసీస్‌పై గెలిచింది. తొలుత బ్రిట్జ్కె (88), స్టబ్స్ (74) అర్ధసెంచరీలతో దక్షిణాఫ్రికా 49.1 ఓవర్లలో 277 పరుగులు చేసింది. లక్ష్యఛేదనలో ఎంగ్డీ (5/42) ధాటికి ఆసీస్ 37.4 ఓవర్లలో 193 పరుగులకు ఆలౌటైంది.

భారత్ గెలుపు జోరు

థింపు: సాఫ్ అండర్-17 మహిళల చాంపియన్‌షిప్‌లో భారత గెలుపు జోరు కొనసాగుతున్నది. శుక్రవారం జరిగిన పోరులో భారత్ 2-0తో బంగ్లాదేశ్‌పై అద్భుత విజయం సాధించింది. భారత్ తరఫున పెర్ల్ ఫెర్నాండెజ్(14ని), బోనిఫిలియా(76ని)గోల్స్ చేశారు. ఈ విజయంతో ఆరు పాయింట్లతో టీమ్ఇండియా ప్రస్తుతం గ్రూపులో అగ్రస్థానంలో ఉన్నది.

వాణిజ్య

ఐటీ బిల్లుకు రాష్ట్రపతి సై

న్యూఢిల్లీ, ఆగస్టు 22: ఆదాయ పన్ను (ఐటీ) చట్టం-2025కు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదం లభించింది. దీంతో వచ్చే ఆర్థిక సంవత్సరం (2026-27) మొదలు (ఏప్రిల్ 1, 2026 నుంచి) కొత్త ఐటీ చట్టం దేశంలో అమల్లోకి రానున్నది. కాగా, గురువారమే రాష్ట్రపతి సమ్మతి తెలియజేశారంటూ శుక్రవారం ఎక్స్‌లో ఐటీ శాఖ ప్రకటించింది. ఇక దాదాపు ఆరున్నర దశాబ్దాల క్రితం 1961లో తెచ్చిన ఐటీ చట్టాన్ని సవరిస్తూ మోదీ సర్కారు నూతన ఐటీ బిల్లును తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఈ నెల 12నే పార్లమెంట్‌లో ఇది పాసైంది. చట్టంలోని భాష, సెక్షన్లు, చాప్టర్లు, పదాలను తగ్గించామని కేంద్రం చెప్తున్నది.

3న జీఎస్టీ కౌన్సిల్ భేటీ

న్యూఢిల్లీ, ఆగస్టు 22: వచ్చే నెల 3 నుంచి 4 వరకు రెండు రోజులపాటు జీఎస్టీ కౌన్సిల్ సమావేశం కాబోతున్నది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన న్యూఢిల్లీలో జరగనున్న ఈ సమావేశంలోనే జీఎస్టీ స్లాబుల కుదింపుపై చర్చించనున్నారు.

సూచీల వరుస ర్యాలీకి బ్రేక్

ముంబై, ఆగస్టు 22: దేశీయ స్టాక్ మార్కెట్ల వరుస ర్యాలీకి బ్రేక్‌పడింది. వరుసగా ఆరు రోజులుగా లాభాల్లో దూసుకుపోయిన సూచీలు ఒక్క శాతం వరకు నష్టపోయాయి. వడ్డీరేట్లపై అమెరికా ఫెడరల్ రిజర్వు చైర్మన్ జెరోమ్ పావెల్ జాక్సన్ సమావేశంపై మదుపరులు దృష్టి సారించడంతోపాటు అంతర్జాతీయ వాణిజ్య అనిశ్చిత పరిస్థితులు కొనసాగుతుండటం కూడా సూచీల పతనానికి ప్రధాన కారణాలు. వారంతం ట్రేడింగ్‌లో బ్లూచిప్ సంస్థలైన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు భారీగా పతనం చెందడం మార్కెట్ల పతనానికి ఆజ్యంపోసింది. ఇంట్రాడేలో 700 పాయింట్లకు పైగా నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 693.86 పాయింట్లు నష్టపోయి 81,306.85 వద్ద స్థిరపడింది. మరో సూచీ నిఫ్టీ సైతం 213.65 పాయింట్లు నష్టపోయి 25 వేల పాయింట్ల దిగువకు పడిపోయింది. మార్కెట్ ముగిసే సమయానికి 24,870.10 వద్ద స్థిరపడింది.

పసిడి విలువలో 90 శాతం రుణం

ప్రత్యేక స్కీంను ప్రవేశపెట్టిన సౌత్ ఇండియన్ బ్యాంక్



న్యూఢిల్లీ, ఆగస్టు 22: బంగారం తాకట్టుపై రుణం తీసుకోవాలనుకుంటున్నారా అయితే మీకు సువర్ణ అవకాశం. ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకులు, గోల్డ్‌లోన్లు ఇచ్చే ఆర్థిక సేవల సంస్థలు కేవలం తక్కువ రుణం మంజూరు చేస్తున్నాయి. కానీ ప్రైవేట్ రంగ ఆర్థిక సేవల సంస్థయైన సౌత్ ఇండియన్ బ్యాంక్ మాత్రం తాకట్టుపెట్టిన పుత్తడి విలువలో 90 శాతం రుణం మంజూరు చేయనున్నట్టు శుక్రవారం ప్రకటించింది. ఇందుకోసం బ్యాంక్ ఎస్ఐబీ గోల్డ్ ఎక్స్‌ప్రెస్ పేరుతో ప్రత్యేక స్కీంను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ స్కీం కింద ఖాతాదారుడికి వెనువెంటనే రుణాన్ని మంజూరు చేయడంతోపాటు ఎప్పుడైనా తిరిగి చెల్లింపులు జరుపుకునే వీలు కల్పించింది. మూడేండ్ల కాలపరిమితితో రూ.25 వేల నుంచి రూ.25 లక్షల లోపు ఎంతైనా రుణాన్ని మంజూరు చేయనున్నట్టు బ్యాంక్ ఒక ప్రకటనలో వెల్లడించింది.

చిన్న వ్యాపారులే లక్ష్యం

చిన్న స్థాయి వ్యాపారస్తులు లక్ష్యంగా చేసుకొని బ్యాంక్ ఈ ప్రత్యేక గోల్డ్ స్కీంను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ స్కీం కింద ఎంఎస్‌ఎంఈ, నాన్-ఎంఎస్‌ఎంఈ, చిన్న వ్యాపారస్తులు, కూరగాయల విక్రయదారులు, తమ వ్యాపార విస్తరణకోసం అవసరమయ్యే నిధులు, నిర్వహణ ఖర్చులు లేదా వ్యక్తిగత వెంచర్స్ కోసం అవసరమైన వారికి ఈ రుణాన్ని ఇవ్వనున్నది. రుణగ్రహీతలకు పారదర్శకంగా, ఎలాంటి అదనపు ఖర్చులు విధించడం లేదు. పూర్తిగా డిజిటల్ రూపంలోనే రుణాన్ని మంజూరు చేస్తున్నది బ్యాంక్. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని శాఖల్లో బంగారం తాకట్టుపై రుణాన్ని తీసుకోవచ్చునని తెలిపింది.

మహిళా మదుపర్లకు జోష్

- మ్యూచువల్ ఫండ్స్‌లో తొలిసారి ఇన్వెస్ట్ చేసేవారికి అదనపు ప్రోత్సాహకాలు
- పరిశీలిస్తున్నామన్న సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే



ముంబై, ఆగస్టు 22: మ్యూచువల్ ఫండ్స్‌ల్లో మహిళా మదుపరుల భాగస్వామ్యాన్ని పెంచడంపై మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ దృష్టి పెట్టింది. ఈ క్రమంలోనే తొలిసారి పెట్టుబడులు పెట్టేవారికి అదనపు ప్రోత్సాహకాలను పరిచయం చేసే యోచనలో ఉన్నట్టు సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే తెలిపారు. శుక్రవారం ఇక్కడ భారతీయ మ్యూచువల్ ఫండ్స్ అసోసియేషన్ (యాంఫీ) నిర్వహించిన ఓ కార్యక్రమానికి హాజరైన పాండే మాట్లాడుతూ.. దేశ ఆర్థిక వ్యవస్థలో అందర్నీ భాగస్వాములను చేయాల్సిన అవసరం ఉందని, పురుషులతో సమానంగా మహిళలూ ప్రాతినిథ్యం వహించాలని, వారిపాత్ర లేనిదే 'ఫైనాన్షియల్ ఇంక్లూజన్' అసంపూర్తిగా ఉంటుందన్నారు. అందుకే ప్రస్తుతం స్టాక్ మార్కెట్లలో, ముఖ్యంగా మ్యూచువల్ ఫండ్స్ ద్వారా పెట్టుబడులు పెట్టే మహిళల్ని ప్రోత్సహించాలని చూస్తున్నట్టు చెప్పారు. ఇందులో భాగంగానే అదనపు ప్రోత్సాహకాలను పరిశీలిస్తున్నట్టు వివరించారు. నిజానికి మ్యూచువల్ ఫండ్ ఇండస్ట్రీకి చేయూత ఇవ్వడానికి అనేక చర్యలు తీసుకుంటున్నామని ఆయన ఈ సందర్భంగా చెప్పారు. ఇటీవలే ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో తొలిసారి పెట్టుబడులకు ముందుకొచ్చే ఇన్వెస్టర్లను పెంచడానికి డిస్ట్రిబ్యూటర్లకు ప్రోత్సాహకాలను ప్రతిపాదించినట్టు గుర్తుచేశారు.

ఇన్వెస్టర్ ఫ్రెండ్లీగా..

దేశంలో మ్యూచువల్ ఫండ్ పరిశ్రమను మరింత పారదర్శకంగా, ఇన్వెస్టర్ ఫ్రెండ్లీగా మార్చే దిశగా అడుగులు వేస్తున్నట్టు పాండే తెలియజేశారు. సంప్రదింపుల ప్రక్రియ కింద వస్తున్న అభిప్రాయాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పోర్ట్‌ఫోలియో స్కీముల్లో ఓవర్‌లాప్ సమస్యను పరిష్కరించి, సరికొత్త ప్రొడక్ట్స్ వచ్చేలా కృషి చేస్తున్నామన్నారు. ఇదిలావుంటే రిటైల్ ఇన్వెస్టర్లు, అమాయక మదుపరుల ప్రయోజనాలకు పెద్దపీట వేసేలా సెబీ పలు నిర్ణయాలు తీసుకుంటున్న సంగతి విదితమే. స్టాక్ మార్కెట్ లావాదేవీల్లో అక్రమాలకు తావు లేకుండా చర్యలు చేపడుతున్నది. అయినప్పటికీ మోసగాళ్ల బారినపడి చిన్న మదుపరులు నష్టపోతూనే ఉండగా, చట్టాలను మరింత కట్టుదిట్టం చేయాల్సిన అవసరం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

మోసపూరిత స్కీములతో జాగ్రత్త

మోసపూరిత ట్రేడింగ్ పథకాలతో ఇన్వెస్టర్లు జాగ్రత్తగా ఉండాలని సెబీ హెచ్చరించింది. వాట్సాప్, టెలిగ్రామ్ తదితర సామాజిక మాధ్యమాల సందేశాలు, మొబైల్ అప్లికేషన్ల (యాప్స్) ద్వారా విదేశీ పోర్ట్‌ఫోలియో లేదా సంస్థాగత మదుపర్ల ముసుగులో స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులకు అవకాశాలు కల్పిస్తామని, ఆకర్షణీయ రాబడులను అందిస్తామని చెప్తే నమ్మవద్దని ఓ ప్రకటనలో సూచించింది. ఐపీవోల్లో కచ్చితమైన అలాట్‌మెంట్లు ఇస్తామని, డిస్కౌంట్ ధరలకే షేర్లను కొనుక్కోవచ్చని అంటే తొందరపడి నిర్ణయాలు తీసుకోవద్దని కోరింది. అమాయక మదుపరులే లక్ష్యంగా మోసగాళ్లు ఈ తరహా తప్పుడు ప్రకటనలు చేస్తారని వివరించింది. సెబీ నమోదిత ఇంటర్మీడియరీస్ ఆఫర్ చేసే విశ్వసనీయ ట్రేడింగ్ యాప్స్‌నే వినియోగించాలని స్పష్టం చేసింది.

హైదరాబాద్‌లో ప్రీమియం ఎనర్జీ ప్లాంట్ ప్రారంభం


రూ.642 కోట్లతో సోలార్ సెల్ లైన్ ఏర్పాటు చేసిన సంస్థ



హైదరాబాద్, ఆగస్టు 22: రెన్యూవబుల్ ఎనర్జీ సంస్థ ప్రీమియర్ ఎనర్జీ..హైదరాబాద్‌లో రూ.642 కోట్ల పెట్టుబడితో నెలకొల్పిన 1.2 గిగావాట్ల సోలార్ సెల్ లైన్‌లో ఉత్పత్తిని ప్రారంభించింది. ఈ సోలార్ సెల్ లైన్‌లో ఎన్ టైప్ జీ12ఆర్(టెక్నాలజీ) ఉపయోగించి అధిక సామర్థ్యం కలిగిన పెద్ద ఫార్మాట్ 620 డబ్ల్యూ డీసీఆర్ టాప్‌కాన్ సోలార్ మాడ్యుల్స్‌ను ఉత్పత్తి చేయనున్నట్టు ప్రకటించింది. గతంలో వినియోగించిన మోనో పెర్క్ కంటే టాప్‌కాన్ మాడ్యుల్స్ అత్యంత బలమైనవని కంపెనీ వర్గాలు వెల్లడించారు. అధిక సామర్థ్యం కలిగిన మాడ్యుల్స్‌ను తయారు చేసే సంస్థలను కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నదని, దీంతో వీటికి డిమాండ్ కూడా అధికంగా ఉంటుందని ప్రీమియర్ ఎనర్జీస్ ఎండీ, సీఈవో చిరంజీవ్ సాలుజా తెలిపారు. భవిష్యత్తు అంతా ఇదే టెక్నాలజీ వినియోగించనున్నట్టు, 620 డబ్ల్యూ డీసీఆర్ మాడ్యుల్ మార్కెట్లోకి రానున్నాయన్నారు. దేశీయ రెన్యూవబుల్ ఎనర్జీ రంగంలో అగ్రగామి సంస్థల్లో ఒకటైన ప్రీమియర్ ఎనర్జీ ప్రస్తుతం 7.1 గిగావాట్ల తయారీ సామర్థ్యం కలిగివున్నది. వీటిలో 2 గిగావాట్ల సోలార్ సెల్స్, 5.1 గిగావాట్ల సోలార్ మాడ్యుల్స్ ఉన్నాయి. భవిష్యత్తులో ఈ సామర్థ్యాన్ని 12.4 గిగావాట్లకు పెంచుకోనున్నట్లు ప్రకటించింది.

కేకు తినిపించిన చేత్తోనే కత్తితో పొడిచి హత్య

- చోరీకి వచ్చి బాలికను చంపిన పక్కింటి బాలుడు
- దేవుడి గల్లాపెట్టెను దొంగిలించేందుకు యత్నం
- చూసి అడ్డుకున్న చిన్నారి.. కత్తితో పొడిచి హతం
- బాలికపై 18 కత్తిపోట్లు.. నిందితుడు టెన్త్ విద్యార్థి
- ఐదు రోజులకు వీడిన సహస్ర హత్య కేసు మిస్టరీ
- వెబ్ సిరీస్ చూసి దొంగతనానికి పేపర్‌పై స్క్రిప్ట్



హైదరాబాద్ సిటీబ్యూరో/మూసాపేట, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ): తెలుగు రాష్ర్టాల్లో తీవ్ర కలకలం రేపిన పదేండ్ల బాలిక సహస్ర హత్యకేసు చిక్కుముడి ఎట్టకేలకు వీడింది. పక్కింట్లో ఉండే పదో తరగతి విద్యార్థే ఈ ఘాతుకానికి ఒడిగట్టినట్టు పోలీసు దర్యాప్తులో తేలింది. చిన్నారి బర్త్‌డే రోజున కేక్ తినిపించిన చేతులతోనే కత్తితో విచక్షణా రహితంగా ఆమెను పొడిచి చంపాడని తెలిసి స్థానికుల్లో దిగ్భ్రాంతి వ్యక్తమైంది. తరచూ క్రైమ్ సంబంధిత సన్నివేశాలు చూసే అలవాటున్న బాలుడు దొంగతనం ఎలా చేయాలో ఓటీటీలో ఒక క్రైమ్ వెబ్ సిరీస్ చూసి పేపర్‌పై స్క్రిప్ట్ రాసుకుని మరీ ఈ దారుణానికి పాల్పడ్డట్టు తెలిసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సంగారెడ్డి జిల్లాకు చెందిన కృష్ణ, రేణుక దంపతులు తమ కూతురు సహస్ర(10), కొడుకు సద్విన్ (8)తో కలిసి రెండేండ్లుగా కూకట్‌పల్లి, సంగీత్‌నగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్ పెంట్‌హస్‌లో ఉంటున్నారు. అదే అపార్ట్‌మెంట్‌కు ఆనుకుని ఉన్న మరో అపార్ట్‌మెంట్ 4వ అంతస్తులో 10వ తరగతి చదువుతున్న బాలుడు తన తల్లి, ఇద్దరు సోదరిలతో ఉంటున్నాడు. బాలుడి తండ్రి కుటుంబాన్ని పెద్దగా పట్టించుకోకపోవడంతో తల్లి స్థానికంగా కిరాణా షాపు నిర్వహిస్తూ పోషిస్తున్నది. సహస్ర తమ్ముడుతో స్నేహం చేసిన 10వ తరగతి బాలుడు తరచూ ఆడుకునేందుకు వారి ఇంటికి వెళ్లేవాడు. ఈ క్రమంలో వారి ఇంట్లో ఉన్న దేవుడి గల్లాపెట్టెపై కన్నేశాడు. ఈ నెల 18న సహస్ర తల్లిదండ్రులు ఉద్యోగ రీత్యా బయటకు వెళ్లడంతో ఇంట్లో ఎవరూ లేరని బావించి భవనం 3వ అంతస్తు నుంచి సహస్ర ఉండే భవనంలోకి దూకి వారి ఇంట్లో చొరబడి దొంగతనానికి యత్నించాడు. ఆ రోజున పాఠశాలకు సెలవు కావడంతో ఇంట్లో ఒంటరిగా ఉన్న చిన్నారి గమనించి కేకలు వేసింది. దొంగతనానికి వచ్చిన విషయాన్ని తమ తల్లిదండ్రులకు చెప్తానని బెదిరించింది. దీంతో దొరికిపోతానని భావించిన బాలుడు వెంట తెచ్చుకున్న కత్తితో సహస్రను పొడిచి హత్యచేశాడు. చనిపోయిందో లేదోనన్న అనుమానంతో మరోసారి బాలిక గొంతుపై పలుమార్లు కత్తితో పొడిచి పారిపోయాడు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఇచ్చిన సమాచారంతో

ఘటన జరిగిన అపార్ట్‌మెంట్‌తో పాటు చుట్టుపక్కల కూడా ఎక్కడా సీసీ కెమెరాలు లేకపోవడంతో చిన్నారి హత్యకేసు దర్యాప్తు పోలీసులకు సవాల్‌గా మారింది. భవనంలోకి చొబడేందుకు ఉన్న అవకాశాలపై పోలీసులు అన్వేషణ మొదలు పెట్టి వెనకాల ఉన్న అపార్ట్‌మెంట్ వాసులను విచారించారు. ఈ క్రమంలో వర్క్ ఫ్రమ్ హోమ్‌లో ఉన్న ఒక సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌ను విచారించగా హత్య జరిగిన రోజు తన గది పక్కనే సుమారు అరగంటకు పైగా ఓ బాలుడు దాగున్నట్టు తెలిపాడు. ఆ బాలుడు అదే అపార్ట్‌మెంట్‌లో ఉంటాడని తెలుసుకున్న పోలీసులు అతడి పాఠశాలకు వెళ్లి అదుపులోకి తీసుకొని తమదైన శైలిలో విచారించడంతో నేరాన్ని అంగీకరించినట్టు తెలిసింది. బాలుడి ఇంట్లో సోదాలు చేయగా హత్యకు వాడిన కత్తి, రక్తపు మరకలతో కూడిన దుస్తులు, స్క్రిప్ట్ రాసుకున్న పేపర్ దొరికాయి.

వెబ్ సిరీస్ చూసి

ఆ బాలుడికి తరచూ నేర పూరితమైన చిత్రాలు, వెబ్ సిరీస్‌లను చూసే అలవాటు ఉన్నది. ఈ క్రమంలోనే ఘటనకు రెండు రోజుల ముందు ఓటీటీలో క్రైమ్ వెబ్‌సిరీస్ చూసి సహస్ర ఇంట్లో దొంగతనానికి స్కెచ్ వేశాడు. దొంగతనం ఎలా చేయాలి? చేసిన తర్వాత ఎలా తప్పించుకోవాలి?, ఆధారాలు దొరక్కుండా ఎలా జాగ్రత పడాలి? అన్న అంశాలను పేపర్‌పై రాసుకున్నట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది. గత ఏప్రిల్ 19న సహస్ర జన్మదినానికి కూడా బాలుడు వచ్చి కేక్ తినిపించినట్టు తెలిసింది. బాలిక శరీరంపై 18 కత్తిపోట్లు ఉన్నాయి. కేకు తినిపించిన చేత్తోనే ఆ బాలుడు కత్తితో బాలికను చంపాడని తెలిసి స్థానికులు దిగ్భ్రాంతికి లోనయ్యారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, H.Nos. 9-87/3, 9-87/1, Adj to Jenvi Conventions, Tumkunta, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.